క్రాంతి

### లోపలి పేజీల్లో

ఐదు రాష్ట్రాల ఎన్నికలు
సింగరేణి నిర్వాసితుల సమస్యపై
ఇరాన్‌పై అమెరికా దాడికి కుట్ర
అమరవీరుల సంస్మరణ వారోత్సవం
ఆంధ్రప్రదేశ్ నిర్బంధంపై
ప్రతిఘటన, పోరాట వార్తలు
భూటాన్ కమ్యూనిస్టు పార్టీ ప్రకటన

సి.పి.ఐ (మావోయిస్టు) ఎ.పి, ఎన్.టి, ఎ.ఒ.బి కమిటీల అధికార పత్రిక

సంపుటి : 30 సంచిక : 3 మే- జూన్ 2006 వెల: ఐదు రూపాయలు

# ప్రపంచ బ్యాంకు, దళారీ పాలక వర్గాల పాదసేవకు పునరంకితమైన వై.యస్ రెండేళ్ళ పాలన

వై.యస్.రాజశేఖర్ రెడ్డి అధికారం చేపట్టిన ఈ రెండేళ్ళలో తాను సాధించిన 'నీటి బుడగ అభివృద్ధి'ని ప్రజలకు చాటుకోవానికి పునరంకిత సభను పెట్టి ప్రచారం చేశాడు. ఆ శాసనసభ ఎన్నికల ముందు పాదయాత్రలు చేసి తమకు అధికారం అప్పగిస్తే మిమ్మల్ని పూలల్లో పెట్టి పూజిస్తానని రాష్ట్ర ప్రజలకు అనేక హామీలూ, వాగ్దానాలు గుప్పించి అరచేతిలో వైకుంఠం చూపిన వై.యస్.ఆర్ అన్నింటినీ గాలికొదిలి ప్రపంచ బ్యాంకుకు, దోపిడివర్గాల సేవకు మాత్రమే పునరంకితమయ్యాడనేది నగ్నసత్యం. ఇది అర్థం కాకుండా ప్రజల్ని మభ్య పెట్టడానికి జలయజ్ఞం, పల్లెబాట, నగరబాట, ప్రజాపథం, ఇందిరమ్మ పథకం, డ్వాక్రా బృందాలకు పావలా వడ్డీకి రుణాలు తదితర ప్రచార కార్యక్రమాలతో ప్రజలకు ఊదరగొడుతున్నాడు. ఈ కార్యక్రమాలలో సాగునీరు, పేదలకు ఇళ్ళు, విద్యుత్, మంచినీటి సరఫరా; వ్యక్తిగత మరుగుదొడ్లు, డ్రైనేజీ సౌకర్యం; గ్రామాలకు అనుసంధానం చేసే రోడ్లు, ఎయిడ్స్ నివారణతో సహా వైద్యం, ప్రాథమిక విద్య, బలవర్ధకమైన ఆహారం; వితంతు, వృద్ధ వికలాంగులకు పెన్షన్లు; చేనేతకారులకు పింఛన్లు వంటి ఆకర్షణీయమైన అంశాల్ని ముందుకు తీసుకువచ్చాడు.

లోతుగా పరిశీలిస్తే ఇవన్నీ వై.యస్.ఆర్ అమలు చేయదల్చుకున్న ప్రపంచబ్యాంకు విధానాలకే ముసుగులు అనేది అర్థం చేసుకోవచ్చు. ప్రజాపథంలో ప్రజల నుండి సమస్యలపై గుట్టలు గుట్టలుగా దరఖాస్తులు అందాయి. దరఖాస్తులు తీసుకోవటమే గానీ పరిష్కరించిన సమస్యలేమీ లేవు. ప్రజాప్రతినిధులు ముఖ్యంగా అధికార పార్టీకి చెందిన వారు ప్రజలకు సమాధానం చెప్పలేక నూటికి 80 మంది గైర్హాజరయ్యారు. ఇక 'ఇందిరమ్మ' పథకం లబ్ధిదారుల్ని ఎంపిక చేయటంలో పెద్దయెత్తున అవినీతి జరిగింది. ఇందులో నూటికి 50 మంది బోగస్ లబ్దిదారులే. ధనికులు, ప్రవాసులు, ప్రభుత్వ ఉద్యోగులు, కాంగ్రెస్ పార్టీ వాళ్ళు ఈ లబ్దిదారుల్లో వున్నారు. చనిపోయినవాళ్ళూ, అనర్హులు కూడా లబ్దిదారులయ్యారు. అసలైన నిరుపేదలకు పక్కాగృహాలు దక్కనే లేదు. టి.డి.పి ప్రభుత్వంలో 'పనికి ఆహార పథకం' పూర్తిగా తెలుగుదేశం వాళ్లకు ఆహారమైపోతే, ఇందిరమ్మ పథకాన్ని కాంగ్రెస్ వాళ్ళు కాజేశారు. తిన్నకాడికి తిని ఇకిప్పుడు ఇందిరమ్మ పథకానికి నిధుల కొరతని పనులు కుదించేశారు. రేపసలు పూర్తిగా అటకెక్కించినా ఆశ్చర్యం లేదు. ఇక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అయితే సోనియాగాంధీ, మన్మోహన్, వై.యస్.ఆర్‌లు హెలికాప్టర్ మీద వచ్చి ఆర్భాటంగా ప్రారంభించిన బండ్లపల్లి గ్రామంలో ఆ వూరి వాసులకే ఇంతవరకు ఉపాధి కల్పించలేకపోయింది. పాపం అంతవరకు కర్ణాటక వలసపోయి బతుకుతున్న బండ్లపల్లి వాసులు ఉపాధి హామీ పథకం పుణ్యమాని రెంటికిచెడ్డ రేవడిగా తయారయ్యారు. వాస్తవానికి ఈ పథకాలన్నీ పాలకవర్గాలు చెబుతున్నట్లు ప్రజల ఆర్థిక స్థితిగతులు అభివృద్ధి పరచడమనే లక్ష్యంతో అమలయ్యేవి కావు. నానాటికీ తీవ్రమవుతున్న తమ

సమస్యలపట్ల ప్రభుత్వం పై పెల్లుబుకుతున్న ప్రజల ఆగ్రహజ్వాలలపై నీళ్ళు చల్లి, వారు విప్లవోద్యమాల వైపు మళ్ళకుండా చూడటమే వీటి పరమలక్ష్యం.

పైకి కనిపించేది ఇది కాగా, వాస్తవానికి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం బాగు చేస్తున్నది నూటికి నూరుపాళ్ళు ధనిక వర్గాలను, కార్పోరేట్ సంస్థలను, కాంట్రాక్టర్లు తదితర సెక్షన్లనే. పరిశ్రమలకు రెండు వేల ఎకరాల భూమిని కేటాయిస్తూ మంత్రివర్గం నిర్ణయం చేసింది. ఇందులో పరిశ్రమల ఏర్పాటు కోసం మౌలిక సదుపాయాలకు కోట్లాది రూపాయాలు కేటాయించారు. ఇందులో గార్మెంట్ సిటీ, టెక్స్‌టైల్ పార్కులు, ఐ.టి పార్కుల లాంటి పరిశ్రమలుంటాయి. చిత్తూరు జిల్లాలో స్పెషల్ ఎకనామిక్ జోన్ క్రింద పరిశ్రమలు ఏర్పాటు చేసే సంస్థలకు 1000 ఎకరాల భూమి, మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. నెల్లూరు జిల్లాలో తడ దగ్గర లెదర్ పార్కు పేరుతో అదిదాస్ అనే బహుళజాతి కంపెనీ ఏర్పాటు చేయబోయే బూట్ల పరిశ్రమకు వందలాది ఎకరాల భూమి, మౌలిక సదుపాయాలు కల్పించారు. ఇక ఎంతోఘనంగా తాను సాధించినట్లు వై.యస్.ఆర్ చెప్పుకుంటున్న ఫ్యాబ్‌సిటీ (చిప్ ఫ్యాబ్రికేషన్ యూనిట్)కి 1200 ఎకరాల భూమి, మౌలిక సదుపాయాలు కల్పించటం జరిగింది. ఇందులో 36 లక్షల మందికి ఉపాధి దొరుకుతుందని ఆర్భాటంగా చెబుతున్నారు. ఈ 36 లక్షల మంది నుంచి కారుచౌక శ్రమతో బహుళజాతి కంపెనీలు వేల కోట్ల లాభాన్ని దండుకుపోతుంటే ఆంధ్ర రాష్ట్రానికి మిగిలేది బూడిదతప్ప మరేమి వుండదు. ఉదా:- ఇందులో పరిశ్రమను ప్రారంభించనున్న సెమ్ ఇండియా కంపెనీ ఒక్కదానికే రకరకాల రాయితీల రూపంలో అందే మొత్తం మూడువేల కోట్ల రూపాయలకు పైనే వుంటుంది. ఈ లెక్కన ఈ ఫ్యాబ్ సిటీలో ఉత్పత్తులు చేసే కంపెనీలకు ఎన్ని వేల కోట్లు ప్రజా ధనాన్ని వై.యస్.ఆర్ సర్కార్ అప్పనంగా ముట్టజెప్పుతుందో లెక్కగడితే కళ్ళు తిరిగి పోతాయి. వీటి వల్ల వచ్చే విదేశీమారక ద్రవ్యం చాలా తక్కువ. ఒకనాడు ఇటువంటి ఐ.టి పార్కులు, సిలికాన్ వ్యాలీల్ని ప్రోత్సహించిన కర్ణాటక ప్రభుత్వం వాటివల్ల వచ్చే లాభనష్టాల్ని బేరీజు వేసుకొని వాటికిచ్చే ప్రోత్సాహాన్ని తగ్గించి, పన్నులు పెంచటంతో బెంగుళూరులోని ఐ.టి సంస్థలన్నీ మూటా ముల్లె సర్దుకుంటున్నాయి. ఇన్ఫోసిస్ ఇందుకు మంచి ఉదాహరణ. ఇలాంటి సంస్థలన్నింటికీ ఇప్పుడు కొత్త బిచ్చగాడు వై.యస్.ఆర్ దొరికాడు. హైదరాబాద్ సిటీ ఔటర్ రింగ్ రోడ్డు కోసం వేలాది పేద రైతుల్ని, దళితుల్ని బలిపెట్టబోతున్నాడు.

ఇక ప్రతిరోజు కాంగ్రెస్ నాయకులు, మంత్రులు, ఎం.ఎల్.ఎలు, పాల్పడే అవినీతికీ, కాజేసే ప్రభుత్వ భూములకు అంతే లేదు. ప్రాజెక్టులు, కాంట్రాక్టు పనుల్లో టెండర్ల అంచనాలు పెంచేసి మంత్రులు, కాంట్రాక్టర్లు, అధికార్లు కాజేసే ప్రజా ధనం వేల కోట్లలో వుంటున్నది. కాంట్రాక్టర్లు వాళ్ళే, రియల్ ఎస్టేట్ వ్యాపారులు వాళ్ళే, అధికారం అండ వుంటే చాలు అంతా వాళ్ళదే. ప్రజాకర్షక పథకాల మాటున వై.యస్ సర్కార్ అభివృద్ధి చేస్తున్నది ఈ వర్గాలనే. రాష్ట్రాన్ని దోచిపెడుతున్నది ఈ వర్గాలకే. ఈ పని మరింత బాగా చేయడానికి ప్రపంచబ్యాంకు ఆదేశాలను తు.చ తప్పకుండా అమలు చేయటానికి రాజశేఖర్ రెడ్డి పునరంకితమవుతున్నాడు.

## చంద్రబాబును మించి ప్రపంచబ్యాంకు ముందు మోకరిల్లుతున్న వై.యస్.ఆర్ ప్రభుత్వం

ఎన్నికల ముందు వాగ్దానాలు, హామీలతో ప్రజల్ని మోసగించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రపంచ బ్యాంకు తొత్తుగా మారి ప్రజలకు ద్రోహం చేసింది. అన్నింటికంటే ముఖ్యంగా ప్రపంచబ్యాంకు పాత్ర వివిధ సెక్షన్ల ప్రజల ముందు ఇప్పుడు సమస్యగా తయారైంది. టి.డి.పి ప్రపంచబ్యాంకుకు పూర్తిగా అమ్ముడుబోయిందని ఎన్నికల ముందు వై.యస్.ఆర్, చంద్రబాబు మీద తీవ్రమైన దాడి చేశాడు. ఎన్నికల్లో గెలిపించి, తమకు అధికారం కట్టబెడితే టి.డి.పి ప్రభుత్వం ప్రపంచబ్యాంకుతో చేసుకున్న ఒప్పందాలు, అమలుచేస్తున్న ప్రాజెక్టులన్నింటినీ తమ ప్రభుత్వం సమీక్షిస్తుందనీ, ఇటువంటి వినాశకరమైన షరతులతో తాము ప్రపంచబ్యాంకు అప్పులు తీసుకురామనీ వాగ్దానాలు చేశాడు. వీటన్నింటినీ ప్రజలు మరచిపోలేదు. ఈయన ప్రపంచబ్యాంకు 'సహాయం' స్వభావాన్ని సమీక్షించలేదుగానీ, వినాశకరమైన దాని షరతులకు లోబడి ప్రపంచబ్యాంకుతో సంబంధాలు ఇంకా బాగా గట్టి పరుచుకోవడమెలాగనేదాన్ని వంటపట్టించుకోవడంలో మాత్రం చంద్రబాబుని మించిపోయాడు. భూమి, నీరు, విద్యుత్, కార్మిక శ్రమ, ఇంకా ఇతర ప్రోత్సాహకాలను కారుచౌకగా కట్టబెట్టి సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల, దళారీ బడాబూర్జువా కంపెనీల పెట్టుబడుల్ని రాష్ట్రంలోకి ఆకర్షించడానికి ఎంతకైనా సిద్ధమయ్యాడు.

బహుళార్ధసాధక నాగార్జున సాగర్ డ్యామ్ ఆధునీకరణకు 3000 కోట్ల రూపాయలు, రాష్ట్ర డ్యాముల నిర్వహణ, పరిరక్షణకు 1000 కోట్లు, మునిసిపాలిటీల అభివృద్ధికి 1200 కోట్లు, ఆర్థిక వ్యవస్థ పునర్‌నిర్మాణానికి 1600 కోట్లు, పోలవరం, ఇంకా ఇతర ప్రాజెక్టుల కోసం అనేక వేల కోట్ల రూపాయల ప్రపంచబ్యాంకు ఋణాలు తీసుకోటం, లేదా తీసుకుంటున్న క్రమం కొనసాగుతున్నది. తొమ్మిది సంవత్సరాల టి.డి.పి పాలనా

కాలంలో తెచ్చిన ఋణాలకంటే ఇవి చాలా ఎక్కువ. సాగునీటి ప్రాజెక్టులకు ఋణాలు తీసుకునేటట్లైతే, సాగునీటి సంస్కరణలు అమలు చేయాలని ప్రపంచబ్యాంకు ఆదేశించింది. ప్రపంచబ్యాంకు, దాని నమ్మకమైన ఏజెంట్ కేంద్ర ఆర్థిక మంత్రి పి. చిదంబరం కలిసి నీటి పన్ను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలిచ్చారు. డ్యాముల నిర్మాణం, నిర్వహణకోసం రైతుల నుండి ప్రత్యేక నీటి పన్ను వసూలు చేయాలని కూడా ప్రపంచబ్యాంకు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నీటి వినియోగం, సాగునీటి సంస్కరణల అమలును పర్యవేక్షించడానికి జల నియంత్రణ వ్యవస్థ (వాటర్ రెగ్యులేటరీ అథారిటీ) ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ఆదేశాలిచ్చింది. అందుకు వై.యస్.ఆర్ ప్రభుత్వం వీసమెత్తు కూడా అడ్డు చెప్పకుండ నీటి పన్ను పెంపూ, జల నియంత్రణ వ్యవస్థ ఏర్పాటు, రిజిస్ట్రేషన్ ఫీజు పెంపు తదితర షరతులకు ఒప్పుకుంది. నీటి వినియోగంపై పర్యవేక్షణ, యూజర్ ఛార్జీల వసూలు, నీటి పన్ను పెంపుకు సంబంధించిన అధికారాలు జల నియంత్రణ వ్యవస్థకు వుంటాయి. జల నియంత్రణ వ్యవస్థ ఆరు నెలల్లో ఉనికిలోకి వస్తుంది. లోలోపల జరుగుతున్న దీని కార్యక్రమాలకు ప్రజల నుంచి వ్యతిరేకత వుంటుందనే భయాలు కూడా దీనికున్నాయి. ప్రపంచబ్యాంకు సాగునీటి ప్రాజెక్టులకు తానిచ్చిన అప్పులకు గాను, ప్రతినీటి బొట్టు ఖరీదును రైతుల నుంచి పిండుకోవాలనుకుంటున్నది. దీని ఫలితంగా ప్రస్తుతం ఎకరానికి 200 రూపాయలున్న నీటి తీరువాను వచ్చే ఖరీఫ్ నుంచి రూ॥ 600 - 700లకు ప్రభుత్వం పెంచనున్నది. గత ఐదారు సంవత్సరాల నుండి జల నియంత్రణ వ్యవస్థ(వాటర్ రెగ్యులేటరీ కమీషన్)ను ఏర్పాటు చేయాలని ప్రపంచబ్యాంకు డిమాండు చేస్తున్నప్పటికీ, గత టి.డి.పి ప్రభుత్వం నీటి వినియోగదారుల సంఘాలకంటే మించి ఏర్పాటు చేయడానికి సాహసించలేదు. చంద్రబాబు నాయుడు చేయడానికి సంకోచించిన ఈ పని ప్రపంచ బ్యాంకు కొత్త ఏజెంటు అయిన వై.యస్ రాజశేఖర్ రెడ్డి మాత్రం నిస్సంకోచంగా చేయడానికి సిద్ధపడి, దాని పాదాల ముందు సాగిలపడుతున్నాడు. చిన్న, మధ్యతరహా, పెద్ద సాగునీటి ప్రాజెక్టులన్నింటితో పాటు చెఱువులు కూడా ఈ వ్యవస్థ పర్యవేక్షణ కిందకు వస్తాయి. సాగునీటి పన్నుల మీద సబ్సిడీల బాధ్యతలన్నింటినీ ప్రభుత్వం వదిలేసుకుంటుంది. రైతులకు ఏ నేల మీద ఏ పంట వేయాలో సలహా ఇచ్చే అధికారం కూడ ఈ వ్యవస్థకు ఇవ్వాలని ప్రపంచబ్యాంకు "సూచన" చేస్తున్నది. రైతులు వినియోగించే ప్రతి నీటి బొట్టుకు యూజర్ ఛార్జీలు విధిస్తే, ఇక రైతాంగం ప్రపంచబ్యాంకు, బడా కార్పోరేట్ సంస్థల దయాదాక్షిణ్యాల మీద బతకాల్సిన పరిస్థితి మరింత ఎక్కువగా దాపురిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే సాగునీరు సరిగా అందక బాధలు పడుతున్న సామాన్య రైతాంగానికి, వై.యస్.ఆర్ పాలనలో అది అందని ద్రాక్ష పండుగా మారనున్నది.

ప్రపంచబ్యాంకు అప్పులు తీసుకున్న మున్సిపాలిటీల్లో అద్దె నియంత్రణ చట్టాన్ని ఎత్తివేయాలని బ్యాంకు ఆదేశించింది. ప్రపంచబ్యాంకు పెద్ద ఎత్తున చేస్తున్న ఈ 'సహాయం' ప్రజల నెత్తిన మోయలేని అప్పుల గుదిబండగా తయారై, నానాటికీ పెరిగిపోయే పన్నులు, శిస్తులు, సుంకాలుగా, సబ్సిడీలకోతలుగా మారి ప్రజల గోళ్ళూడగొట్టి వసూలు చేయబడతాయి. ప్రజాస్వామిక హక్కులు, జీవించే హక్కు హరించుకుపోతాయి.

అంతకంటే పచ్చి నిజమేమిటంటే, ఉచిత విద్యుత్తు పథకం ఎత్తివేత; విద్యుత్ ఛార్జీలు, నీటి, బస్సు ఛార్జీల పెంపు; సబ్సిడీల్లో మరింత కోత; విద్య, వైద్యం తదితరాలకు యూజర్ ఛార్జీల వసూలు; స్థానిక పరిశ్రమల మూసివేత; బహుళజాతి కంపెనీల ప్రవేశానికి కావలసిన ప్రోత్సాహకాలనందించటం జరిగింది. ఇటీవల ప్రపంచ బ్యాంకు మూడవ దశ సంస్కరణలను అమలు చేయడానికి మంత్రివర్గం నిర్ణయించింది. పునర్వ్యవస్థీకరణ (ప్రభుత్వరంగ సంస్థలను బలహీనపరచటం, ఉద్యోగుల సంఖ్య తగ్గించటం, సంస్థలను మూసివేయడం, ప్రైవేటీకరించడం)లో భాగంగా సింగరేణి, ఆర్.టి.సితో పాటు ప్రభుత్వం నిర్వహిస్తున్న 30 పబ్లిక్‌రంగ సంస్థలను ప్రైవేటీకరించడానికి రంగం సిద్ధమైంది. సమ్మెల్ని నిర్దాక్షిణ్యంగా అణచివేయటం; "లా అండ్ ఆర్డర్" సజావుగా సాగటానికి ఫాసిస్టు పద్ధతులకైనా సిద్ధం కావటం; బూటకపు ఎన్‌కౌంటర్ హత్యాంకాడలతో మావోయిస్టు ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేయటం, ప్రజాస్వామిక హక్కులు తదితరాలను అణచివేయటం లాంటి ప్రపంచబ్యాంకు విధించిన షరతులన్నిటికీ వాళ్ళు కట్టుబడ్డారు. చంద్రబాబు ప్రభుత్వం లాగానే వై.యస్.ఆర్ ప్రభుత్వం కూడా వీటన్నింటినీ దూకుడుగా అమలు జరుపుతున్నది.

సామ్రాజ్యవాదం లూటీని తీవ్రం చేసి, అత్యధిక లాభాలు దండుకుపోవడానికి, తన చెప్పుచేతల్లో వుండి, అది విధించే విధానాలను అమలు చేసే నిరంకుశ, ఫాసిస్టు పాలనను కోరుకుంటుంది. అటువంటి పాలనలో ప్రజాస్వామిక ప్రమాణాలన్నీ సమాధి అయిపోతాయి. ఇప్పుడు అలాంటి పాలకుడు వై.యస్.ఆర్ ప్రపంచబ్యాంకుకు దొరికాడు. కీలకాంశాల మీద అసెంబ్లీలో చర్చించకుండా, రాష్ట్రమంత్రి వర్గంతో కూడ సమీక్షించకుండ, ప్రజాభిప్రాయాన్ని గాలికొదిలేసి ఏకవ్యక్తి నిరంకుశ పాలన సాగిస్తున్నాడు. మావోయిస్టులతో మొదటి దఫా చర్చల తర్వాత అక్టోబర్ 2004లో చర్చల ప్రక్రియకు అడ్డుకట్ట

లేస్తూ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నాడు. ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణానికి అప్పులకోసమని ప్రపంచబ్యాంకుతో ఒప్పందాలకు పూనుకున్నాడు. అయినవాళ్ళకు, అనుచరులకు, పార్టీ ముఖ్యులకు, కాంగ్రెస్ పార్టీకి కావలసినవాళ్ళకు, కాంట్రాక్టులు కేటాయించుకున్నాడు. బ్లాక్‌మెయిల్ ఆరోపణలున్న అమెరికా రాయబారి డేవిడ్ మల్‌ఫోర్డ్‌తో సమావేశమై, రాష్ట్ర వనరుల్ని అమెరికా పాదాల ముందు ఎలా తాకట్టు పెట్టాలనే రహస్య మంతనాలు జరిపాడు. 1400 కోట్ల రూ॥ల ఒప్పందపు వివరాల్ని బయటపెట్ట నిరాకరించాడు.

## జనాన్ని నట్టేట ముంచే 'జలయజ్ఞం'

46,000 కోట్ల ప్రాథమిక అంచనాలతో వై.యస్.ఆర్ ప్రభుత్వం తలపెట్టిన 'జలయజ్ఞం' కార్యక్రమానికి మొత్తంగా ఒక లక్ష కోట్లు అవసరమౌతాయి. దీనికోసం గత రెండు బడ్జెట్‌లలో పదేసి వేల కోట్ల రూపాయలు, ప్రస్తుత బడ్జెట్‌లోనూ 10,000 కోట్లు, రాబోయే రెండు బడ్జెట్‌లలో మరొక 30,000 కోట్లు కేటాయింపులు చేయాలనుకుంటున్నారు. జలయజ్ఞం కింద రాష్ట్రంలో ఒక కోటి ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రభుత్వం చెపుతున్నది. ఇది కాంగ్రెస్ పాలకుల పగటి కల అనేది స్పష్టం. దీనికి అవసరమైన నిధుల కోసం వీళ్ళు పూర్తిగా ప్రపంచ బ్యాంకు మీద ఆధారపడ్డారు.

కార్పోరేట్ సంస్థలకూ, కోస్తా ప్రాంత భూస్వాములకూ, బడా పెట్టుబడిదారులకు తప్ప సామాన్య ప్రజానీకానికి ఎటువంటి ప్రయోజనం లేని పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పట్ల లక్షలాది నిర్వాసితులు, ఇంకా వివిధ సెక్షన్ల ప్రజానీకం నుంచి వస్తున్న ఒత్తిళ్ళ వల్ల ప్రాజెక్టు ఎత్తు ఎంత వుండాలనే దానిపై ప్రభుత్వం నిపుణుల కమిటీని నియమించడానికి సిఫారసు చేసింది. ఆ రిపోర్టులు అందవలసి వున్నాయి. పోలవరం ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ, ఆదివాసీ హక్కుల పోరాట సమితి, ఆదివాసీ ఐక్యవేదిక, ఆదివాసీ సంక్షేమ పరిషత్, తుడుందెబ్బ, ఆదివాసీ గ్రామకమిటీలు లాంటి అనేక ప్రజా సంఘాలు, సి.పి.ఐ, సి.పి.ఎం, టి.ఆర్.ఎస్ పార్టీలతో పాటు టి.డి.పి కూడా ప్రాజెక్టు నిర్మాణంపై పెద్దయెత్తున వ్యతిరేకత తెలుపుతున్నాయి. అనేక ఆదివాసీ సంఘాలు ఇతర ప్రజా సంఘాలు ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపాలని డిమాండు చేస్తూ సాంప్రదాయక ఆయుధాలైన విల్లు, బాణాలతో మిలిటెంట్ పోరాటాన్ని చేపట్టారు.

రూ॥ 1,305 కోట్లతో మొదటి దశలో, 1880 కోట్లతో రెండవ దశలోను నిర్మించనున్న అనేక ప్రాజెక్టులు కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకుల, అధికారుల ముఠాకు డబ్బు సంచులు పండించే ప్రాజెక్టులే యివి.

## ప్రభుత్వాన్ని వణికిస్తున్న ప్రజల మిలిటెంట్ పోరాటాలు

వై.యస్.ఆర్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు, కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీలు, వాగ్దానాలు నెరవేర్చకపోవడానికి వ్యతిరేకంగా ప్రజల ఆందోళనలు నానాటికీ తీవ్రతరమౌతున్న పరిస్థితి నేడు కనిపిస్తున్నది. రబీ సీజన్లో వరి పంటకు ఉచిత విద్యుత్తు పథకాన్ని అమలు చేయవద్దనే ప్రపంచ బ్యాంకు ఆదేశాల్ని వైయస్ ప్రభుత్వం అమలు చేస్తున్నది. రాష్ట్ర వ్యాప్తంగా దీనిపై పెద్దఎత్తున ఆందోళనలు జరిగిన తర్వాతనే వెనక్కు తగ్గింది. మార్చి 31 లోగా రైతులందరూ కెపాసిటర్లు, ఫుట్‌వాల్వ్‌ల ఏర్పాటు చేసుకోవాలని, ఏర్పాటుచేసుకోనివారి విద్యుత్తు కనెక్షన్ తొలగించటం జరుగుతుందని ఆదేశాలు జారీ చేసింది. రైతులు వీటిని అధిక ధరలకు మార్కెట్‌లో కొనాల్సిన పరిస్థితి వుంది. ఇందుకు రైతుకు సగటున ఏటా రూ॥ 755లు ఖర్చు అయితే విద్యుత్తు ఖర్చులో తనకి అందే రాయితీ రూ॥ 3375 మాత్రమే. అందుకే వీటిని సబ్సిడీ ధరలకు ప్రభుత్వమే తమకు సరఫరా చేయాలని రైతులు అధికారుల్ని ఘెరావ్ చేయటం, కరెంటు ఆఫీసుల మీద దాడులు చేయటం లాంటి చర్యలకు పూనుకున్నారు. 50 శాతం మంది రైతులు కూడా కెపాసిటర్‌లు ఏర్పాటు చేసుకోకపోవటంతో ఈ గడువును ప్రభుత్వం పొడిగించింది. విద్యుత్ క్రమబద్ధీకరణ ద్వారా రైతుల మీద పన్నులు విధించి, రాష్ట్ర రెవెన్యూ ఆదాయాన్ని పెంచుకోవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. సాగునీటికి 12 గంటలు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసింది. కాని, టి.డి.పి పాలనలో వున్నట్లే 7 గంటల సరఫరానే కొనసాగిస్తున్నది. వాస్తవానికి టి.డి.పి ఓడిపోయి, కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి పని చేసిన కారణాల్లో ఇదొకటి. 12 గం॥ల విద్యుత్ సరఫరా వాగ్దానాన్ని వై.యస్.ఆర్ ప్రభుత్వం వెనక్కు తీసుకోవడమే గాక, 7గం॥ల విద్యుత్ కూడా రోజుకు రెండు విడతల్లో ఇస్తున్నది. అర్ధగంటకోసారి కరెంటు సరఫరా నిలిచిపోవటం, ఎప్పుడు కరెంటు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక రాత్రింబవళ్ళు నిద్రాహారాలు మాని పడిగాపులు పడటం, మోటార్లు కాలిపోవటం, కొన్నిసార్లు విద్యుత్ ప్రమాదాలకు గురికావటం లాంటి నరకయాతనకలు భరించలేని రైతాంగం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దయెత్తున ఆందోళనలకు దిగుతున్నారు. ప్రజాపథం కార్యక్రమమంతటా ఇదే అంశంపై రైతుల నుండి తీవ్ర ఆగ్రహావేశాలు వెల్లువెత్తాయి. దీనికి

సమాధానం చెప్పుకోలేకనే ప్రజాప్రతినిధులు ప్రజాపథానికి ముఖం చాటేస్తే దొరికిన అధికారుల్ని రైతాంగం ఎక్కడిక్కడ కడిగి పారేశారు. దీంతో ప్రజాపథం కార్యక్రమం ప్రజా నిరసన పథంగా తయారైంది.

దీర్ఘకాలంగా పెండింగ్‌లో పెడుతున్న ఎస్.సిల వర్గీకరణ సమస్యను పరిష్కరించకపోతే జనవరిలో జరిగే ఎఐసిసి ప్లీనరీ సమావేశాలను అడ్డుకుంటామని ఎం.ఆర్.పి.ఎస్ హెచ్చరించింది. సమస్యను కాంగ్రెస్ హై కమాండ్‌కు నివేదించి, పార్లమెంటులో ప్రవేశపెట్టేట్లు చూస్తామని రాజశేఖర్ రెడ్డి హామీ ఇచ్చిన తర్వాతనే ఎంఆర్‌పిఎస్ పెద్దయెత్తున తలపెట్టిన ర్యాలీని చివరి నిమిషాలలో విరమించింది. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలను రద్దు చేయాలనే ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయానికి వ్యతిరేకంగా పాల ఉత్పత్తిదారులు ఫిబ్రవరి 4న ఆందోళన చేపట్టారు. స్థానిక సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిల చెక్ పవర్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా స్థానిక సంస్థల ప్రతినిధులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. వీరిపై కూడ పోలీసులు లాఠీ చార్జీ చేసి మహిళలని కూడ చూడకుండా కొట్టగా, అనేక మంది తీవ్రగాయాలపాలయ్యారు. వీళ్ళ ఆందోళనకు వెరచి, రానున్న స్థానిక ఎన్నికలనూ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చివరికి తన శాసనాన్ని రద్దు చేసుకుంది. తమ సమస్యల గురించి ఆందోళనలు చేస్తున్న ఉపాధ్యాయులపై చిత్తూరులో అమానుషంగా లాఠీఛార్జీ చేసి తీవ్రగాయాలై పడిపోయిన వారిని కూడ వదిలిపెట్టకుండ కొట్టారు. రాష్ట్రంలో చాలా కాలంగా నిద్రావస్థలో వున్న విద్యార్థి సంఘాలు కూడా తమ సమస్యలపై అనేకచోట్ల ఆందోళనలకు దిగాయి.

రాష్ట్రంలో ఒక కోటి ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పిస్తామని ఊదరగొడుతున్న 'జలయజ్ఞం' పేరిట చేపట్టిన ప్రాజెక్టులు వివాదాస్పదమయ్యాయి. పోలవరం, పులిచింతల ప్రాజెక్టులపై ప్రజావ్యతిరేకత నానాటికి తీవ్రతరమౌతున్నది.

ఫిబ్రవరి 7న ప్రభుత్వం బస్సు ఛార్జీలు పెంచినందుకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. నల్లగొండ జిల్లాలో గ్యాస్ పైపులైను నిర్మాణం చేసుకోవడానికి రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థకు 25000 ఎకరాల వ్యవసాయ యోగ్యమైన భూమిని అప్పగిస్తూ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందానికి వ్యతిరేకంగా బాధిత గ్రామాల ప్రజలు ఆందోళన చేశారు. వెంటనే దీనిపై స్పందిస్తూ హైదరాబాద్ నుంచి వై.యస్.ఆర్, ముంబాయి నుంచి అంబానీలు అటువంటి ఒప్పందమేమీ జరగలేదని ప్రకటిస్తూ, ప్రజలకు అన్యాయం జరగదని హామీ ఇవ్వడానికి ప్రయత్నించారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టదలచిన విశాఖపట్నం నుండి అరకులోయ వరకు పారిశ్రామిక ప్రాంతాన్ని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ప్రజల నుండి,ముఖ్యంగా ఆదివాసీల నుంచి తీవ్రమైన వ్యతిరేకతనెదుర్కొంటున్నది. తూర్పుకనుమల్లోని విశాఖపట్టణం నుండి అరకు వరకు గల 10 వేల ఎకరాల సుందరమైన లోయ ప్రాంతాన్ని బాక్సైట్ తవ్వకం కోసం పేరుమోసిన అల్యూమినియం వ్యాపారి జిందాల్‌కు వై.యస్.ఆర్ ప్రభుత్వం అప్పగించజూస్తున్నది. దీనికి వ్యతిరేకంగా ఆదివాసీలు పోరాడుతున్నారు.

ప్రైవేటు ఆధ్వర్యంలో పోర్టు నిర్వహించే నిర్ణయం మేరకు గంగవరం పోర్టు నిర్మాణాన్ని కాంగ్రెస్ అనుకూల బడా బాబులకు ప్రభుత్వం అప్పగించింది. ఈ బడా బాబుల ప్రయోజనం కోసం అక్కడి మత్స్యకార్మికుల కడుపుకొట్టి, వాళ్ళ పోర్టు వ్యతిరేక పోరాటంపై తుపాకులు ప్రయోగించి ఒకరిని బలితీసుకుంది. బషీర్‌బాగ్ కాల్పులపై గగ్గోలు పెట్టి, ఆ తర్వాత విద్యుత్ పోరాటానికి వెన్నుపోటు పొడిచిన వై.యస్.ఆర్ నేడు ప్రపంచబ్యాంకు నమ్మకమైన ఏజెంటుగా మారి ప్రజలపై పోరాటాలపై తుపాకులు ఎక్కుపెట్టడానికి సై అంటున్నాడు. గంగవరం మత్స్యకార్మికులపై కాల్పులపట్ల రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర నిరసనలు, ఆందోళనలు చెలరేగి వై.యస్.ఆర్ ప్రభుత్వం తీవ్ర ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంది.

నల్గొండ జిల్లాలోని పెద్ద అడిశర్లపల్లి దగ్గర యురేనియం వెలికితీతకు ఆ ప్రాంతాన్ని అప్పగించాలనే ప్రభుత్వ పథకానికి వ్యతిరేకంగా కూడా ప్రజలు ఆందోళన చేస్తున్నారు. 1.12 కోట్ల టన్నుల యురేనియం నిల్వలున్నట్లు బయటపడటంతో ఇంతవరకు ఎవరికీ పేరైనా తెలియని పెద్దగట్టు, నంబాపురం అనే ఆదివాసీ గ్రామాలు వార్తలకెక్కాయి. యురేనియం ముడి పదార్థం వెలికితీత, శుద్ధి కోసం 1316 ఎకరాలను అప్పగించవలసిందిగా యురేనియం కార్పోరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యు.సిఐ.ఎల్) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇదే గనుక జరిగితే అక్కడ 20 సంవత్సరాలపాటు గనుల తవ్వకం జరుగుతుంది. రోజుకు 1250 టన్నుల(125 లారీలు) ముడి పదార్థాన్ని వెలికి తీసి, దాన్నుంచి 686 కిలోల శుద్ధి చేసిన యురేనియంను రాబట్టుతారు. ఈ యురేనియంను వెలికితీయడానికి నెలకు 22.5 టన్నుల పేలుడు పదార్థాలు ఉపయోగిస్తారు. అలాగే రోజుకు 22,50,000 లీటర్ల నీరు అవసరమౌతుంది. ఈ యురేనియం వెలికితీత వల్ల అక్కడికి సమీపంలోనే వున్న ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నాగార్జునసాగర్ డ్యాంకు ప్రమాదం పొంచివుంది. గుంటూరు, కృష్ణా, ప్రకాశం,

ఖమ్మం జిల్లా ప్రజలమీద దాని ప్రభావం వల్ల అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయి. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణా మండలి ఈ అంశం మీద ప్రజాభిప్రాయ సేకరణ కోసం గడిచిన మూడు సంవత్సరాల్లో మూడు సార్లు ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసింది. ఈ మూడు సమావేశాల్లో కూడా యురేనియం వెలికితీత పట్ల ప్రజలు తమ వ్యతిరేకతను, భయాన్ని చాలా దృఢంగా వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్ ఆయకట్టు కింద జీవిస్తున్న రెండు కోట్ల మంది ప్రజల స్పందనను పక్కదారి పట్టిస్తూ, కేంద్ర అటవీశాఖ యురేనియం వెలికితీత ప్రాజెక్టు కోసం యు.సి.ఐ.ఎల్‌కు అనుమతినిచ్చింది. ఆ ప్రాంతంలోని ప్రజలు, ఇతర రాష్ట్రాల ప్రజలతోపాటు ప్రఖ్యాత పర్యావరణ వేత్తలు, అణువ్యతిరేక శాస్త్రవేత్తలు ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఈ సంవత్సరం జనవరి 3 నుంచి 7 వరకు ఐదు రోజుల పాటు పాదయాత్ర చేపట్టారు. ఇదే సమయంలో హైదరాబాద్‌లో 93వ భారత సైన్స్ కాంగ్రెస్ జరుగుతుండగా ఈ పాదయాత్ర జరగటం విశేషం. ఈ పాదయాత్ర జరిపిన వారిలో గుజరాత్‌కు చెందిన అణుభౌతిక శాస్త్రవేత్త డా॥ సురేంద్రగడేకర్, రాజన్‌నాయుడు, లండన్‌కు చెందిన పౌరహక్కుల కార్యకర్త, అణుశక్తి ప్రత్యామ్నాయ పౌరుల సంఘానికి (సిటిజన్స్ ఆఫ్ ఆల్టర్‌నేటివ్ టు న్యూక్లియర్ ఎనర్జీ - సి.ఎ.ఎన్.ఇ) చెందిన రామకృష్ణ, ముంబాయికి చెందిన అణ్వాస్త్ర నిరాయుధీకరణ, శాంతి సంఘీభావ సంస్థ నుండి శుక్లాసేన్, మానవహక్కుల వేదిక నుండి బాలగోపాల్ ఇంకా దేశ విదేశాల నుండి అనేక మంది కార్యకర్తలు పాల్గొన్నారు. విస్తృతంగా సంతకాల క్యాంపెయిన్ చేపట్టారు. యురేనియం ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా పెద్దయెత్తున ఆందోళనా కార్యక్రమాలు చేయడానికి ప్రజలు సిద్ధమౌతున్నారు.

ఇదే వై.యస్.ఆర్ ప్రతిపక్ష నాయకుడిగా వుండగా యురేనియం వెలికితీతకు అనుమతిస్తే పరిణామాలు ఎంత ప్రమాదకరంగా వుంటాయనేదానిపై అసెంబ్లీలో పెద్ద ఉపన్యాసం ఇచ్చిన సంగతి గుర్తుంచుకోవలసినది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్నో వాగ్దానాలు చేసిన ఈ నయవంచకుడికి, మోసగానికి కోట్లాది ప్రజలు, జంతుజాలం నాశనమైనా, వికిరణం వల్ల భూమి, నీరు, గాలి కలుషితమైపోయినా ఫరావాలేదు గానీ, దేశాభివృద్ధికి ఇప్పుడు యురేనియం ప్లాంట్ తప్పనిసరి అవసరంగా కన్పిస్తున్నది.

## వామపక్షాల వ్యతిరేకత వట్టి బూటకం

రాష్ట్రంలో, కేంద్రంలో 2004 ఎన్నికల్లో కాంగ్రెస్, వామపక్షాల పొత్తు విజయం సాధించినప్పటి నుండి సి.పి.ఐ, సి.పి.ఎం పార్టీలు కాంగ్రెస్ ముందు తోక ఊపుతున్నాయి(కాంగ్రెస్ పాటకు వంత పాడుతున్నాయి). కాంగ్రెస్ అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ వామపక్షాలు చేస్తున్న ఆందోళనలు, డిమాండ్లన్నింటిని కేంద్రంలో యు.పి.ఎ, రాష్ట్రంలో వై.యస్.ఆర్ ప్రభుత్వాలు టోకున తుంగలో తొక్కేస్తున్నాయి. 2004 మేలో అధికారంలోకి వచ్చిన తర్వాత యు.పి.ఎ భాగస్వామ్య పక్షాలు రూపొందించిన కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని అంగీకారం జరిగినప్పటి నుంచే అటకెక్కించటం మొదలైంది. ఏ అంశాల మీదకూడా వామపక్షాల అభిప్రాయాలకు తగినంత విలువ నివ్వటం లేదు. అధికారం చేపట్టిన తర్వాత కేంద్రంలోని కాంగ్రెస్ లాభదాయకమైన ఢిల్లీ, ముంబాయి విమానాశ్రయాలను ప్రైవేటీకరించింది. స్థానిక ఉత్పత్తిదారుల్ని, రిటైల్ వ్యాపారుల్ని, టోకు వ్యాపారుల్ని తొక్కేస్తూ రిటైల్ వ్యాపార రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్ని (ఎఫ్.డి.ఐ) అనుమతించింది. ఉద్యోగాల ప్రావిడెంట్ ఫండ్ మీద ఇచ్చే వడ్డీ రేటును తగ్గించింది. లాభదాయకమైన పబ్లిక్ రంగసంస్థల ప్రైవేటీకరణకు సంబంధించి వామపక్షాల అభ్యంతరాన్ని తుంగలో తొక్కేసింది. పెట్రోలు, డీజిల్ ధరల్ని ఇప్పటికే ఏడుసార్లు పెంచి ఇంకా పెంచడానికి ఆలోచనలు చేస్తున్నది. అంతర్జాతీయ అణుసంఘంలో ఇరాన్‌కు వ్యతిరేకంగా ఓటేయాలని ఆదేశించి భారత ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేసిన అమెరికా రాయబారిని వెనక్కు పంపించలేదు. ఇరాన్‌కు వ్యతిరేకంగా ఓటు వేయడం ద్వారా భారత్ పూర్తిగా అమెరికా క్యాంపులో చేరిపోయింది. ఇటువంటి కార్యక్రమాలెన్ని చేసినా వామపక్షాలు ఏదోకొద్దిగా మొరగడం తప్ప ఏమి చేయలేదు.

అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా వై.యస్.ఆర్ ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కి నిర్దాక్షిణ్యంగా ప్రజా వ్యతిరేక విధానాలను అమలుచేస్తూ, చంద్రబాబులా తానుకూడా ప్రపంచబ్యాంకు నమ్మకమైన ఏజెంటుగా వై.యస్.ఆర్ నిరూపించుకుంటుంటే వామపక్షాలు తమకేమి ఇబ్బందిలేనట్లు చోద్యం చూస్తున్నాయి. పోలవరం మీద, బస్ ఛార్జీల పెంపు, ప్రజల ప్రజాస్వామిక హక్కుల అణచివేత తదితర అంశాల మీద కొంత తాటాకు చప్పుళ్ళు చేసినా కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో వుండటానికి పచ్చ జెండా వూపుతున్నాయి. అరెస్టు చేసిన విప్లవకారుల, సానుభూతిపరుల, ప్రజాస్వామిక మేధావుల హత్యలపట్ల, అప్రతిహతంగా కొనసాగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్ మారణకాండపట్ల వామపక్షాల వ్యతిరేకత బూటకం అనేది ఋజువైంది. ఈ మారణకాండలపై చట్టబద్ధమైన విచారణ జరిపించాలని ఒక్కమాట కూడా వీళ్ళనుంచి రావటం లేదు. కాంగ్రెస్

ప్రభుత్వానికి మద్దతు ఇవ్వటం ద్వారా వై.ఎస్.ఆర్ పోలీసు రాజ్యం అమలుచేస్తున్న ఫాసిస్టు అణచివేతలో తోడుదొంగలుగా మారారు. నక్సల్బరి ఉద్యమ కాలంలో జరిపిన మారణకాండల దాని గత చరిత్ర నుంచి, నేడు బెంగాల్‌లో కొనసాగుతున్న విప్లవోద్యమంలో విప్లవకారులు, సానుభూతిపరులపై జరుపుతున్న హత్యాకాండ ద్వారా దాని నిజస్వరూపం బయటపడుతున్నది.

ప్రపంచబ్యాంకు ప్రాజెక్టులకు, అప్పులకు, పోలవరం ప్రాజెక్టు, బస్, ఛార్జీల పెంపు వంటి సమస్యలపై వామపక్షాలు ఒకపక్క ప్రజల్ని కదిలిస్తూనే, మరోపక్క యు.పి.ఎ ప్రభుత్వానికి తమ మద్దతు కొనసాగించటం వాటి ద్వంద్వనీతికి నిదర్శనం. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య బ్రోకర్ పనిచేస్తూ, ప్రజల ఆగ్రహాన్ని పార్లమెంటరీ మార్గాల్లోకి మళ్లించి, నీరుగార్చడానికి రక్షణ కవచంలా పని చేస్తున్నాయి. తన పలుకుబడి తగ్గుతున్నప్పుడు తప్పని పరిస్థితుల్లో సమస్యలపై ప్రజల్ని కదిలిస్తుంది. ఒకనాడు టి.డి.పి తోకగా పని చేసింది. ఈ రోజు వై.యస్.ఆర్ ముందు తోక వూపుతున్నది. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపితో పొత్తుగూడి కొన్ని రొట్టె ముక్కలు సంపాదించింది. టి.డి.పి తొమ్మిదేండ్ల ఫాసిస్టు పాలనను, బషీర్‌బాగ్ కాల్పుల్లో (విద్యుత్ సమస్య గురించి పోరాడుతున్న కార్యకర్తలపై కాల్పులు) తమ కార్యకర్తలను బలితీసుకోవడం, గుజరాత్ మారణకాండపై పల్లెత్తు మాట్లాడకుండా బి.జె.పితో పొత్తు కొనసాగించటం లాంటి అన్ని అంశాలనూ మర్చిపోయి, దుర్మార్గమైన టి.డి.పితో మళ్ళీ ఇప్పుడు పొతుగూడిందంటే, ఇది టి.డి.పిని కూడా మించిపోయిన వామపక్షాల పచ్చి అవకాశవాదం తప్ప మరొకటి కాదు. అప్పుడప్పుడు అది గొంతు చించుకుని చేసే కొన్ని విజ్ఞప్తులను కూడా కాంగ్రెస్ పూర్తిగా బుట్టదాఖలు చేసేస్తున్నది. బి.జె.పి మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం అనే పేరుతో వామపక్షాలు ప్రధానంగా కాంగ్రెస్ దళారుల్ని కాపాడుతున్నాయి. తమ పార్టీ ప్రైవేటీకరణ, సరళీకరణల వేగాన్ని తగ్గించే స్పీడు బ్రేకర్ (వేగ నిరోధకం)గా పని చేస్తుందని, వాటిని అడ్డుకోకుండా మానవ ముఖాన్ని తగిలిస్తుందనీ సి.పి.ఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి, పోలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి రాఘవులు మాట్లాడుతున్నాడు. కానీ, కనీస ఉమ్మడి కార్యక్రమంలోని అంశాలన్నింటినీ తుంగలో తొక్కి, దూసుకొస్తున్న నయా ఉదారవాద సంస్కరణలకు కనీసం స్పీడు బ్రేకర్లుగా కూడా పని చేయగల సత్తాలేనివాళ్ళు ఈ వామపక్ష బ్రోకర్లు.

## తెలంగాణ, టి.ఆర్.ఎస్

గత శాసనసభ ఎన్నికల్లో ప్రత్యేక తెలంగాణా అంశాన్ని ముందుపెట్టుకుని గణనీయమైన సీట్లను సంపాదించిన టి.ఆర్.ఎస్ అంతర్గత విభేదాలు, చీలికలు, వివాదాలతో సతమతమవుతున్నది. ఆరుగురు ఎం.ఎల్.ఎలు బయటికి పోయి కొత్త కుంపటి పెట్టారు. తెలంగాణ సమస్య పరిష్కరించకపోతె తడాఖా చూపిస్తామని, అమీతుమీ తేల్చుకుంటామని తుది గడువులు పెడుతూ కె.సి.ఆర్, నరేంద్రలు బెదిరింపు ప్రకటనలు చేస్తున్నారు. అయినా తెలంగాణా అంతకంతకు దూరం జరిగిపోతూనే వుంది. తెలంగాణా గురించి యుపిఎలో పనులు నడిపించడానికే కేంద్రమంత్రి పదవుల్లో వున్నామని పదవులు పట్టుకు ఊగులాడటాన్ని వాళ్ళకు వాళ్ళే సమర్థించుకుంటున్నారు. కొద్ది రోజులు ప్రచారం మందగించగానే 'గర్జన'ల పేరుతో ఆర్భాటపు మీటింగులు జరుపుతారు. కానీ, అసలు విషయం తెలంగాణ సమస్యను కాంగ్రెస్ ఎప్పుడో పక్కనబడేసింది. ఇది కె.సి.ఆర్, నరేంద్రలకు బాగానే తెలుసు. కాని, తెలంగాణా లేకపోతే తమకు పుట్టగతులు లేవు కాబట్టి రోజుకో నాటకమాడుతున్నారీ నాటకాల రాయుళ్ళు.

టిఆర్ఎస్ తన కార్యకర్తలకు రకరకాల హామీలిస్తుంటే, హైదరాబాద్‌లో కాంగ్రెస్ ప్లీనరీలో తెలంగాణ గురించి కాంగ్రెస్ ప్రస్తావించనైనా లేదు. యు.పి.ఎ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ పై ఉపకమిటీ ఒకదాన్ని వేసి పెద్ద ప్రచారం కల్పించారు. సంవత్సరం నుంచి టి.ఆర్.ఎస్ జనం చెవుల్లో పూలు పెడుతున్నా ఈ ఉపకమిటీ దాని రిపోర్టును ఇంతవరకు సమర్పించలేదు. ఇదిగో వస్తుంది, అదిగో వస్తుంది అనటమే తప్ప ఇంతవరకు ఏమీ లేదు. డిసెంబర్ చివరి నాటికైనా రిపోర్టు తయారవుతుందో లేదో తెలియదు. ఎ.ఐ.సి.సి ప్లీనరీ సమావేశాల సమయంలో యు.పి.ఎ ఉప కమిటీ రెండు నెలల్లో రిపోర్టు సమర్పించాలని టి.ఆర్.ఎస్ మరోసారి తుదిగడువు పెట్టింది. కానీ, ఉపకమిటీ ఛైర్మన్ ప్రణబ్‌ముఖర్జీ దీన్ని ఉడుత ఊపులకింద కొట్టిపారేసి తాను ఏ డెడ్‌లైన్‌లకూ కట్టుబడే వాణ్ణి కాదని తేల్చేశాడు. ఇంకా ఘోరమేమంటే, తుది నిర్ణయం చేయాలంటే తెలంగాణ అంశం మీద ఏకాభిప్రాయ సేకరణ జరగాలని పిలుపినిచ్చాడు.

ఏకాభిప్రాయం గురించి చాలా కాలంగా మాట్లాడుతున్న వై.యస్.ఆర్‌కు కూడా సి.పి.ఐ, సి.పి.ఐ(ఎం), టి.డి.పిలు తెలంగాణకు వ్యతిరేకమని బాగా తెలుసు. ప్రజాభిప్రాయాల సాకుతో, తెలంగాణను వ్యతిరేకించే పార్టీల మీదకు ఈ అంశాన్ని నెట్టి, తెలంగాణా ఇవ్వము అని వేరే రూపంలో చెప్పే కుటిలత్వం తప్ప ఇది మరొకటి కాదు. అదే సమయంలో, ఏకాభిప్రాయమనేది వై.యస్.ఆర్ స్వంత అభిప్రాయమనీ, యు.పి.ఎ, సోనియా గాంధీలు ప్రత్యేక తెలంగాణపట్ల అనుకూలంగా వున్నారని

టి.ఆర్.ఎస్ చెపుతున్నది. సమీప భవిష్యత్తులో ఈ అంశాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశం లేదని ఇప్పుడు ప్రణబ్ ముఖర్జీ చెబుతుంటే, యుపిఎ, సోనియా గాంధీలు అనుకూలంగా వున్నారని, ప్రణబ్ ముఖర్జీ మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని టిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతున్నారు. పార్లమెంటులో మెజార్టీ ఓట్లు రాకుంటే తెలంగాణ వీగిపోతుందని తెలిసిన ఈ డబ్బా రాయుళ్ళు ఇప్పుడు బి.జె.పితో బేరసారాలు ఎక్కువ చేశారు. టి.ఆర్.ఎస్ పోకడను బాగా గ్రహించిన తెలంగాణా ప్రజలు స్థానిక ఎన్నికల్లో కీలెరిగి వాతపెట్టడంతో తనది అనుకున్న చోట కూడా తలెత్తుకోలేనంత ఘోరంగా దెబ్బతిన్నది. ఇకిప్పుడు అది కాంగ్రెస్‌కు తోకగా మారింది. తెలంగాణను నిర్లక్ష్యం చేసిన వారికి పట్టిన గతిని, తెలంగాణా ఆకాంక్షలు ప్రజల్లో ఎంత బలోపేతంగా ఉన్నాయనేదాన్ని ఈ స్థానిక ఎన్నికలు నిరూపించాయి.

ఇక తెలంగాణా క్రీడలో ప్రధాన ఆటగాళ్ళైన కాంగ్రెస్, బి.జె.పిలు నీ వైఖరేమిటో ముందు తేల్చు అంటే, నీదేంటో ముందు తేల్చమని ఒకరికొకరు సవాళ్ళు విసురుకుంటున్నారు. ఇక పదవుల కోసం, స్వప్రయోజనాల కోసం అప్పుడప్పుడు మాట్లాడే తెలంగాణా కాంగ్రెస్ ఎం.ఎల్.ఎలు తెలంగాణ పేరుతో లాభం పొందాలనుకుంటున్న మరో ముఖ్యమైన దళారులు. ఈ ద్రోహులతో విసిగి వేసారిన తెలంగాణ ప్రజలు, అవినీతితో మునిగిన ఈ ఊసరవెల్లుల్ని, నయవంచకుల్ని తన్ని తరిమి మావోయిస్టుల నాయకత్వంలో లేదా వారి మద్దతుతోగాని తమదైన మార్గంలో పోరాడాలి. మరింత బృహత్తర పోరాటాలకు సంసిద్ధులు కావాలి.

ఈ సంవత్సరం బడ్జెట్ రోశయ్యలాంటి స్థానికులు ఎన్ని కసరత్తులు చేసినా, ప్రపంచబ్యాంకు కనుసన్నల్లో తయారైందనేది స్పష్టం. చంద్రబాబు పాలనలో ప్రపంచ బ్యాంకు రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులకు పెద్దయెత్తున లోన్లు గుప్పించింది. దీని లక్ష్యం విప్లవోద్యమాన్ని బలహీనపరచి ఏకాకిని చేయటం, బహుళజాతి సంస్థలకవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై చివరి వరకు పెద్దయెత్తున నిధులు వెచ్చించటం. ప్రపంచబ్యాంకు రాష్ట్ర ప్రభుత్వాలతో నేరుగా సంబంధాలు పెట్టుకుని తన ప్రయోజనాలు నెరవేర్చుకోవటానికి కేంద్ర ప్రభుత్వాన్ని బలవంతపెట్టి తన డిమాండును సాధించుకుంది. అదేవిధంగా రాష్ట్రాన్ని మరింతగా తన కబంధ హస్తాల్లో బిగించింది. రాష్ట్రంలోని ఏ రంగాన్ని వదలకుండా దాని ఆదేశాన్ని అమలు జరిపించి రాష్ట్రాన్ని నయా - సరళీకృత నమూనా రాష్ట్రంగా (ప్రపంచబ్యాంకు ప్రయోగశాలగా) తయారు చేస్తుందనేది స్పష్టం. రాష్ట్రంలోని 8 కోట్ల ప్రజలపై దుర్మార్గమైన రూపాల్లో దాని అధికారాన్ని ప్రారంభించింది.

వై.యస్.ఆర్ లేదా ఇంకెవరు అధికారంలో వున్నా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో చిక్కుకున్న పరిస్థితుల్లో, తన కబంధ హస్తాన్ని బిగించిన ప్రపంచబ్యాంకు ప్రజలకు తమ సమస్యల గురించి నిరసన తెలిపే ఎలాంటి ప్రజాస్వామిక అవకాశాన్ని ఇవ్వదు. వేలాది రైతులు, ప్రజలు ఆకలిచావులకు గురైనా, ఆత్మహత్యలు చేసుకున్నా, ప్రజాస్వామిక హక్కులు కర్కశంగా కాలరాచి వేయబడినా భూతం లాంటి ప్రపంచబ్యాంకు తన లాభాలను అది రాబట్టుకుంటూనే వుంటుంది. ప్రపంచబ్యాంకు భూతానికి ఊడిగం చేయటంలో హత్యారాజకీయాల ఫ్యాక్షన్ నేపథ్యంగల వై.యస్.ఆర్ తనకు ముందున్న చంద్రబాబును మించిన వస్తాదు. గొంతులోతు సంక్షోభంలో కూరుకొని, ఎన్నో అపవాదుల్ని మోస్తున్న వై.యస్.ఆర్ మంత్రివర్గం ఊపిరి పీల్చుకోవటానికి ప్రపంచబ్యాంకు అప్పులకు ఆర్రులు చాచటంలో ఆశ్చర్యమేమీ లేదు. అదే విధంగా మరో మూడేళ్ళు కొనసాగనున్న వై.యస్.ఆర్ ప్రభుత్వ కాలంలో ప్రపంచ బ్యాంకు అప్పులు మరింత పోగుపడతాయి. ఆ తర్వాత ముఖ్యమంత్రిగా వచ్చేవారెవరైనా బ్యాంకుకు మరింత నమ్మకమైన ఏజెంటుగా తయారవుతాడు. ఇటువంటి భయంకర విష వలయంలో రాష్ట్రం చిక్కుకున్నది.

రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో కూడా ఘోరమైన సంక్షోభంలో చిక్కుకుపోగా, అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామిక ఉద్యమాలన్నింటినీ అణచివేసి, ప్రజాస్వామిక ఉద్యమాల నాయకత్వాన్ని నిర్మూలించి వాటికి సరైన నాయకత్వం లేకుండ చేయపూనుకున్నది. తనకు ముందటి ప్రభుత్వాలన్నింటిలాగే తన పాలనకు నిజమైన ప్రత్యర్థి అయిన సి.పి.ఐ(మావోయిస్టు) పార్టీ మీద యుద్ధానికి సిద్ధమైంది. మావోయిస్టులపై దాడికి ముందు పెద్దయెత్తున దుష్ప్రచారానికి పూనుకున్నారు. నక్సలైట్లు రాష్ట్రంలో ఎక్కడైనా మందుపాతరలు పేల్చి లక్ష్యాలను దెబ్బతీయగల రిమోట్ టెక్నాలజీని సంపాదించారని మీడియాను ఒప్పించటానికి ప్రకాశం జిల్లా ఎస్.పి స్కూటర్‌లో బాంబు పెట్టి రిమోట్‌తో పేల్చి మీడియాకు ప్రదర్శించి చూపాడు. రాష్ట్రంలో అనేక సందర్భాల్లో విధ్వంసాలు సృష్టించడానికి యాక్షన్ టీంలు ఏర్పాటయ్యాయని ప్రచారం చేశారు. ఇంకా ముందుకు పోయి పాకిస్తాన్ ఐ.ఎస్.ఐతో నక్సలైట్లకు సంబంధాలున్నాయనే అనుమానాల్ని వ్యాపింపచేయ ప్రయత్నించారు. రాష్ట్రంలో "టెర్రరిస్టు చర్యలు'' చేయడానికి హైదరాబాద్‌లోని ఇస్లామిక్ సంస్థల నాయకులకు మవోయిస్టులు

అన్ని రకాల సహాయ సహకారాలందిస్తున్నారనే దుష్ప్రచారం కూడా చేశారు. రాష్ట్రంలో వై.యస్.ఆర్ పోలీసు యంత్రాంగం, కేంద్రంలో కాంగ్రెస్ నాయకత్వంలోని సామ్రాజ్యవాద (ముఖ్యంగా అమెరికా) తొత్తు ప్రభుత్వాలు వనిగట్టుకుని మావోయిస్టుల్ని అపఖ్యాతిపాలుజేసి, ఐ.ఎస్.ఐతో సంబంధాలున్నాయని నిందలు మోపి, టెర్రరిస్టులుగా ముద్రవేసి ప్రజల్లో అభద్రతా భావాన్ని సృష్టించడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తూ ఇలాంటి కట్టు కథలన్నీ పుట్టిస్తున్నాయి. ఆ విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టుల మీద విప్లవ సానుభూతిపరుల మీద, విప్లవ ప్రజానీకం మీద మిక్కిలి దుర్మార్గమైన రాజ్యహింసను ప్రారంభించడానికి పథకం పన్నాయి.

మంత్రులు, పోలీసు ఉన్నతాధికారులు ప్రతిరోజు పరస్పర విరుద్ధ ప్రకటనలిస్తూ, మావోయిస్టు ఉద్యమం ఆంధ్రప్రదేశ్‌లో అడుగంటిపోయినట్లేనని మాట్లాడుతున్నారు. అదే సమయంలో ఇంకా ఎక్కువ బలగాలను దింపుకుంటూ, మరిన్ని అదనపు బలగాలు, నిధులు కావాలని, హెలికాప్టర్లు, పైలట్‌లేని విమానాలు కావాలని, కేంద్రాన్ని కోరుతున్నారు. పోలీసు, గ్రేహౌండ్స్ బలగాలని పెంచుకోవటానికి నిరంతరం ప్రయత్నిస్తున్నారు. ఉత్తరాంధ్రలో ఒకటి, రాయలసీమలో ఒకటి చొప్పున మరోరెండు గ్రేహౌండ్స్ కేంద్రాల్ని ఏర్పాటు చేయనున్నట్లు ఫిబ్రవరి మొదటి వారంలో ప్రకటించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో గిరిజన బెటాలియన్‌ను ఏర్పాటు చేశారు. మావోయిస్టులు జైళ్లల్లో వున్నా దోపిడి వర్గాలకు నిద్ర పట్టడం లేదు. అందుకే అరెస్టయిన విప్లవకారుల్ని, సానుభూతిపరుల్ని పట్టుకెళ్లి తక్షణం కాల్చిచంపుతున్నారు.

జనవరిలో హైదరాబాద్‌లో జరిగిన ఎ.ఐ.సి.సి ప్లీనరీ సమావేశాల సందర్భంగా కేంద్ర హోం మంత్రి శివరాజ్‌పాటిల్ మాట్లాడుతూ, తమ ప్రభుత్వం నక్సల్స్ "సమస్య"ను సామాజిక-ఆర్థిక సమస్యగా గుర్తిస్తూనే, దానిపట్ల కఠిన వైఖరి అవలంభిస్తుందని ప్రకటించాడు. నక్సల్ సమస్యను ఉక్కుపాదంతో అణచివేయడానికి ముందుకురావాలని, అందుకు కేంద్రం నుండి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలను అడిగింది. ఇరాన్‌కు వ్యతిరేకంగా ఓటు వేయాలని భారత్‌ను బెదిరించిన పేరుబడ్డ బ్లాక్‌మెయిలర్, భారతదేశంలోని అమెరికా రాయబారి అయిన డేవిడ్ మల్‌ఫోర్డ్‌తో ఢిల్లీలో ఫిబ్రవరి మొదటి వారంలో ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి అతి రహస్యంగా కలిసి మంతనాలు చేసివచ్చాడు. మార్చి మొదటి వారంలో భారత్ పర్యటించిన అంతర్జాతీయ టెర్రరిస్టు, క్రూరుడు జార్జిబుష్ రక్షణ బాధ్యతలు, అమెరికా సామ్రాజ్యవాదుల సలహా, సహకారాలతో మావోయిస్టు ఉద్యమాన్ని అణచటం గురించిన నిర్ణయాలు ఈ సమావేశంలో జరిగి వుంటాయనేది నిస్సందేహం. డి.జి.పి కూడా తన 10 రోజుల ఆస్ట్రేలియా పర్యటనకు కొద్ది ముందుగా అమెరికా అధికారుల్ని కలిసి రహస్య మంతనాలు జరిపాడు. తమ అమెరికా యజమానులతో జరిపిన రహస్య మంతనాల తర్వాత ఫిబ్రవరి మొదటి వారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం వేసవి దాడిని ప్రారంభించింది.

ఈ దాడిలో ఫిబ్రవరి నుండి ఇప్పటి వరకు ప్రకాశం, మహబూబ్‌నగర్, నల్గొండ, గుంటూరు, కడప జిల్లాలు కలిపి 35 మంది వరకు విప్లవకారుల్ని రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్లలో హత్య చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సెక్రటేరియట్ సభ్యుడు కా॥ మట్టం రవికుమార్, గుంటూరు జిల్లా కమిటీ సభ్యుడు కా॥ జానయ్య(సురేష్)లను అరెస్టు చేసి పట్టుకుని కాల్చిచంపి పచ్చి కిరాతకంగా ఎన్‌కౌంటర్ కథ అల్లింది. కడప జిల్లాలో కోవర్టు కుట్రతో 9 మంది విప్లవకారుల్ని హత్య చేసింది. వయసు పైబడిన స్త్రీ అనికూడ చూడకుండ ఎక్కడో ఒంటరిగా బతుకుతున్న మహిళా కామ్రేడ్ ఈశ్వరమ్మను పట్టుకుని కాల్చిచంపి ఎన్‌కౌంటర్ కథ అల్లారు.

వై.యస్.ఆర్ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఈ రెండేళ్ళలో దాదాపు 120 మందికి పైగా మావోయిస్టు, జనశక్తి నక్సలైట్లను పొట్టనబెట్టుకుని, చర్చల ప్రతినిధిని చంపిన నీచమైన ఖ్యాతిని కూడా సంపాదించుకుంది. మెదక్ జిల్లా కొండపర్తి, కరీంనగర్ జిల్లా బొప్పాపురం గ్రామాల్లో రాత్రిపూట రోడ్డువెంట వెళ్తున్న అమాయకులను కాల్చిచంపి ఎన్‌కౌంటర్ కథ అల్లడానికి ప్రయత్నించిన పోలీసులను ప్రజలు వెంటబడి తరమటంతో బూటకపు ఎన్‌కౌంటర్ కథ బట్టబయలైంది. తమ బతుకుదెరువు సమస్య గురించి శాంతియుతంగా పోరాటం చేస్తున్న గంగవరం మత్స్య కార్మికులపై కాల్పులు జరిపి ఒకర్ని బలితీసుకోవటం వై.యస్.ఆర్ ప్రభుత్వ దుర్మార్గానికి పరాకాష్ట. ఇక ప్రజలపై ఇటువంటి కాల్పుల సంఘటనలు మన కళ్ళముందు ప్రత్యక్షమయ్యే రోజులు అనేకం ముందు ముందు రానున్నాయనేది నిస్సందేహం. ఇక రైతుల ఆత్మహత్యలకు, ఆకలిచావులకు అంతేలేదు.

ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రజలికిచ్చిన వాగ్దానాలు, హామీలు తుంగలో తొక్కి, పై మెరుగుల పథకాలతో ప్రజల్ని మోసగిస్తూ, ప్రపంచబ్యాంకు ఆదేశాలకు పూర్తిగా దాసోహమంటూ ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న వై.యస్.ఆర్ ప్రభుత్వం పట్ల ప్రజల వ్యతిరేకత మొన్నటి స్థానిక ఎన్నికల్లో బయటపడింది. తెలంగాణ పట్ల నిర్లక్ష్యం కాంగ్రెస్ బలాన్ని అక్కడ

గణనీయంగా దెబ్బతీసింది. కాంగ్రెస్ కోల్పోయిన రెండు జిల్లా పరిషత్‌లు తెలంగాణవే. టి.ఆర్.ఎస్ దళారీతనానికి దవడ పగిలే దెబ్బతో గుణపాఠం చెప్పారు. కాంగ్రెస్, టి.ఆర్.ఎస్‌లు కోల్పోయిన స్థానాలను తెలంగాణలో టి.డి.పి దక్కించుకుంది తప్ప ప్రజల అభిమానంతో పెరిగిన బలం కాదిది. అదే మిగతా జిల్లాల్లో బలం ఏమాత్రం పెరగలేదు. వై.యస్.ఆర్ పరిపాలనపై తీవ్ర వ్యతిరేకత పెరుగుతుందనేదానికి ఈ ఎన్నికల ఫలితాలు నిదర్శనం.

ప్రపంచబ్యాంకు ఆదేశిత విధానాలతో రాష్ట్రంలో ప్రజాగ్రహం పెరుగుతుండగా, వై.యస్.ఆర్ ఫాసిస్టు ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం, అమెరికా సామ్రాజ్యవాదుల (ఢిల్లీ, అమెరికా పాలకుల) మార్గ నిర్దేశంతో రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజాయుద్ధాన్ని అణచివేయడానికి, మారణకాండలు సృష్టిస్తున్నది. మరోపక్క వై.యస్.ఆర్ - జానారెడ్డి - స్వరణ్‌జిత్ సేన్‌ల దుష్టత్రయం రాష్ట్రంలో విప్లవోద్యమాన్ని రెండు సంవత్సరాల్లో తుడిచేస్తామని ప్రగల్భాలు పలుకుతుంటే, బ్రద్దలవుతున్న ప్రజా గ్రహం, ప్రజాయుద్ధం నానాటికీ తీవ్రమౌతూ, విస్తృతమౌతున్నాయి. ❍

---

*(.....16వ పేజీ తరువాయి)*

పర్యటించింది. ఓ.సి.పిల కింద భూములు కోల్పోయిన గ్రామాల పరిస్థితిని తెలుసుకున్నారు. పై గ్రామాల్లో ఎక్కువ శాతం ప్రజలు బొగ్గు బావులు ఓ.సి.పిలతో తమ బతుకులు బుగ్గిపాలయ్యాయని వ్యవసాయ భూములు జనవనరులు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ.సిలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలకు సరసన పునరావాసం కోసం జరుగుతున్న పోరాటాలు కూడా తోడవుతూన్నాయి. శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్టు ప్రాజెక్టుకై సేకరించే భూములను అసైన్‌మెంట్ ల్యాండుగా కాకుండా లావన్ పట్టాలుగా పరిగణించి పూర్తి నష్టపరిహారంతో పాటు భూ నిర్వాసితులకు ప్రత్యేక ప్యాకేజి అమలుతో సంక్షేమ చర్యలు చేపడితేనే సహకరిస్తామని తాళ్లపల్లి గ్రామ పంచాయితీ డిసెంబర్ 2005లో ఏకగ్రీవంగా తీర్మానించింది.

పెద్దంపేటలో తలపెట్టిన షాఫ్ట్ బ్లాక్ ప్రాజెక్టులపై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా 2005 డిసెంబర్‌లో ఒక సదస్సు జరిగింది. ఇందులో పాల్గొన్న వందలాది మంది ప్రజలు, కార్మికులు ఓ.సి.పి వల్ల ఉపాధి కోల్పోయి వారి బతుకులు ఎంత దుర్భరంగా మారాయో, కాలుష్యం వల్ల వారి ఆరోగ్యాలు ఎంతగా దెబ్బతింటున్నాయో, ఆవేదనగా వివరించారు. అంతేగాక నిర్వాసితులపట్ల, సింగరేణి గనుల ప్రభావిత ప్రాంతాల సమస్యల పట్ల యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరిని తీవ్రంగా దుయ్యబట్టారు.

ప్రపంచీకరణ, గ్లోబల్‌విలేజ్ లక్ష్యాల ఫలితంగా అంతర్జాతీయ గుత్త సంస్థలకు వాళ్ళతో మిలాఖత్ అయిన స్వదేశీ పెట్టుబడిదారులకు లాభాలు విపరీతంగా పెరుగుతున్నాయి. అదే సమయంలో ఆయా దేశాల్లో ప్రజలు తిండికి మలమలలాడే పరిస్థితి ఏర్పడుతున్నది. ఆకలి చావులు, ఆత్మహత్యలు, నిరుద్యోగం విలయతాండవం చేస్తున్నాయి. భారతదేశంలో నూతన ఆర్థిక విధానాల మూలంగా, వివిధ ప్రాజెక్టుల మూలంగా ఆదివాసులు, ఇతర ప్రజలు పెద్దఎత్తున నిర్వాసితులు అవుతున్నారు. ఖనిజాలను వెలికితీసే గనుల తవ్వకం వలన నేడు ఒరిస్సా, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లలో లక్షలాది మంది ప్రజలు నిర్వాసితులవుతున్నారు. పోలవరం, నర్మదా మీద నిర్మించే నీటి ప్రాజెక్టులు, గంగవరం పోర్టులాంటి నిర్మాణాల వలన కూడ లక్షల్లో ప్రజలు నిర్వాసితులవుతున్నారు. నేడు సింగరేణిలో న్యూకోల్ పాలసీలో భాగంగా ప్రైవేటీకరణ, యాంత్రీకరణ, ఆధునీకరణ ప్రవేశపెట్టబడ్డాయి. అండర్ గ్రౌండ్ గనులకు బదులు ఓపెన్‌కాస్టులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతున్నది. దీనితో కార్మికులను తగ్గించి వేస్తున్నారు. ఉత్పత్తికి, ఉత్పాదకతకు సింగరేణి యాజమాన్యం ప్రాధాన్యత ఇవ్వడం జరుగుత్నుది. ఓపెన్‌కాస్టుల మూలంగా సింగరేణి ప్రభావిత గ్రామాల ప్రజలు పెద్దఎత్తున నిర్వాసితులవుతున్నారు. ఓపెన్‌కాస్టులకు వ్యతిరేకంగా సింగరేణి కార్మికులు, సింగరేణి ప్రభావిత నిర్వాసిత ప్రజలు ఐక్యంగా పోరాడాలి. ఎక్కడికక్కడ పనులను అడ్డుకోవాలి. ఆవిధంగా నిర్వాసిత ప్రజలు కదిలినప్పుడే గ్రామాలు, భూములు, ప్రజల జీవితాలు రక్షించబడ్తాయి. సామ్రాజ్యవాదులు, దేశీయ దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు కలిసి అనుసరిస్తున్న దోపిడి వలన దేశవ్యాప్తంగా నిర్వాసితులవుతున్న ప్రజలతో భుజం భుజం కలిపి పోరాడాలి. ❍

# ఐదు రాష్ట్రాల ఎన్నికలు

మే 11న తేదీన వెలువడిన అసోం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పాండిచ్చేరిల ఎన్నికల ఫలితాలు పాలకవర్గాల పట్ల ప్రజల వ్యతిరేకతనూ, ఆ వ్యతిరేకత వల్ల పాలకవర్గాలు బలహీన పడుతున్న తీరునూ స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

ప్రజా వ్యతిరేకత భయం అన్ని పార్టీల్లోనూ కొనసాగుతూ వస్తోంది. స్వంతంగా గెలుస్తామనే విశ్వాసాన్ని అన్ని పార్టీలూ ఎప్పుడో కోల్పోయాయి. అందుకే గత కొంత కాలంగా ఎన్నికల ముందు కూటములుగా ఏర్పడి మాత్రమే ప్రజల ముందుకు ఓట్లడగడానికి వస్తున్నాయి. ఈ ఐదు రాష్ట్రాల్లో కూడా కూటములుగా ఏర్పడ్డం చూస్తే, ఈ రాష్ట్రాల్లోని అన్ని పార్టీలకూ ప్రజా వ్యతిరేక భయం ఉందనేది అర్థం అవుతుంది. వాటి భయం అవాస్తవమేమీ కాలేదు. పశ్చిమ బెంగాల్‌లో తప్ప మరే రాష్ట్రంలోనూ ఏ ఒక్క పార్టీకీ ప్రజలు మెజారిటిని కట్టబెట్టలేదు. ఫలితంగా అసోం, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరీలలో సంకీర్ణ ప్రభుత్వాలే ఏర్పడ్డాయి. పశ్చిమ బెంగాల్‌లో సి.పి.ఎం పూర్తి మెజారిటిని సాధించినప్పటికీ ఆ మెజారిటీ స్వతంత్రంగా పోటీ చేసి సాధించింది కాదు. సి.పి.ఎం కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేసి వుండక పోతే నిస్సందేహంగా దాని సీట్లు తగ్గి వుండేవే. పాలకవర్గాల పట్ల ప్రజల అవిశ్వాసం ఫలితంగా కేంద్రంలో మొదలైన సంకీర్ణ పాలన అన్ని రాష్ట్రాలకు అనివార్యమైపోతున్నది. అది పాలకవర్గాల్లో రోజు రోజుకూ పెరుగుతున్న అస్థిరతను తెలియజేస్తోంది.

ప్రజా వ్యతిరేకత ఏ పార్టీ మీద ఎంత వుందో పరిశీలిస్తే - ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మొత్తంగానే ఘోరంగా విఫలమైంది. యు.పి.ఎ సారధిగా, కాంగ్రెస్ పరిపాలనలో వచ్చిన ఈ రెండేళ్ల నుంచీ సామ్రాజ్యవాద అనుకూల విధానాలను మరింతగా అమలు చేస్తున్నది. అన్ని మౌలిక రంగాల్లోకి విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తూ మరింతగా ప్రయివేటీకరణకు పాల్పడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తతకు గురి చేస్తోంది. ప్రజలను మరింతగా సమస్యల సుడి గుండంలోకి నెడుతోంది. మన్మోహన్ అమెరికా దళారీగా వ్యవహరిస్తున్న వైనం ప్రజలకు స్పష్టంగా అర్థమవుతుంది. ఫలితంగా ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ పట్ల పెరిగిన వ్యతిరేకత ఈ ఎన్నికల్లో బయటపడింది. అసోం, పాండిచ్చేరిలలో అధికారం నిలబెట్టుకొనగలిగినప్పటికీ ఈ రెండు రాష్ట్రాల్లోనూ మునుపటి కంటే సీట్లు తగ్గాయి. అసోంలో నయితే గణనీయంగా తగ్గాయి. మన్మోహన్ సింగ్ అసోం నుంచి రాజ్యసభ సభ్యుడుగా కొనసాగుతున్నందు వల్ల దాన్ని ప్రధాని రాష్ట్రంగా చేసిన ప్రచారమూ, ఎన్నికల ముందు ప్రకటించిన అభివృద్ధి ప్యాకేజీలూ సహితం అక్కడ కాంగ్రెస్‌కు బలాన్ని ఇవ్వలేక పోయాయి. దాని దేశవ్యాప్త విధానాలతో పాటు, అసోంలో జాతి పోరాటాలపై తీవ్ర అణచివేతను ప్రయోగించడం వలన కాంగ్రెస్ పార్టీపై ఆ రాష్ట్రంలో వ్యతిరేకత పెరిగింది. ఇక కేరళలో దాదాపు 60 శాతం సీట్లను కోల్పోయి ఓటమి పాలయింది. పశ్చిమ బెంగాల్‌లోనూ మునుపటి కంటే మరిన్ని తక్కువ సీట్లే గెలుచుకోగల్గింది.

కాంగ్రెస్ ఈ విధంగా ఘోరంగా ఓడిపోయినప్పటికీ తమ ఓటమిని అంగీకరించని మన్మోహన్‌సింగ్ ఎన్నికల ఫలితాలను లౌకిక శక్తుల విజయంగా చెప్పుకున్నాడు. రాజశేఖర్ రెడ్డి కూడా ఇదే మాట అన్నాడు. అంతేగాక వామపక్షాల గెలుపును కూడా తమ ఖాతాలో వేసుకొని దీన్ని యు.పి.ఎ విజయంగా కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ అయిదు రాష్ట్రాల్లోనూ బిజెపి మొదటి నుంచీ బలంగా లేదు బలంగా వున్నదాన్ని ఓడించి వుంటే 'లౌకిక శక్తుల' విజయంగా చెప్పుకోవడం కొంతయినా సమంజసంగా ఉండేది. ఇక దాన్ని యుపిఎ విజయంగా చెప్పుకోవడానికే లేదు. ఎందుకంటే యుపిఎ భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్, సి.పియం అసోం, కేరళ, పశ్చిమ బెంగాల్‌లలో ప్రత్యర్థులు. ఇక్కడ కూటముల్లోని అవకాశవాదం గురించి ఒక్కమాట చెప్పుకోవాలి. ఎక్కడ ఏ పార్టీతో కలిస్తే అధికారం చేపట్టగలమనే ఆలోచన తప్ప ఆ పార్టీల విధీ విధానాలు, వాటి మధ్య భావసార్యూత అనే అంశానికి ఏ మాత్రం ప్రాధాన్యత వుండదు వాటిలో తమిళనాడులో ఒకే కూటమిలో వున్న సి.పి.ఎం, కాంగ్రెస్‌లు మిగితా రాష్ట్రాల్లో ప్రత్యర్థులుగా బరిలోకి దిగింది ఇందుకే. దాని ఓటమి స్పష్టంగా కనబడుతున్నప్పటికీ దాన్ని విజయంగానే చెప్పుకుంటున్నదంటే అది ప్రజలను వెర్రివాళ్లుగా భావిస్తున్నట్లు.

బి.జె.పిది మరింత అధ్వాన్న పరిస్థితి. దేశీయ స్థాయిలో రెండవ పెద్ద పార్టీ అయిన బిజెపి, ఈ అయిదు రాష్ట్రాల్లో ఎక్కడా కనీస పోటీనివ్వలేక పోయింది. పాండిచ్చేరి, తమిళనాడుల్లో మునుపు ఉన్న ఒకటీ అరా సీట్లు కాస్తా పోయి పూర్తిగా తుడిచిపెట్టుకు పోయింది. కేరళ, పశ్చిమ బెంగాలలో దానికి గతంలో కూడా ఒక్క సీటు లేదు. ఈసారీ అదే పరిస్థితి. పైగా పశ్చిమ బెంగాల్‌లో

దీనితో చేయి కలిసిన పాపానికి తృణముల్ కాంగ్రెస్ కూడా ఘోరంగా ఓడిపోయింది. బి.జెపి ఒక్క అసోంలోనే 126 సీట్లున్నచోట 10 సీట్లను మాత్రం గెలుచుకోగల్గింది. తన మతోన్మాద చర్యల ద్వారా అది ప్రజలకు ఎంతగా దూరమవుతున్నదో. ప్రజా వ్యతిరేక విధానాల వల్లా, అంతర్గత సంక్షోభాల వల్లా రోజు రోజుకూ క్షీణిస్తోన్న బిజెపి దేశవ్యాప్త పార్టీగా తన స్థానాన్ని కోల్పోతున్నదని కూడా అర్థమవుతున్నది.

ఈ ఎన్నికలు సి.పి.ఎంకు కల్సి వచ్చాయి. కేరళలో కాంగ్రెస్‌ను ఓడించి అధికారంలోకి వచ్చింది. పశ్చిమ బెంగాల్లో మునుపటి కంటే అధికసీట్లు సాధించి వరసగా ఏడోసారి అధికారంలోకి వచ్చింది. మిగతా రాష్ట్రాల్లోనూ సీట్లను పెంచుకుంది. పశ్చిమ బెంగాల్లో తమ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగానే అన్ని రాష్ట్రాల్లోనూ పార్టీ ప్రతిష్ఠ పెరుగుతోందని సి.పి.ఎం చెప్పుకుంటోంది. కానీ కాంగ్రెస్ బాటలోనే సి.పిఎం కూడా పశ్చిమబెంగాల్‌లో నూతన ఆర్థిక విధానాలను అమలు చేస్తోంది. విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తోంది. ప్రపంచబ్యాంకు వద్ద అప్పులూ తెస్తోంది. ఒకవైపు కాంగ్రెస్ విధానాలనే అమలు చేస్తున్న మరోవైపు కాంగ్రెస్ విధానాలను వ్యతిరేకిస్తున్నట్లుగా చెప్పుకుంటూ ప్రజలను మోసం చేస్తోంది. అది చేస్తోన్న మోసానికి కాంగ్రెస్, బిజెపిలపై ప్రజల్లో తీవ్రమౌతున్న వ్యతిరేకత తోడయి ఈసారి సిపిఎంకు అనుకూలించింది. అంతేకాక పశ్చిమ బెంగాల్‌లో సిపిఎంకు ప్రత్యామ్నాయం లేదు. తృణముల్ కాంగ్రెస్, బిజెపితో పొత్తు పెట్టుకోవడంతో ఆ పార్టీని ప్రజలు తిరస్కరించారు. దాని మీద వ్యతిరేకత కూడా సిపియంకు ఈసారి గతం కంటే ఎక్కువ సీట్లు రావడానికి దోహదం చేసింది. కేరళలో సిపిఎం నేతృత్వంలోని ఎల్.డి.ఎఫ్ కాంగ్రెస్ నేతృత్వంలోని యు.డి.ఎఫ్ చేరోసారి అధికారాన్ని చేజిక్కించుకుంటున్నాయి. ఈసారి అది ఆనవాయితీ కొనసాగిందే తప్ప పెద్దగా విశేషం లేదు. కమ్యూనిజం పేరు చెప్పుకుంటూ సామ్రాజ్యవాద విధానాలను అవలంభిస్తున్న దాని నిజస్వరూపాన్ని పై రెండు రాష్ట్రాల ప్రజలు తప్పక గ్రహిస్తారు. అది అవలంభిస్తోన్న విధానాల ఫలితాలు ప్రజాపుద్యమాలకు దారి తీసి ఆ పార్టీని సమీప భవిష్యత్తులో బలహీనపరుస్తాయి.

తమిళనాడులో తన నిరంకుశ వైఖరితో అనేక ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడ్డ జయలలిత ఓడిపోవడం పెద్ద విశేషమేమీ కాదు. కానీ జయ మీద వెల్లువెత్తిన వ్యతిరేకతా, డి.ఎం.కె కురిపించిన వాగ్దానాల వానా సహితం ఆ పార్టీకి పూర్తి మెజారిటీని సంపాదించి పెట్టలేక పోవడమే విశేషం. ఏదో ఒక పార్టీకి బంపర్ మెజారిటీని చేకూర్చే తమిళనాడు ఓటర్లు ఈసారి రెండు పార్టీల పట్లా తమ నిరసన ప్రకటించిన ఫలితమే ఇది.

ప్రతిసారీలాగే ఈసారి కూడా ఓటర్లను అన్ని పార్టీలు ప్రలోభపెట్టే ప్రయత్నం చేశాయి. గతంలోని తమ పాలనను గుర్తు చేసి ఓట్లు అడిగే ధైర్యం ఏ పార్టీకి లేదు. ఎందుకంటే ఏ పార్టీ పాలన అయినా ప్రజా వ్యతిరేకమైనదే కనుక. కాబట్టి ఇక ముందు అది చేస్తాం, ఇది చేస్తాం అని ప్రజల్ని మభ్యపెట్టి ఓట్లు సంపాదించడమే ఎన్నికల తంతయింది. అందులో భాగంగా తమిళనాడులో డి.ఎం.కె రెండు రూపాయలకు కిలో బియ్యం, కిలర్ టీవీ ఆశ చూపింది ఓటర్లకు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక నెరవేర్చుతుందా లేదా అన్నది వేరే సంగతి. కానీ 'స్వాతంత్ర్యం' వచ్చి ఇన్నేండ్లయినా నేటికీ రెండు రూపాయలకు కిలో బియ్యం ప్రధాన ఆకర్షణీయ వాగ్దానం అయినందంటే పాలకవర్గాలు ప్రజలను ఎంత పేదరికంలో, ఎంత దుస్థితిలో ఉంచాయో అర్థమవుతుంది. తమ దుస్థితిని మరిచిపోయి రంగుల ప్రపంచంలో మునిగి, తేలిపోవడానికి కలర్ టీవీలు కూడా ఇస్తామని నిస్సిగ్గుగా వాగ్దానం చేస్తున్నాయి రాజకీయ పార్టీలు.

అయితే ఈ ప్రలోభాలను ప్రజలు పెద్దగా నమ్మడం లేదు. ఈ ఎన్నికల ఫలితాలే అందుకు తార్కాణం. రాజకీయ పార్టీల పట్లా, మొత్తంగా పార్లమెంటరీ వ్యవస్థ పట్లా ప్రజల్లో పెరుగుతున్న ఉదాసీనత, నిరసన, వ్యతిరేకత ఫలితమే నాలుగు రాష్ట్రాల్లో సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాటుకు దారి తీసింది.

రెండు దేశవ్యాప్త కూటములూ బలహీన పడుతోన్న, విశ్వాసాన్ని కోల్పోతున్న నేపథ్యంలో మూడవ కూటమి ఆలోచనను చంద్రబాబు, ములాయం సింగ్ తదితరులు ముందుకు తెస్తున్నారు. ఈ ఎన్నికలను దీనికి కసరత్తుగా వాడుకోవాలనే లక్ష్యంలో భాగంగా అసోం గణపరిషత్ తరుపున ఎన్నికల ప్రచారంలో సహితం పాల్గొన్నాడు. కానీ అసోం గణపరిషత్ ఎన్నికల్లో రాణించలేదు. మూడవ కూటమి అయినా నాలుగవ కూటమి అయినా ప్రస్తుతం ఉన్న కూటములకు భిన్నంగా ఉంటుందని ప్రజలు భావించడం లేదు. అందుకే చంద్రబాబు మూడవ ఫ్రంట్‌పై ప్రజలు ఆసక్తిని చూపడం లేదు.

ఈ ఎన్నికల ఫలితాలు భవిష్యత్ రాజకీయ చిత్రపటాన్ని సహితం ప్రజల ముందు ఉంచుతున్నాయి. యు.పి.ఎ మీద వత్తిడిని పెంచుతామని సిపిఎం ఫలితాలు వచ్చిన వెంటనే ప్రకటించింది. అయితే ఈ ఒత్తిడి యు.పి.ఎ విధానాలను మార్చుకోసం కాదన్నది సి.పి.ఎం విధానం గురించి తెలిసిన వాళ్లెవ్వరికైనా అర్థమయ్యే విషయమే. తన ప్రయోజనాల్ని నెరవేర్చుకోవడం కోసమే వత్తిడిని పెంచుతుంది. పెరిగిన తన 'బలాన్ని' చూపి ఉత్తర భారతదేశంలో సి.పి.ఎం బలపడ్డానికి యు.పి.ఎను ఉపయోగించుకునే అవకాశం

వుంది. మొత్తంగా సి.పి.యం విజయం యు.పి.ఎలో వైరుధ్యాలను పెంచింది.

ఒకవైపు ప్రజాస్వామ్యానికి జీవనాడి అని చెప్పుకునే ఎన్నికల ప్రక్రియ దేశంలో కొనసాగుతుండగానే మరోవైపు ప్రజా ఆందోళనలూ, ఉద్యమాలూ ఉధృతమవుతున్న దృశ్యం గోచరమవుతున్నది. రోజు రోజుకూ పెరుగుతున్న ధరల వల్లా నూతన ఆర్థిక విధానాల ఫలితంగా, కోల్పోతున్న ఉపాధివల్లా నిత్యావసర సరుకులను కూడా పొందలేక పోతున్న ప్రజలు ఉద్యమాల బాట పడుతున్నారు. దేశంలో "ప్రజాస్వామ్యం" ఘోరంగా విఫలమైన ఫలితమే ఇది.

బూర్జువా రాజకీయ పార్టీపై, పార్లమెంటరీ వ్యవస్థపై విశ్వాసాల్ని కోల్పోతున్న, పాలకవర్గాల్లో వైరుధ్యాలు పదునెక్కుతున్న ఈ తరుణం విప్లవానికి అనుకూలమైనది. ఈ పరిస్థితిని విప్లవశ్రేణులు సరిగా వినియోగించుకొని అనేక ప్రజా పోరాటాలను చేపట్టడం ద్వారా ఉద్యమాన్ని మరింత బలోపేతం చెయ్యాలి. విజయం వైపు త్వరితగతిన పురోగమించాలి. ○

---

# వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ఫాసిస్టు హంతక ప్రభుత్వం కోవర్టు చర్యలతో మావోయిస్టులను హత్య చేయడాన్ని ముక్త కంఠంతో ఖండించండి!

# భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సెక్రటరీ కా॥ బుర్రా చిన్నయ్య గౌడ్(మాధవ్)తో పాటు అమరులైన శ్యామల, రమ, నాగమణి, సుశీల, ఈశ్వర్, రమేష్, రమణలకు విప్లవ జోహార్లు!!

వై.ఎస్.ఆర్, జానారెడ్డి, స్వరణ్‌జిత్‌సేన్ త్రయం ఆంధ్ర రాష్ట్రంలో మావోయిస్టు విప్లవకారులపై తీవ్ర నిర్బంధకాండ కొనసాగిస్తూ ఈ రెండు నెలల కాలంలో 30 మందికి పైగా కామ్రేడ్స్‌ను హత్య చేశారు. పథకం ప్రకారం నల్లమల అటవీ ప్రాంతాన్ని పెద్ద ఎత్తున కూంబింగ్ చేస్తూ భయానక వాతావరణాన్ని సృష్టించారు. కోవర్టులను సృష్టించి వారిచే రాష్ట్ర నాయకత్వాన్ని దెబ్బతీయడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగానే జూలై 22న రాత్రి నల్లమల అటవీ ప్రాంతంలోని ఎర్రగొండపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని పాలుట్ల అటవీ ప్రాంతంలో కోవర్ట్ సహాయంతో నిద్రిస్తున్న కా॥ మాధవ్‌ను అతనితో పాటు 8 మంది కామ్రేడ్స్‌ను పొట్టన పెట్టుకొన్నారు. ఈ హత్యాకాండతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల తీవ్ర ఆగ్రహాన్ని ఎదుర్కొంటున్నది. ఈ ఆగ్రహాన్ని చవిచూసిన ప్రభుత్వం రాష్ట్రమంతా రెడ్ అలెర్ట్ ప్రకటించింది. నల్లమల అటవీ ప్రాంతంలో, మార్కాపురంలో వేలాది మంది పోలీసులను దింపి నానాబీభత్సం సృష్టిస్తున్నది. పోలీసులు గాయపడితే గంటల్లో హెలికాప్టర్లను పంపించి వారిని హాస్పటల్‌కు చేర్చే ప్రభుత్వం, హత్యకు గురైన మావోయిస్టుల శవాలను మూడు రోజుల తర్వాత కూడ హత్యగావించిన అటవీ ప్రాంత స్థలం నుండి బయటకు తెచ్చి పోస్టుమార్టం జరిపించడం, బంధువులకు అప్పగించడం కాని ప్రభుత్వం చేయడం లేదు. దీనితో ప్రభుత్వం పథకం ప్రకారం హత్యగావించారనే విషయం అర్థమవుతున్నది.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచ బ్యాంక్ ఆదేశాలపై ప్రభుత్వం విప్లవోద్యమాన్ని తుదముట్టించాలనే కుట్రలను ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు ఖండించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

ప్రభుత్వ ఫాసిస్టు నిర్బంధాన్ని ఎదుర్కొంటు ఆంధ్రప్రదేశ్‌లో విప్లవోద్యమం పురోగమించక తప్పదు.

**అమరవీరులకు జోహార్లు!**

**సి.పి.ఐ (మావోయిస్టు) వర్ధిల్లాలి!!**

# సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనులు - నిర్వాసితులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో లక్షలాది టన్నుల నేల బొగ్గు ప్రతి సం॥ ఉత్పత్తి అవుతున్నది. ఖమ్మం జిల్లాలోని సింగరేణి గ్రామ సమీపంలోని బొగ్గు గుట్టలు, తొలి గనిగా ఆవిర్భవించాయి. ఆ తర్వాత ఆ గ్రామం పేరిటనే సింగరేణి సంస్థ ఏర్పడి నేటికీ కొనసాగుతున్నది.

డాక్టర్ విలియంసింగ్ అనే భూగర్భ శాస్త్రజ్ఞుడు 1870 నుంచి 1888 వరకూ బొగ్గు గురించి పరిశోధన చేశాడు. ఈ పరిశోధనలో గోదావరి తీరంలో అపారమైన బొగ్గు గనులు ఉన్నాయని తేలింది. 1889లో ఖమ్మం(సింగరేణి) జిల్లాలో ప్రారంభమైన బొగ్గు తవ్వకాలు 1927లో ఆదిలాబాద్(బెల్లంపల్లి)కు, 1959లో కరీంనగర్(గోదావరిఖని)కు, 1986లో వరంగల్ (భూపాలపల్లి)కు విస్తరించి ప్రస్తుతం దక్షిణ భారతదేశంలో సింగరేణి ఏకైక బొగ్గు సంస్థగా ఉన్నది. 1886లో ఏర్పడిన హైదరాబాద్ దక్కన్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ 1989లో వ్యాపారం రీత్యా బొగ్గు తవ్వకాలను మొదలుపెట్టింది. 1921లో ఆ సంస్థ పేరు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌గా మారింది. 1945లో ఏడవ నైజాం మీర్‌ఉస్మాన్ ఆలీఖాన్ ఈ కంపెనీలో షేర్లు కొనుగోలు చేశాడు. 1949లో సింగరేణి కంపెనీ ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చింది.

350 కి.మీ ప్రాణహిత-గోదావరి పరివాహక ప్రాంతంలో 6,200 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్టు ధృవీకరించారు. ప్రారంభంలో కేవలం 25 వేల నుంచి 50 వేల టన్నులు మాత్రమే ఉత్పత్తి అయిన బొగ్గు సింగరేణి విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం 35 మిలియన్ టన్నులకు పెరిగింది. ఇది మొత్తం దేశీయ ఉత్పత్తిలో దాదాపు 10 శాతం.

ఈ నాలుగు జిల్లాల్లో మానవ శక్తితో చేసే ప్రయత్నానికి 1937లో యంత్ర సహాయం లభించి క్రమంగా 1979లో ఓపెన్‌కాస్టు గనుల కార్యక్రమం మొదలైంది. సింగరేణి వ్యాప్తంగా తొమ్మిది ఓపెన్‌కాస్టు గనులు నడుస్తున్నాయి. క్రమంగా యాంత్రీకరణ ఆధునీకరణలను పెంచుతూ ఓపెన్‌కాస్టు గనులను పెంచుతున్నారు. ఈ ఓపెన్‌కాస్టు గనుల మూలంగా దాని చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వేలాది మంది ప్రజలు నిర్వాసితులు అవుతున్నారు.

ఏది చెప్తారో అది చెయ్యరు, ఏది చేస్తారో అది చెప్పరు- ఇది సామ్రాజ్యవాద దోపిడీ నీతి. పర్యావరణం పై ఎంతో శ్రద్ధ ఉన్నట్లుగా మాట్లాడుతూనే ఇక్కడ పర్యావరణాన్ని దెబ్బతీయడం జరుగుతున్నది. పర్యావరణ పరిరక్షణ కోసం, ప్రకృతి సమతుల్యత కోసం సింగరేణి మేనేజ్‌మెంట్ శ్రద్ధతో పని చేస్తున్నదనీ, 1960 నుండి నేటి వరకు ఒక కోటి చెట్లను నాటి కాలరీ ప్రాంతాలను సుందర వనాలుగా మార్చుతున్నదని, అందమైన బ్రోచర్లతో అబద్ధ ప్రచారం చేస్తున్నారు. కానీ ఆచరణలో బొగ్గు గనుల తవ్వకాల వలన సస్యశ్యామలమైన గోదావరి పరివాహక ప్రాంతం క్రమంగా ఎడారిగా మారిపోతున్నది. ముఖ్యంగా ఓపెన్‌కాస్టు గనులవల్ల ఈ ప్రమాదం మరింత పెరిగిపోయింది. భూమిని తలకిందులుగా చేయడం వల్ల మానవ నివాసయోగ్యంగాని పరిస్థితే కాకుండా, భూ ఉపరితలంలో సారవంతమైన పొర దెబ్బతిని జంతుజాలం, పురుగు పుట్రా, ప్రకృతి సిద్ధమైన అడవులు నశించి ఆదివాసీ ప్రజల సహజ జీవనం అంతరించి పోతున్నది. బహుళజాతి సంస్థలు గనుల తవ్వకాల వలన పర్యావరణంపై ఏర్పడుతున్న దుష్ప్రభావం నుండి తమ దేశాలను రక్షించుకుంటూ వెనకబడ్డ దేశాల్లో గనుల తవ్వకాలకు సిద్ధపడ్డాయి. అందులో భాగంగా 2003 ఢిల్లీలో వరల్డ్ మైన్ కాన్ఫరెన్స్ నిర్వహించి ఇక్కడి సంపదను తరలించుకుపోయే కుట్రలను ప్రారంభించాయి. ఒకవైపు "క్లీన్ మైనింగ్" అంటూనే ఇక్కడి పర్యావరణాన్ని బీభత్సం చేయడానికి సిద్ధపడ్డాయి. అందుకు నేటి పాలకవర్గాలు వంతపాడుతున్నాయి. ఇక్కడి ప్రజల నోట్లో మన్నుకొట్టి ఇక్కడి పర్యావరణాన్ని దెబ్బ తీసి ఇక్కడి సంపద తరలించుకుపోయే కుట్రలను కొనసాగిస్తున్నారు.

తమ దోపిడీకి మానవతా ముసుగేసి తమ లాభాల కోసం ఎటువంటి విలువలు పాటించకుండా పరమ దుర్మార్గంగా దోపిడీకి పాల్పడుతూనే మరోవైపున అభివృద్ధి కోసమే యిదంతా అంటూ ప్రచారం చేసుకుంటున్నాయి. సింగరేణిలో అభివృద్ధి పేరుతో ప్రైవేటీకరణ, యాంత్రీకరణ, ఆధునీకరణలను ప్రవేశపెడుతున్నాయి. ప్రపంచీకరణ మరో దుష్ఫలితమే 'జాబ్‌లెస్ గ్రోత్' అంటే ఒకవైపు ఉత్పత్తులు విపరీతంగా పెరిగిపోతుంటాయి. అదే సమయంలో ఉపాధి అవకాశాలు సన్నగిల్లటమే కాదు, ఉన్న కార్మికులే తమ ఉద్యోగాలను కోల్పోతారు. సింగరేణిలో సంస్కరణలు ప్రారంభం కాకముందు ఒక లక్షా 16 వేల మంది కార్మికులు పని చేస్తూ సం॥నికి 18 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసేవాళ్ళు. సంస్కరణలు ఆరంభమైన తర్వాత గడిచిన

16 సం॥రాల కాలంలో ఉత్పత్తి 35 మిలియన్ టన్నులకు పెరిగింది. కాగా 2005 సెప్టెంబర్ నాటికి సింగరేణి కార్మికుల సంఖ్య 88, 756కు పడిపోయింది. బొగ్గు గనుల్లోకి ఆధునీకరణ, ఎస్.డి.ఎల్ లాంటి అధునాతన యంత్రాల ప్రవేశం, లాంగ్‌వాల్ టెక్నాలజీ (ఒకేసారి పెద్ద మొత్తంలో బొగ్గును తీసే విధానం) రూపంలో ముందుకు వస్తున్నది. ఒకప్పుడు సింగరేణికి మారు పేరుగా సింగరేణికి వెన్నెముకగా నిలచిన 'తట్టా చెమ్మాస్' ఇవ్వాళ మ్యూజియంలోకి పోనున్నాయి. భవిష్యత్ తరాలకు మ్యూజియంలోని 'తట్టా చెమ్మాస్'ను చూపి.... ఇదిగో వీటిని ధరించి మనుషులు ఈ ఎడారి ప్రాంతంలో ఒకప్పుడు భూమి పొరల్లో వందల అడుగుల లోతున బొగ్గు తవ్వేవారు అని చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవు. 'తట్టా చెమ్మాస్‌ల'ను ఎల్.హెచ్.డిలు, ఎస్.డి.ఎల్‌లు మింగేసాయి. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి ఉత్పాదకతను పెంచడం ద్వారా నిర్దేశిత లక్ష్యాలను సాధిస్తూ, రానున్న కాలంలో సింగరేణి సంస్థ మనుగడకు కార్మికులంతా కృషి చేయాలంటూ సింగరేణి యాజమాన్యం విస్తృత ప్రచారం చేస్తున్నది. అండర్ గ్రౌండ్ గనులలో ఉత్పాదకతను పెంచడం ద్వారా బొగ్గు ఉత్పత్తిని అనుకున్నమేర సాధించేందుకు 94 ఎస్.డి.ఎల్‌లను, 37 ఎల్.హెచ్.డిలను ప్రవేశపెట్టింది. నిర్దేశిత లక్ష్యంతో 40 శాతం ఉత్పత్తి ఓపెన్‌కాస్టుల ద్వారా కొనసాగుతున్నది. నేడు ఓపెన్‌కాస్టు గనులను ఎక్కువగా చేస్తున్నారు. 2006-07 సం॥రాలలో కొన్ని అండర్ గ్రౌండ్ గనులు మూసివేతకు గురికానున్నాయి. అందులో ఇందారం-1, శ్రీరాంపూర్-2, శ్రీరాంపూర్-2ఎ, చెన్నూర్-1, గోదావరిఖని-5 ఇంక్లైనులు వున్నాయి. వీటి స్థానంలో కొత్తగా సత్తుపల్లి ఓపెన్‌కాస్టు ప్రాజెక్టు(ఓ.సి.పి)-1, మణుగూరు ఓ.సి.పి-2, కైరిగూడ ఓ.సి.పి, రామగుండం ఓ.సి.పి-1, బెల్లంపల్లి ఓ.సి.పి-2, డోర్లి ఓ.సి.పి-1, కూనవరం ఓ.సి.పిలను ప్రారంభించి నిరాటకంగా ఉత్పత్తిని కొనసాగించడానికి సింగరేణి యాజమాన్యం పథకాలు రూపొందించింది. సింగరేణి ఓపెన్‌కాస్టు గనుల ప్రభావిత గ్రామాల్లో ప్రజలకు భూములు పోయి, బతుకుపోయి, భూగర్భ జలాలు అడుగంటిపోయి, కనీసం తాగటానికైనా గుక్కెడు నీళ్ళులేని పరిస్థితి పరిణమించింది. మరోవైపు సింగరేణి బొగ్గు గనుల కింద భూములు కోల్పోయిన వారికి గతంలో ఇచ్చే ఉద్యోగాలను కూడా ఇవ్వడం బందు చేశారు. ఇలా అన్ని రకాలుగా ప్రభావిత గ్రామాల ప్రజల బతుకుల్ని నాశనం చేస్తూ వారు తినే కంచాన్ని గుంజేసి ఎంగిలి చేతులు విదిలించినట్టు సింగరేణి యాజమాన్యం కొనసాగిస్తున్నది.

సింగరేణి కాలరీస్ యాజమాన్యం మణుగూరు ఏరియాలో కొత్త ప్రాజెక్టుల ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నది. రానున్న 3 సం॥లలో వరుసగా మూడు ప్రాజెక్టులు ప్రారంభించే ప్రయత్నం చేస్తున్నది. బొగ్గుకు వున్న డిమాండ్ దృష్ట్యా మణుగూరు ఏరియాపై ఏటా 6.70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించగా ప్రస్తుతం వున్న గనులల్లో బొగ్గు నిల్వలు అయిపోతున్నాయి. కనుక ఈ గ్రామంలో కొత్త ప్రాజెక్టుల ప్రారంభం అనివార్యమని యాజమాన్యం చెబుతున్నది. 8.18 కోట్ల రూ॥ల వ్యయంతో ప్రతిపాదించిన కూనవరం ఓ.సి.పి ఈ ఏడాది క్లియరెన్స్‌లన్నీ సాధించి వచ్చే ఏడాది ప్రారంభించాలని యాజమాన్యం వ్యూహరచన చేసింది. ఈ ప్రాంతంలో 1.98 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు వున్నాయి. ఈ ప్రాజెక్టు వల్ల కూనవరం గ్రామానికి చెందిన 50 కి పైగా కుటుంబాలు నిర్వాసితులయ్యే ప్రమాదంతోపాటు రైతులు తమ భూములను కోల్పోయే అవకాశాలు వున్నాయి. దీనితోపాటు ఓసి-2 పేరుతో 816 హెక్టార్ల భూమిలో ప్రాజెక్టు ప్రారంభిస్తున్నది. దీంతో కిష్టాపురం, లచ్చిగూడెం, దుబ్బగూడెం, దుబ్బరోడ్డు గుంపు, దోరపాడు, కొత్తూరు, బోతు కొత్తగూడెం తదితర గ్రామాల ప్రజలు నిర్వాసితులవుతున్నారు.

అంతేగాక కమాన్‌పూర్ మండలం పెద్దంపేట షాఫ్ట్‌బ్లాక్ ప్రాజెక్టు(ఒక విధమైన భూగర్భ గని) తవ్వకాన్ని ప్రారంభిస్తున్నది. మెకనైజ్డ్ లాంగ్‌వాల్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా భూగర్భ గని పనులు త్వరలోనే ప్రారంభిస్తుంది. దీనివల్ల 725 హెక్టార్ల విస్తీర్ణంలో ప్రజలు భూమిని కోల్పోతున్నారు. ఈ ప్రాజెక్టు నిమిత్తం సింగిరెడ్డి పల్లిలో 590 కుటుంబాలు, చందనపూర్‌లో 98 కుటుంబాలు ఖాళీ చేయవలసి వుంటుంది. 350 కోట్ల పెట్టుబడితో ప్రారంభించే ఈ ప్రాజెక్టు ఫలితంగా ఈ ప్రాంతంలో సుమారు 600 కోట్ల రూ॥ల మేరకు నష్టం జరిగే ప్రమాదం వుంది. అయితే ఈ ప్రాజెక్టు వల్ల 863 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని కంపెనీ హామీ ఇస్తున్నది. కానీ ఈ ప్రాజెక్టు కింద కోల్పోతున్న పంట పొలాలను సాగుచేస్తే ఎలాంటి ఉద్యోగాలు ఇవ్వకుండానే వీరందరికీ శాశ్వతంగా ఉపాధిని కల్పించేందుకు అవకాశాలున్నాయి.

ఆదిలాబాద్ జిల్లా తిర్యాని మండలంలో కైరిగూడ ఓపెన్‌కాస్టు వనరులను సింగరేణి యాజమాన్యం ప్రారంభించింది. దీని మూలంగా దంతనపల్లి, డోర్లి, బోర్దం, లెండిగూడెం, గోమరిగూడెం, దేవాయ్‌గూడెం, డోంగర్‌గాం, ఆరెగూడెం మొదలగు ఆదివాసీ గూడాలు ప్రజలు నిర్వాసితులవుతున్నారు. దాదాపు 15 వేల ఎకరాల భూములూ, అడవి సర్వనాశనం అవుతుంది. గతంలో

వట్టివాగు ప్రాజెక్టు మూలంగా ఆదివాసీ గూడాల భూములు కోల్పోయి నిర్వాసితులైనారు. ఇప్పటికీ ప్రభుత్వం నిర్వాసితులైన ఆదివాసులకు పునరావాసం కల్పించలేదు. ఫలితంగా వందలాది మంది ఆదివాసులు పొట్టచేత పట్టుకుని లోతట్టు ప్రాంతాలకు తరలి వెళ్ళారు. అయితే అభివృద్ధి పేరుతో ఇంత మందిని నిర్వాసితులను చేసి కట్టిన వట్టివాగు సాగునీటి ప్రాజెక్టు ఇక్కడ తలపెట్టిన ఓ.సి.పి వల్ల నామరూపాలు లేకుండా పోతుంది. గోలేటి మండలంలోని అబ్బాపూర్, సోనాపూర్ గ్రామాల గూడాలను కూడా బలవంతంగా తొలగించి ఓపెన్‌కాస్టు ప్రారంభిస్తున్నది. కాసిపేట మండలం కోమటిచేను ప్రాంతంలోనూ, మందమర్రి మండలంలోని సావన్‌పల్లి, మామిడిగుట్ట, వెంకటాపురం, చిర్రకుంట, ఎదలపాడు, చిత్రాపూర్ ప్రాంతాల్లోనూ ఓపెన్‌కాస్టును ఏర్పాటు చేయడానికి కసరత్తులు ప్రారంభించింది.

ఈ ప్రాజెక్టుల ఫలితంగా ప్రభావితమయ్యే అనేక గ్రామాల్లో గాలి, నీరు, ధ్వని కాలుష్యాలు పెరిగి ప్రజల అనారోగ్యానికి తీవ్ర విఘాతం కల్గుతుంది. ఈ గనులు చిమ్మే విష వాయువుల వల్ల ఏర్పడే కాలుష్యం ఫలితంగా ఏడాదికి సుమారు 28 మంది ప్రజలు అనారోగ్యంతో చనిపోతున్నారని ఒక అంచనా. ఈ ప్రాజెక్టు ఫలితంగా ఈ ప్రాంతాల్లోని భూమి 7,8 మీటర్ల లోతుకు కుంగిపోయే ప్రమాదం వుంది. అయితే సింగరేణి అధికారులు మాత్రం 2 మీటర్లే కుంగిపోతుందని తప్పుడు లెక్కలు చెప్తున్నారు.

ఇక యిక్కడి ప్రజానీకం ఘోరంగా ఉపాధిని కోల్పోతున్నారు. గతంలో ధనిక రైతులుగా బతికిన వారు సహితం భూముల్ని కోల్పోవడం వల్ల చిన్నా చితకా కూలీ పనులు చేసుకుంటూ పొట్ట పోసుకుంటున్నారంటే ఇక బడుగు జీవుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. వరి, మక్కజొన్న వంటి పంటలను పండించి లారీల కొద్దీ ఇతర ప్రాంతాలకు తరలించిన ఇక్కడి రైతాంగం ప్రస్తుతం అడుక్కుతినే పరిస్థితిలో ఉన్నారంటే అతిశయోక్తి కాదు.

ప్రాజెక్టుల కోసం భూముల్ని సేకరించడానికి అధికారులు కుటిలయత్నాలకు పాల్పడుతున్నారు. భూముల్ని సేకరించడానికి పది రోజుల ముందుగా గ్రామాలకు వెళ్లి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజలను భ్రమలో ముంచెత్తే ప్రయత్నం చేస్తున్నారు.

ఇక నిర్వాసితుల పట్ల ఎంత బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్నారంటే, సింగరేణి అధికారులు వెలువరించిన రిపోర్టులో పునరావాసానికి సంబంధించిన ఆర్థిక, సామాజికపరమైన అంశాలేవీ ప్రస్తావించలేదు. ఆదివాసీ ప్రాంతాల్లో చాలా భూములకు పట్టాలుండవు. చాల సం॥రాలుగా అడవి కొట్టుకుని సాగు చేసుకుంటూ వుంటారు. ఇక్కడి ఆదివాసీ ప్రజానీకం ఇలాంటి భూములకు ఎటువంటి నష్టపరిహారం చెల్లించలేకుండానే బలవంతంగా స్వాధీనం చేసుకుంటున్నారు. గూడాలకు గూడాలనే తొలగిస్తున్నారు. శ్రీరాంపూర్ ప్రాంతంలోని తాళ్లపల్లి గ్రామంలో 500 ఎకరాల భూమిని అసైన్‌మెంట్ భూమిగా పరిగణించి, సేకరిస్తున్నారు. నష్టపరిహారం గురించి దాటవేస్తున్నారు.

తమ జీవితాలను దెబ్బతీస్తున్న ఓపెన్‌కాస్టు గనులను స్థానిక ప్రజానీకం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా దంతన్‌పల్లి, డోర్లి, బొర్ధం మొదలైన గ్రామాల్లోని ప్రజలు ఓ.సి.పిలను వ్యతిరేకిస్తూ ఎప్పటి నుండో పోరాడుతూ వస్తున్నారు. ఇల్లెందు సమీపంలో తలపెట్టిన ఓ.సి.పి వలన ఇల్లెందు పట్టణంలోని ఒక కాలనీ పూర్తిగా ఆనవాళ్లు లేకుండా పోయే ప్రమాదం ఏర్పడటంతో అక్కడి ప్రజానీకం తీవ్రంగా పోరాడారు. ఫలితంగా సింగరేణి యాజమాన్యం వెనక్కి తగ్గింది. కాసిపేట మండలం కోమటిచేను ప్రాంతంలో ఓ.సి.పిని ఏర్పాటు చేయడంతో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణకు కలెక్టర్ ఆధ్వర్యంలో సభ జరిగింది. ఈ సభలో ఈ ప్రాంత ప్రజలు మాకు ఓపెన్‌కాస్టు వద్దంటూ ముక్త కంఠంతో నినదించారు. ఇప్పటికే అండర్ గ్రౌండ్ గనులలో జరుగుతున్న బ్లాస్టింగ్ వల్ల చుట్టుపక్కల గ్రామాలలోని ఇండ్లు పగుళ్లు పట్టాయని, బావుల్లో నీరు లేకుండా పోయిందని, పంటలు పండటం లేదని ఆ సభలో ప్రజలు వాపోయారు. మందమర్రి మండలంలో సానన్‌పల్లి, మామిడిగట్టు, వెంకటాపురం తదితర గ్రామాల్లో ఓ.సి.పి ప్రారంభించడానికి యాజమాన్యం సర్వేలు ప్రారంభించింది. ఈ ప్రాంతం మామిడి తోటలకు ప్రసిద్ధి ఆ మామిడి తోటలనూ, పంట పొలాలను నాశనం చేసి ఓ.సి ప్రారంభిచదల్చుకుంది యాజమాన్యం. దీన్ని వ్యతిరేకించిన ప్రజలు భూమి సర్వేకోసం వచ్చిన అధికారులనూ, సిబ్బందినీ సానన్‌పల్లి గ్రామం వద్ద నిర్బంధించి, అధికారులతో మరోసారి సర్వేకురాము అని చెప్పించి వదిలిపెట్టారు.

సింగరేణి బొగ్గు గనులు ఓపెన్‌కాస్టు ప్రాజెక్టు కింద గ్రామాలను, ఇళ్లను కోల్పోయిన నిర్వాసిత ప్రాంతాల్లో, సింగరేణి ప్రభావిత గ్రామాల్లో (డిసెంబర్ 2005) మేధావుల బృందం పర్యటించింది. ఈ బృందం మేడిపల్లి ఓపెన్‌కాస్టు ప్రభావిత గ్రామాల్లో లింగాపూర్, మేడిపల్లి, ఓ.పి.పి-3 ప్రభావిత గ్రామాలు వీరపల్లి, మారేడుపాక, పెంచికలపేట, కమాన్‌పూర్, జూలపల్లి, లద్నాపూర్, బేగంపేట, ఆడివాల, వకిల్‌పల్లి గ్రామాల్లో

*(తరువాయి 10వ పేజీలో.....)*

# అణ్వాయుధాల సాకుతో ఇరాన్‌పై దాడికి కుట్ర పన్నుతున్న అమెరికా

అమెరికాకు వ్యూహాత్మకంగా ఇరాన్ దేశం అతి ముఖ్యమైనది. కనుకనే దశాబ్దాల పాటు తన కీలుబొమ్మ అయిన రాజు షాను ఏలికగా కొనసాగించింది. ప్రపంచంలో ఇరాన్ అపారమైన చమురు, సహజవాయువు నిక్షేపాలున్న దేశమే గాక, భౌగోళికంగా, రాజకీయంగా ప్రాముఖ్యత గలది. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల కీలక ప్రాంతాల సరిహద్దులుండి, పాకిస్తాన్, తుర్క్‌మెనిస్తాన్, అజర్‌బైజాన్, టర్కీలతో సరిహద్దులు పంచుకుంటున్న దేశం ఇరాన్. ఇంకా పశ్చిమాసియా దేశాలకు చమురు సరఫరా అయ్యే గల్ఫ్ ప్రాంతం, హిందూ మహాసముద్రాన్ని గల్ఫ్‌తో కలిపే హోర్మజ్ జలసంధి ఇరాన్‌కు ఎత్తుగడ రీత్యా ముఖ్యమైన ప్రాంతం. ఒక వేళ ఈ ప్రాంతాన్ని ఆక్రమిస్తే చమురు ట్యాంకర్ల రవాణాకు అంతరాయం కలిగించగల స్థితిలో ఇరాన్ వుంటుంది.




చమురు, గ్యాస్ జర్నల్ అభిప్రాయం ప్రకారం 120 బిలియన్ బ్యారళ్ళ చమురు నిక్షేపాలతో సౌదీ అరేబియా తర్వాత చమురు నిలువలున్న దేశాల్లో ఇరాన్ రెండో పెద్ద దేశం. 1680 క్యూబిక్ అడుగుల గ్యాస్ నిక్షేపాలున్న రష్యా కంటే ఎక్కువగా, ప్రపంచంలోనే అధిక ఇంధన వనరులున్న సౌదీ అరేబియాతో సమాన స్థాయిలో ఇరాన్ 940 ట్రిలియన్ క్యూబిక్ అడుగుల గ్యాస్ నిక్షేపాలు కలిగి వుంది. అలాగే కాస్పియన్ సముద్రంలోని అపార ఇంధన నిక్షేపాలలో ఇరాన్ రష్యాతో సమాన హక్కులు కలిగి వుంది. సౌదీతో పోలిస్తే ఇరాన్‌లో చమురు ఉత్పత్తి తక్కువైనప్పటికీ, సౌదీ తర్వాత ఎక్కువ చమురు నిల్వలున్న దేశం కనుక ప్రపంచ ఇంధన మార్కెట్‌లో ఇరాన్ పాత్ర ప్రముఖంగా పెరుగుతోంది. అమెరికన్ కార్పోరేషన్లు ఈ మార్కెట్‌ను గుప్పిట్లో పెట్టుకోవాలని అనుకున్నప్పటికీ ఇరాన్‌తో వ్యాపారం చేయడానికి అక్కడి చట్టాలు అనుమతించడం లేదు. అందుకే ఇరాన్ తన చమురు సంబంధాలను చైనా, రష్యాలతో పెంచుకున్నది. ఇరాన్ చమురుక్షేత్రాలు కొన్నింటిపై చైనా హక్కులను పొందింది.

ఇరాన్ పై అమెరికా నియంత్రణ సాధించాలనుకున్నప్పటికీ అనేక భౌగోళిక కారణాల వల్ల ఆక్రమణ చేయలేని పరిస్థితి వుంది. ఈ విషయంలోకి పోయే ముందు ఇరాన్ అణ్వస్త్ర సమస్యను చూద్దాం.

### చారిత్రాత్మక పరిశీలన

ఇరాన్ అణు కార్యక్రమం 1957 అధికార కుట్ర తర్వాత రాజు షాకు అమెరికా ఇచ్చిన బహుమతి. రెండు దశాబ్దాల పాటు ఇరాన్‌కు అమెరికా అణు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడమే కాకుండా, యురేనియం, ఫ్లూటోనియం న్యూక్లియర్ అణు రియాక్టర్ తయారీకి సహకారాన్ని కూడా అందించింది. అప్పుడు ఎట్టి గ్యారెంటీ అమెరికా కోరలేదు. 1979లో వచ్చిన ఇస్లామిక్ తిరుగుబాటులో రాజు షాను కూలదోసి అయతుల్లా ఖొమైనీ అధికారాన్ని చేజిక్కించుకున్నాడు. వెను వెంటనే 1980లో అమెరికా సద్దాంను ఎగదోసి ఇరాన్ పై 8 సంవత్సరాల పాటు చేయించిన యుద్ధంలో రెండు దేశాల్లోని 10 లక్షల ప్రాణాలను బలిగొన్నది. కాని కొత్త ఇస్లామిక్ ప్రభుత్వం " అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక సంధి" పై సంతకం చేసింది.

అణ్వస్త్ర రహిత దేశాలుగా మారే వాటికి " అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక సంధి" యొక్క సెక్షన్ 4 ప్రకారం అణు పరిజ్ఞానాన్ని అన్ని శాంతియుత అవసరాలకు వినియోగించుకునే స్వేచ్ఛ వుంటుంది. సెక్షన్ 6 ప్రకారం అణ్వస్త్ర రహిత దేశాలుగా రూపొందే ఇతర దేశాలతో కలిసిపోవడానికి, అట్టి పరిజ్ఞానాన్ని అందించడానికి అవకాశం వుంటుంది. ఇరాన్‌కు గల యురేనియం శుద్ధిచేసే

పరిజ్ఞానాన్ని స్వయం సమృద్ధి సాధించే హక్కును అమెరికా వ్యతిరేకిస్తోంది. ఈ స్వయం సమృద్ధి హక్కును తగ్గించడానికి ఈ క్లాజును తిరిగి రాయడానికి గత 'అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక సంధి' సమీక్షా సమావేశంలో అమెరికా ప్రయత్నించింది. కాని ఆ ప్రయత్నం నెరవేరలేదు. విద్యుత్ ఉత్పత్తి చేసే శుద్ధి చేసిన యురేనియంను ఇంకా స్వచ్ఛత చేసి అణ్వస్త్రాలకు వాడవచ్చు.

యురేనియం ఇంధన చక్రంలో యురేనియం ఖనిజాన్ని తవ్వడం, దాన్ని యురేనియం ఆక్సైడ్(ఎల్లో కేక్)గా మార్చడం వుంటాయి. ఎల్లోకేక్‌ను యురేనియం టెట్రా ఫ్లోరైడ్ వాయువుగా మార్చి ఇంకా శుద్ధి చేస్తే యురేనియం హెక్సా ఫ్లోరైడ్‌గా మారుతుంది.

సెప్టెంబర్ 11 నుంచి(9/11) అమెరికా ఇరాన్‌ను చెడు ఉద్దేశ్యం గల దేశంగా పరిగణిస్తూ, ధూర్త దేశాల జాబితాలో చేర్చింది. ఇరాక్‌లాగా మూకుమ్మడి వినాశకర ఆయుధాలు కలదిగా పరిగణిస్తూ, ఆ విధంగా ఆయుధాలు సమకూర్చుకోవడం, అణుశుద్ధి కార్యక్రమం ఆపేయాలని కోరుతోంది. అణు కార్యక్రమంపై అమెరికా యొక్క ఈ ధోరణితో ఇ.యు-3 దేశాలైన జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్‌లతో ఇరాన్ సంప్రదింపులు జరపడానికి పూనుకుంది.

ఇరాన్‌కు గల భూగర్భ నిల్వ సౌకర్యపు స్థితిని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ(ఐ.ఎ.ఇ.ఎ)కు తెలపలేదనే విషయం వెలుగులోకి రావటంతో చర్చలకు తొందర పడటం జరిగింది. నతాంజ్‌లో యురేనియంను శుద్ధిచేసి, అణ్వాయుధ వ్యాప్తి నిరోధక సంధి (నాన్ ప్రోలిఫరేషన్ ట్రీటీ - ఎన్.పి.టి)ని ఇరాన్ ఉల్లంఘించినట్లయింది. ఇది బయట పడటంతో ఎన్.పి.టి నుంచి ఇరాన్‌ను బహిష్కరించటం స్పష్టమనే ఆలోచనకు పశ్చిమ దేశాలు వచ్చాయి. అదే సమయంలో ఇరాన్‌కు గల వాస్తవ, అనుమానాస్పద అణు సౌకర్యాలను ఐ.ఎ.ఇ.ఎ ఆకస్మికంగా తనిఖీ చేయడానికి వీలు కల్పించే క్లాజును ఎన్.పి.టిలో చేర్చడానికి కొత్తగా ఇరాన్ సంతకం చేసింది. నవంబర్ 2004లో ఇరాన్ ఎస్ఫాన్, నతాంజ్‌తో సహా అంతటా అణు శుద్ధి కార్యక్రమాలను రద్దు చేసుకోవడమే గాకుండా, తర్వాత ఐ.ఎ.ఇ.ఎ వాటిని మూసివేసి సీలు కూడా వేసింది.

ఇ.యు-3 దేశాలతో ఒక సంవత్సరం పాటు చర్చలు జరిగినప్పటికీ ఇరాన్‌కు విశ్వాసం కలిగించే చర్యలు తీసికోవటంలో పురోగమనం లేదు. అమెరికా కఠిన వైఖరి విషయంలో ఇరాన్ ఇ.యు దేశాల నుంచి మధ్యవర్తిత్వాన్ని కోరుకుంది. వాటి గుర్తింపు కోసం ఒత్తిడి చేసింది. ఇ.యు దేశాల ప్రతిపాదనలను కోరి, ఒక తుది గడువు కూడా పెట్టింది. ప్రతిపాదనలకు బదులుగా 2004 జూలై 29 నాడు ఇ.యు దేశాల నుంచి ఒక లేఖ వచ్చి ఇరాన్ ఆశలను నీరుగార్చింది. ఫలితంగా ఎస్ఫాన్‌లో యురేనియం మార్పిడి పనులను(యురేనియం శుద్ధి కాదు) పునః ప్రారంభించగలమని ఐ.ఎ.ఇ.ఎకు తెలిపింది. చివరిగా ఆగస్టు 8 నాడు ఇ.యు ప్రతిపాదనలను బైట పెట్టాయి. భద్రత, ఆర్థిక సహకారం, మాదక ద్రవ్యాలు, ఉగ్రవాద నిరోధం తదితర హామీలతో కూడిన "దీర్ఘకాలిక ఒప్పంద రూపం'' ఒక దాన్ని తయారు చేశారు. కాని ఆ ప్రతిపాదనల్లో *"ఇరాన్ తన అణు కార్యకలాపాల్లో నిమగ్నం కావలసిన అవసరముందని మేము అనుకోవటం లేదు''* అని కూడా వక్కాణించాయి. ఇరాన్ అణు కార్యక్రమాలపై ఆగస్టు 11 నాడు ఐ.ఎ.ఇ.ఎ *'తీవ్ర ఆందోళన'* కలిగించే వ్యవహారం అంటూ ఒక తీర్మానం చేసింది. దీనికి భారతదేశం ఐ.ఎ.ఇ.ఎతో సహకరించింది. ఈ విషయాన్ని భారత్, ఇరాన్‌కు వ్యతిరేకంగా సెప్టెంబర్‌లో ఓటు వేయడానికి ముందే అమెరికా ప్రభుత్వ సహాయ కార్యదర్శి నికోలస్ బర్న్స్ సెప్టెంబర్ 8న బయట పెట్టాడు. పైగా, "ఇరాన్ వెంటనే తన అణు శుద్ధి కార్య కలాపాలన్నింటినీ నిలిపి వేయాలని'' ఆ తీర్మానంలో కోరిందని కూడా తెలిపాడు.

పశ్చిమ దేశాలు అవలంబిస్తున్న ఇరాన్ వ్యతిరేక వైఖరి కారణంగానే యురేనియం శుద్ధికి అవసరమైన మార్పిడి కార్యక్రమాన్ని ఎస్ఫాన్‌లో ప్రారంభించింది. దీని వలన యురేనియం మార్పిడి ప్రారంభించినట్లే. కాని, వాస్తవానికి అన్ని సౌకర్యాలున్న నతాంజ్‌లోనే యురేనియం శుద్ధి చేసే పని జరుగుతుంది. ప్రత్యేక రక్షణతోనే ఎస్ఫాన్ అణు సౌకర్యాన్ని పునరుద్ధరించారు. ఐ.ఎ.ఇ.ఎ పర్యవేక్షణలో కెమెరాల నిశిత పరిశీలనలోనే ఈ పని ప్రారంభమైంది. ఇక ఇరాన్‌లో జరిగే ఎటువంటి అణు కార్యక్రమాన్ని కూడా అమెరికా వ్యతిరేకిస్తూ, ఇరాన్ అణు శుద్ధి కార్యక్రమాన్ని పూర్తిగా ఆపలేక సైనిక చర్య తప్పదని బరితెగించి మాట్లాడుతున్నది.

ఇరాన్ ఎస్ఫాన్‌లో అణుశుద్ధి కార్యక్రమాన్ని వెంటనే ఆపాలనే తీర్మానాన్ని 35 సభ్యులతో కూడిన ఐ.ఎ.ఇ.ఎ బోర్డు సెప్టెంబర్‌లో ఆమోదించింది. *"ఇరాన్ అణు కార్యక్రమానికి సంబంధించిన సమస్యలు ఇంకా పరిష్కరించాల్సే వున్నాయి. అందుకు ఇరాన్‌లో అణు సంబంధ కార్యక్రమాలు, కార్యకలాపాలు గాని లేవనే విషయాన్ని ఐ.ఎ.ఇ.ఎ నిర్ధారించే స్థితిలో ఇప్పటికీ లేదు''.* అని ఆ తీర్మానం చెప్పింది. ఈ తీర్మానం

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి టెహరాన్‌పై ఆంక్షలు పెట్టడాన్ని ఆపింది. ఎన్.పి.టి అనుమతించిన ప్రకారం తన అణు కార్యక్రమం ఉంటుందని ఇరాన్ కొత్త ప్రభుత్వం అమెరికా-ఇ.యు దేశాల బెదిరింపులకు సమాధానమిచ్చింది. వాస్తవానికి, చివరి దశలోని అణుశుద్ధి కార్యక్రమాన్ని రష్యా భూభాగానికి తరలించుకోవడానికి 2005 నవంబర్‌లో రష్యా ఇవ్వజూపిన సహాయాన్ని కూడా ఇరాన్ బహిరంగంగానే నిరాకరించింది. భద్రతా మండలికి టెహరాన్ కేసును కనుక ఫిర్యాదు చేస్తే యురేనియం శుద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించడానికి, ఐక్యరాజ్య సమితి ఆకస్మిక తనిఖీలను ఆపివేయాలని ఇరాన్ పార్లమెంట్ తన ఆమోదాన్ని తెలిపింది. ఇతర దేశాల ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తామని, కాని చర్చలకు ఎప్పుడూ సిద్ధమేనని ఇరాన్ కొత్త అధ్యక్షుడు తన ప్రారంభోపన్యాసంలో చెప్పాడు.

## ఇరాన్ వ్యూహాత్మక ప్రాముఖ్యత

ఇరాక్-ఇరాన్ యుద్ధకాలం నుంచి ఇరాక్‌లోని షియా ప్రజలపై ఇరాన్ చాలా ప్రభావాన్ని వేయగలిగింది. అమెరికా తనపై తిరుగుబాటు చేస్తున్న ఇరాక్‌లోని సున్నీ ప్రజలపై ఎదురుదాడికి ఈ షియాల పైననే ఆధార పడుతున్నది. అయతొల్లా ఖొమైనీ పర్యవేక్షణలో ఇరాక్‌లో సుప్రీం కౌన్సిల్ ఆఫ్ ఇస్లామిక్ రివల్యూషన్ ఇన్ ఇరాక్ (ఎస్.సి.ఐ.ఆర్.ఐ- ఇరాక్‌లో ఇస్లామిక్ విప్లవోన్నత సంస్థ) అనే ఏకీకృత సంస్థ నిర్మాణం జరిగింది. ఇక ఇరాన్ రివల్యూషనరీ గార్డులు(ఇరాన్ విప్లవ సైనికులు) ఎస్.సి.ఐ.ఆర్.ఐకి చెందిన సైనిక విభాగం బదర్ బ్రిగేడ్‌ను ఏర్పాటు చేసి, దానికి సైనిక శిక్షణ, ఆయుధాలు సమకూర్చటం చేశారు. 1991లో అమెరికా ఇరాక్ పైన యుద్ధం ప్రారంభించగానే, ఎస్.సి.ఐ.ఆర్.ఐని ఇంకా ఇతర సంస్థలను అమెరికాతో చేతులు కలపమని ఇరాన్ ఆదేశించింది. ఉత్తర ప్రాంతంలో ఇరాన్ పాలనకు జలాల్ తలాబానీతో గొడవ వుంది. జలాల్ తలాబానీ సద్దాం అండదండలున్న ఇరాక్‌లోని అతి పెద్ద కుర్దిష్ పార్టీ నాయకుడు. ఇరాన్‌కు ఇతడ్ని ఓడించడం, అలాగే పొరుగునున్న ఇరాక్‌లోని ఇరాన్ కుర్దుల సహకారం సంపాదించి, ఇరాక్‌లోని కుర్దు ప్రాంతాలపై సద్దాం పట్టును కూలదోయాలనేది లక్ష్యం. ఈ లక్ష్యం నెరవేరే వరకు ఇరాన్ అమెరికా పక్షమే వహించింది.

కాని ఈ సారి ఇరాక్ మీద దాడికి గత దశాబ్దం పాటు తనతో చేతులు కలిపిన ఎస్.సి.ఐ.ఆర్.ఐ మద్దతును అమెరికా ఆశించింది. కాని మద్దతు లభించలేదు. అయితే యుద్ధం ప్రారంభం అయినప్పటి నుంచి ఇరాక్ తిరుగుబాటులో ఎస్.సి.ఐ.ఆర్.ఐ తన అనుచరులను చేరనీయకుండ అమెరికాకు గట్టి సేవనే చేసింది. ఆక్రమణదరులపై పోరాడాలనే గట్టి పట్టుదల గల ఏకైన షియా నాయకుడు మొక్తాదా అల్ సదర్‌ను కూడా తటస్థంగా మార్చింది(మొక్తాదా తండ్రి ఎస్.సి.ఐ.ఆర్.ఐ స్థాపకుల్లో ఒకడు).

ఇక అమెరికా బాగ్దాద్‌ను ఆక్రమించగానే ఎస్.సి.ఐ.ఆర్.ఐ నాయకులు కూడా అక్కడికి చేరుకున్నారు. ప్రభుత్వ యంత్రాంగలోని కీలక స్థానాలను తనకు ఆనుకూలురైన బదర్ బ్రిగేడ్ ముఖ్యలతో ఆక్రమించడంపైన ఇరాన్ కేంద్రీకరించింది. ఆ విధంగా ఇరాక్‌లో అధికారాన్ని చేజిక్కించుకోవటంలో అమెరికా, ఇరాన్‌లు తమ వైరుధ్యాలను పక్కనబెట్టి కలిసి పని చేశాయి. ఇరాన్‌కు చెందిన అమెరికా పక్షం వహించే స్వతంత్ర వ్యక్తులు సున్నీల తిరుగుబాటు పెరిగేకొద్దీ మత˘నాయకులపై ఎక్కువగా ఆధారపడక తప్పని పరిస్థితిలో వున్నారు. అమెరికా ఎంతో ఆశపెట్టుకుని ఆకాశాకెత్తిన అహ్మద్ చలాబీ కూడ తేలిగ్గా ఇరాన్ వైపు ఫిరాయించి, కొత్త పాలనలో తానొక ముఖ్యుడుగా ముందుకొచ్చాడు. ఆ విధంగా ఇరాక్‌లో అమెరికా పాలన కొనసాగించటానికి తనదే అయిన సెక్షన్ లేక షియా ప్రజలతో పాలన ప్రారంభించటానికి ఇరాన్ మీద ఆధారపడక తప్పని స్థితిలో పడింది. తనకు వ్యతిరేకంగా దూకుడు వైఖరినవలంభిస్తున్న బుష్ పాలనతో బేరసారాలాడటానికి ఈ పరిస్థితి ఇరాన్‌కు బాగా ఉపయోగపడింది.

అమెరికా యొక్క ఈ నిస్సహాయ స్థితిని ఇరాక్ ఆర్థిక వ్యవస్థ, ప్రభుత్వాల లోలోపలికి చొచ్చుకు పోవడానికి ఇరాన్ బాగా ఉపయోగించుకుంది. ఇరాక్‌లో చమురును శుద్ధి చేసి ప్రపంచ మార్కెట్‌కు తరలించడానికి, అనేక చమురు శుద్ధి కర్మాగారాలను నిర్మించడానికి పెట్టుబడులు పెడతానని ఇరాన్ కోరింది. ప్రస్తుతం ఇరాక్‌కు పెద్ద నౌకాశ్రయ సౌకర్యం లేదు. ఇరాన్ నౌకాశ్రయాలను సరుకుల బట్వాడాకు ఉపయోగిస్తున్నారు. ఆ విధంగా సిరియా, జోర్డాన్‌ల గుండా వెళ్ళే సరుకులు రవాణాను ఇరాన్ చేపట్టింది. అంతేగాక, దక్షిణ ఇరాక్‌లో హోటళ్ళు, రోడ్లు, విమానాశ్రయాలు, విద్యుదుత్పత్తి మొదలైన మౌలిక రంగాల నిర్మాణానికి పూర్తి స్థాయిలో పెట్టుబడి మదుపు, ఆర్థిక సహాయానికి ఇరాన్ సిద్ధమైంది. పోలీసు, సైనిక న్యాయ విభాగాలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఇరాకీలకు శిక్షణ ఇవ్వటం, ప్రైవేటు రంగంలో సాంకేతిక నిపుణులకు శిక్షణ ఇవ్వటం లాంటివి ఇరాన్ చేసింది. అతి తక్కువ కాలంలో అమెరికా కార్పోరేట్ సంస్థలు ఆశ పెట్టుకున్న అనేక స్థానాలను ఇరాన్ వేగంగా ఆక్రమించింది. ఇరాక్‌లో ఇరాన్

*(తరువాయి 26వ పేజీలో.....)*


# పోరులో ఒరిగిన వీరు

## అమరవీరుల సంస్మరణ వారోత్స

నేడు భారత దోపిడీ పాలకవర్గాలు తమ ఏకైక ప్రత్యర్థిగా భావిస్తోన్న శక్తి భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు). భారత దోపిడీ పాలకర్గాలు, వాటి యజయానులైన సామ్రాజ్యవాదుల సహాయంతో తమ సర్వాంగాలనూ వినియోగించి పన్నుతున్న ఏకైక పథకం - సి.పి.ఐ(మావోయిస్టు)ను ఎలా ఓడించడం అన్నదే. ఇంతగా మారిన వైనం హఠాత్తుగా పరిణమించింది కాదు. దానికొక చారిత్రక క్రమం వుంది. భారత ప్రజల పోరాటశక్తి బ్రిటీష్ వ్యతిరేక పోరుగా ఎగిసింది తెలంగాణా, తెభాగ, వర్లీ వంటి భూస్వామ్య వ్యతిరేక పోరాటాలుగా ఎగిసింది. కానీ ఆ పోరాటాలు రివిజనిస్టుల విద్రోహానికి బలయ్యాయి.

అయితే విద్రోహాలు, వెన్నుపోట్లు చరిత్ర పురోగమనాన్ని ఆపలేవని చాటుతూ భారత ప్రజల పోరాటశక్తి ఈసారి నక్సల్బరీగా ప్రజ్వలించింది. ఆ ప్రజ్వలనం విద్రోహాన్నీ, రివిజనిజాన్నీ తుత్తునియలు చేస్తూ, భారత ప్రజల పోరాటాలకు సరైన దిశా నిర్దేశనం చేస్తూ దేశం నలుమూలలా వ్యాపించింది. నక్సల్భరీ పోరు, ఆ పోరుకు నాయకత్వం వహించిన చారుమజుందార్ మార్గ నిర్దేశకత్వంలో ఒక పాయగా పురోగమిస్తే, ఆ పోరు ఉత్తేజంతో కా॥ కన్హాయ్ చటర్జీ నాయకత్వంలో మరోపాయగా పురోగమించింది. కా॥ చారుమజుందార్ మార్గదర్శకత్వానికి సి.పి.ఐ(ఎం.ఎల్)(పీపుల్స్‌వార్) ప్రాతినిధ్యం వహిస్తే, కా॥ కన్హాయ్ చటర్జీ మార్గదర్శకత్వానికి యం.సి.సి.ఐ ప్రాతినిధ్యం వహించింది. ఈ రెండు పార్టీలూ కల్సి 2004 సెప్టెంబర్ 21న సి.పి.ఐ(మావోయిస్టు) ఆవిర్భవించింది.

సి.పి.ఐ(మావోయిస్టు) ఆవిర్భావానికి ఇది చారిత్రక నేపథ్యం అయితే, దీన్నొక మహోన్నత శక్తిగా నిలబెట్టిందీ, భారత ప్రజల ఆశాదీపికగా వెలిగిస్తోంది మాత్రం దానికున్న త్యాగభరిత నేపథ్యం. పార్టీని ప్రజల్లో పాదుగొల్పడానికి, ఆ పాదుల్లో రక్తాన్ని ధారపోసిన వీరయోధులు ఎందరెందరో. నక్సల్బరీ పోరాటం బీజప్రాయం నుండే పాలకవర్గాల క్రూర నిర్బంధాన్ని ఎదుర్కుంటూ ముందుకు సాగుతోంది. నక్సల్బరీ జ్వాలను ఆర్పేయాలని 1967, మే 25 తేదీన ప్రభుత్వం ప్రశాత్‌జోతే గ్రామం వద్ద కాల్పులు జరిపి తొమ్మిది మంది మహిళలూ, పిల్లలను పొట్టన పెట్టుకుంది. అయితే ఆ తొమ్మిది మంది చిందించిన నెత్తురు నక్సల్బరీ జ్వాలకు ఇంధనంగా మారింది. ఆ జ్వాలను మహోజ్వలంగా వెలిగించింది. ఆ వెలుగు శ్రీకాకుళం, గోపీ వల్లభ్‌పూర్, ముషాహరి, లఖింపూర్-ఖేరి లను ఆకర్షించింది. నక్సల్బరీ జ్వాలలో వాటినీ భాగం చేసింది. ఆ తర్వాత ఆ జ్వాల ఉత్తర తెలంగాణా, దండకారణ్యం, బీహార్, జార్ఖండ్‌ల మీదుగా దేశమంతా అడుగడుగునా రక్త తర్పణంతోనే ముందుకు సాగింది. ఉద్యమాన్ని అణచివేయడంలో భాగంగా ఉద్యమ సారధ్యాన్నే లేకుండా చేయడం కోసం 1972 జూలై 16వ తేదీన పోలీసులు కా॥ చారుమజుందార్‌ను అరెస్టు చేశారు. పోలీసులు పెట్టిన చిత్రహింసల వల్ల జూలై 28న




కా॥ వంగర రాంబాబు(జగదీష్)



కా॥ ప్రవీణ్

ఆయన అమరుడయ్యాడు. 1982లో అవిశ్రాంత కృషిలో అనారోగ్యంతో కా॥ కన్హాయ్ చటర్జీ అమరుడయ్యాడు. వారు భౌతికంగా లేనప్పటికీ వారు సైద్ధాంతికంగా, రాజకీయంగా అందించిన మార్గదర్శకత్వ స్ఫూర్తితో రెండు పార్టీలూ ముందుకు పురోగమించి వారి ఆశయసాధనలో భాగంగా ఐక్యపార్టీగా ఆవిర్భవించాయి.ఇలా ముందుకు సాగుతున్న ఉద్యమాన్ని ఆణచడం కోసం పాలకవర్గాలు ఎన్నో క్రూర చర్యలకు పాల్పడుతున్నాయి. అరెస్టులు,చిత్రహింసలు, జైలు శిక్షలు, బూటకపు ఎన్‌కౌంటర్లు, ఏకపక్ష కాల్పులు, మూకుమ్మడి దాడులు వంటి ఎన్నో రకాల అణచివేత చర్యలకు పాల్పడుతున్నాయి.వీటికి తోడు




కా॥ షేక్ బీరాబి(ఉమ)

కోవర్టులను తయారు చేసి ముఖ్యమైన నాయకత్వాన్నీ, పెద్ద ఎత్తున దళాలనూ హత్య చేయడం వంటి నీచమైన చర్యలకు పాల్పడుతున్నాయి. పెద్ద ఎత్తున పోలీసులను, అర్థసైనిక బలగాలనూ దింపి గ్రామాలనూ, అడవులను జల్లెడ పట్టిస్తోన్నాయి.

# లకు ఎర్రెర్ర దండాలు!

## వాన్ని విజయవంతం చేయండి!



కా॥ సురేష్

నూతన పార్టీ ఏర్పడిన తర్వాత శత్రు అణచివేత చర్యలు మరింతగా పెరిగాయి. తమ బలగాలను మరింతగా పెంచుకుంటున్నాయి, అత్యాధునిక ఆయుధ సంపత్తినీ సమకూర్చుకుంటున్నాయి. అయినప్పటికీ ఉద్యమాన్ని అణచివేయలేక రకరకాల పేర్లతో హంతక నల్లదండు ముఠాలను సృష్టిస్తున్నాయి. అంతేకాదు ప్రజల తిరుగుబాటు పేరుతో సల్వాజుడూం, సేంద్ర, శాంతిసేన వంటి రాజ్య సాయుధ టెర్రరిస్టు ముఠాలను తయారుచేసి విప్లవోద్యమం పైకి ప్రయోగిస్తున్నాయి. విప్లవోద్యమానికి ప్రజలను తయారుచేసే కుట్రతో ఉద్యమ ప్రాంతాల్లో బీభత్స, భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. అయితే విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం, కార్మిక వర్గ రాజ్యస్థాపన కోసం ఎందరో విప్లవకారులు పాలకవర్గాలు ప్రయోగిస్తోన్న ఈ హింసనూ, క్రూరత్వాన్నీ తమ త్యాగపూరిత సాహసంతో ఎదుర్కొంటున్నారు. ఈ అణచివేతను ఎదుర్కోవడంలో భాగంగా పారామిలటరీ బలగాలతో తలపడ్డం అనేది నేడు దేశవ్యాప్తంగా సాధారణ అంశమైంది. అలా తలపడ్డంలో భాగంగా అవసరమైతే తమ ప్రాణాల్ని తృణప్రాయంగా అర్పిస్తున్నారు. ఇలా ప్రాణత్యాగం చేస్తూ ఉద్యమానికి ఊపిరిలిస్తున్న వారిలో స్త్రీలూ, పురుషులూ, వృద్ధులూ, బాలలూ ఉన్నారు. నక్సల్బరీ పోరుకు మొదట నెత్తురు ధారపోసిన వారు స్త్రీలూ పిల్లలే. ఆ త్యాగ సాంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతుంది. ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొంటున్న వాళ్లే కాక ఉద్యమ సానుభూతి పరులైనందుకు కూడ ఎందరో కామ్రేడ్స్ అమరులవుతున్నారు. శత్రువు చేత ప్రత్యక్షంగా హత్యకు గురవుతున్న కామ్రేడ్సే కాక శత్రువు అమలు చేస్తున్న నిర్బంధ పరిస్థితుల మూలంగా అనారోగ్యాలకూ, ప్రకృతి వైపరిత్యాలకూ గురై కొందరు కామ్రేడ్స్ అమరులవుతున్నారు. అంతేకాదు యుద్ధ రంగంలో అత్యంత ప్రమాదకరమైన యుద్ధ సామాగ్రిని ఉపయోగించడం అనివార్యమైనది. వీటిని ఉపయోగించే క్రమంలో జరిగే ప్రమాదాల్లో కొందరు కామ్రేడ్స్ అమరులవుతున్నారు. రోజు రోజుకూ తీవ్రమౌతున్న యుద్ధంలో ఇటువంటి అమరత్వాలు కూడా అనివార్యమే అవుతాయి.



కా॥ బోడ సాయిలు(కుర్మన్న)



కా॥ కాళ్ల అయిలమ్మ(స్వరూప)

ఈ సంవత్సరం ఎందరో విలువైన కామ్రేడ్స్ అమరులయ్యారు. కేంద్రకమిటీ పొలిట్ బ్యూరో సభ్యుడు కా॥ కరంసింగ్ సెరిబ్రల్ మలేరియా సోకి నిర్బంధ పరిస్థితిలో వైద్యం అందక అమరుడయ్యాడు. శత్రు దాడిలో 3యు కార్యదర్శి కా॥ మహిముద్దీన్(రవి) అమరుడయ్యాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి కామ్రేడ్ మాధవ్ (బుర్రా చిన్నయ్య గౌడ్) అమరుడైనాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీకి చెందిన సెక్రటేరియట్ సభ్యుడు కా॥ రవికుమార్(శ్రీధర్, మంజీరా).

ఎపి, ఎన్‌టి, ఏఓబిలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తోన్న అణచివేత పరమ క్రూరంగా ఉంటోంది. ఆ క్రూర అణచివేత నుండి ఉద్యమాన్ని రక్షించడానికి రక్త తర్పణం చేస్తోన్న కామ్రేడ్స్ ఎందరో. వారిలో, నల్లగొండ జిల్లా కార్యదర్శి కా॥ జంగయ్య(రవి), ఖమ్మం జిల్లా కార్యదర్శి కా॥ జగదీష్, నల్లమల డివిజన్ కమిటీ సభ్యుడు కా॥ విజయ్, ఎన్‌టి ఎస్‌జడ్‌సి ట్రాన్స్‌పోర్టు దళ కమాండర్ జిల్లా కమిటీ సభ్యుడు కా॥ మల్లేష్, ఆదిలాబాద్ జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్స్ సలీం, జనార్ధన్, అనంతపురం జిల్లా కమిటీ సభ్యుడు కా॥ రామ్మోహన్, శ్రీకాకుళం డివిజన్ కమిటీ సభ్యుడు కా॥ చందు, గుంటూరు జిల్లా ప్లటూన్ కమాండర్ కా॥ సురేష్ వంటి ముఖ్యమైన కామ్రేడ్స్ వున్నారు.

మొత్తంగా ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా దాదాపు 300 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. వీరిలోని దాదాపు 100 మంది కామ్రేడ్స్ ఆంధ్రప్రదేశ్‌లోని మూడు జోన్లకు చెందిన వారే. అంటే ఇక్కడ శత్రు నిర్బంధ తీవ్రత ఎంతగా ఉందో అర్థం చేస్కోవచ్చు. ఈ వందమంది అమరుల్లో దాదాపు 30 మంది మహిళా కామ్రేడ్స్ వున్నారు. సామాజిక మార్పులో తమ వంతు కర్తవ్యాన్ని గుర్తించి

పోరాటంలో సగభాగాన్ని పురుషులతో సమానంగా పంచుకుంటున్న మహిళలను రాజ్యం ఎంతమాత్రమూ ఉపేక్షించడం లేదు. అందుకే తమపై జరిగిన దాడిని వీరోచితంగా ప్రతిఘటించిన గుంటూరు జిల్లాకు చెందిన కమాండర్ కా॥ విజయనూ, మల్కన్‌గిరికి చెందిన ఎసి సభ్యురాలు కా॥ కుమారినీ, తన సహచరుడు కా॥ జగదీష్‌తో పాటు నిరాయుధంగా దొరికిన ఖమ్మం జిల్లాకు చెందిన కమాండర్ కా॥ స్వరూపనూ పోలీసులు క్రూరంగ హత్య చేశారు. అంతేకాదు తన బిడ్డలు ఉద్యమంలో పని చేస్తున్నందువల్లా అలా పనిచేస్తున్న వారిని లొంగిపొమ్మని ప్రకటించడానికి నిరాకరించినందు వల్లా, తన బిడ్డలు నడుస్తున్న దారిని ప్రేమించినందువల్లా ప్రకాశం జిల్లాకు చెందిన కా॥ ఈశ్వరమ్మను క్రూరంగా చంపి ఎన్‌కౌంటర్ కట్టుకథ అల్లారు పోలీసులు. కడప, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఒకేసారి ఆరుగురేసి మహిళా కామ్రేడ్స్‌ను పొట్టన పెట్టుకున్నాయి ఈ నరహంతక పోలీసు బలగాలు.

అయితే శత్రువు ఇంత పాశవిక హత్యాకాండకు పాల్పడుతున్నప్పటికీ ఉద్యమాన్ని బలహీనపర్చలేక పోతున్నాడు. ఈ అమరత్వాల స్ఫూర్తితో ఉద్యమం రోజు రోజుకూ పురోగమిస్తోంది. అమరుల ఆశయ సాధనయే ఏకైక కర్తవ్యంగా పి.ఎల్.జి.ఎ ఈ నడుమన ఎన్నో వీరోచిత దాడులను విజయవంతం చేసింది. జహనాబాద్, గిరిడీ, ఆర్. ఉదయగిరి వంటి దాడులు ఇందులో ముఖ్యమైనవి. అంతేకాదు ఫాసిస్టు సల్వాజుడూంను తిప్పికొట్టడంలో భాగంగా దండకారణ్యంలో ఎన్ఎండిసి, మురికినార్ వంటి ఎన్నో దాడులను విజయవంతం చేస్తూ శత్రువును బెంబేలెత్తిస్తోంది. ఈ దాడులను విజయవంతం చేయడంలో భాగంగా అత్యంత సాహసోపేతంగా కొందరు కామ్రేడ్స్ ప్రాణత్యాగం చేశారు. జహనాబాద్ దాడిని విజయవంతం చేయడానికి ఇద్దరు కామ్రేడ్స్ ప్రాణాలర్పిస్తే, ఆర్.ఉదయగిరి దాడిని విజయవంతం చేయడానికి కామ్రేడ్స్ సతీష్, కిరణ్ ప్రాణాలర్పించారు.

ఈ అమరత్వాలన్నీ ఉద్యమానికి ఎంతో నష్టాన్ని కలిగించేవే. అయినప్పటికీ చరిత్ర పురోగమనంలో ఇవన్నీ అనివార్యమైన అమరత్వాలే. అలా చరిత్ర విసిరిన సవాల్‌ను ఏమాత్రం జంకూ గొంకూ లేకుండా స్వీకరించి తమ అమరత్వంతో భారత గడ్డను త్యాగభరితం చేశారు ఈ అమరులు. వీరందరి మరణాలు మనకెంత దు:ఖాన్ని కల్గిస్తాయో అంతకు రెట్టింపు గర్వాన్నీ కల్గిస్తాయి. శత్రువు పట్ల కసినీ రగిలిస్తాయి.

మన ప్రియతమ అమరులు ఏ లక్ష్యసాధన కోసం ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించారో, ఆ లక్ష్య సాధనకు మరింత దృఢంగా నడుద్దామనీ, వారు కన్న కలలను నిజం చేద్దామనీ జూలై 28, అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా మరోసారి ప్రతిజ్ఞ చేద్దాం.

జూలై 28 నుండి ఆగస్టు 3 వరకూ అమరవీరుల సంస్మరణ వారాన్ని పాటిద్దాం. వారి త్యాగాలను స్మరించుకోవడానికి, వారి జ్ఞాపకాలను పంచుకోవడానికి దేశవ్యాప్తంగా పల్లెలనూ, పట్టణాలనూ, అడవులనూ, మైదానాలనూ, ఇండ్లనూ, వాడలను వేదికలను చేద్దాం. వారు అందించిన స్ఫూర్తిని దేశం నలుమూలలా వెదజల్లుదాం.

ప్రజలారా రండి! ఈ అమరుల త్యాగాలను స్మరించుకోండి. వారి నెత్తుటితో ఎరుపెక్కిన జెండాను అందుకోండి. వారి నెత్తుటి బొట్ల నుంచి ఉద్భవించిన పి.ఎల్.జి.ఎలో కలవండి. వారి ఆశయ సాధనలో కార్మిక, కర్షక రాజ్యస్థాపన కోసం కదం తొక్కండి. భూస్వాములూ, పెట్టుబడిదారులూ, సామ్రాజ్యవాదులూ కాగితం పులులు మాత్రమే. పి.ఎల్.జి.ఎ పద ఘట్టనలో తుక్కు కాగితాల్లా నలిగిపోవాల్సిన వాళ్లే. అంతిమ విజయం మనదే!

**జోహార్ అమరవీరులకు!**

**అమరవీరుల ఆశయాల్ని కొనసాగిద్దాం!!**

## ముకునూరు అమరులకు జోహార్లు

**కా॥ శ్యాం**

స్వగ్రామం వరంగల్ జిల్లా, చిట్యాల మండలం రామకృష్టాపురం. నిరుపేద కుటుంబంలో పుట్టి, కటిక దారిద్ర్యాన్ని అనుభవిస్తూ కూడా పదవతరగతి వరకు చదువుకున్నాడు. ఈ గ్రామం నుండి అనేక మంది రిక్రూట్ అయి ఉద్యమం నుండి వెనుదిరిగి పోగా, కా॥ శ్యాం దిగజారిన వాళ్ళను అసహ్యించుకుంటూ తీవ్ర నిర్బంధం మధ్య 1997 నుండి సంఘంలో చేరి చురుకుగా పని చేశాడు. 1999 చివరలో చిట్యాల దళంలో పూర్తి కాలం కార్యకర్తగా చేరాడు. 2001లో ఏర్పాటు చేసిన జిల్లా జె.ఎస్.ఎంలో కా॥ శ్యాం సభ్యుడిగా చేరాడు. కా॥ శ్యాం మంచి సాంస్కృతిక కళాకారుడు. పాటలు పాడటం, కవితలల్లడంలో ఆసక్తి చూపేవాడు. సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రజల్ని స్పందింపజేయటంలో మంచి నేర్పరి. అలాగే బ్యానర్లు, పోస్టర్లు రాయటం, బొమ్మలు వేయటంలో నైపుణ్యం గల చిత్రకారుడు కూడా. తన

ఉపన్యాసాలతో ప్రజల్ని ఆకట్టుకోగల మంచి వక్త. రాజకీయ పరిజ్ఞానాన్ని పెంచుకోవటం, అధ్యయనంలో ఆసక్తి చూపేవాడు.

అవసరాల రీత్యా అనేకసార్లు జె.ఎన్.ఎం, ఆర్గనైజేషన్ పనులలోకి మార్చినా, పార్టీ ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాడు. 2005 జూన్ నుండి అమరుడయ్యే నాటికి జె.ఎన్.ఎం బాధ్యునిగా కొనసాగాడు. కా॥ శ్యాం కవిగా నిర్బంధం, రైతుల సమస్యలు, అమరవీరులపైన అనేక పాటలల్లాడు. సాంస్కృతిక కళాకారుడిగా ప్రజల నుండి నేర్చుకుంటూ తన కళానైపుణ్యంతో ప్రజలకు రాజకీయాలు అందించాడు. అలసిన గెరిల్లాలకు తన పాటతో సేదతీర్చేవాడు. నిరంతరం ఉత్సాహంగా ప్రజలతో, క్యాడర్లతో మమేకమయ్యేవాడు. ఉద్యమ పరిస్థితిని, మారుతున్న రాజకీయ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తన పాటకు, కవితకు పదును పెట్టేవాడు. కా॥ శ్యాం మంచి కళాకారుడిగా ఎదుగుతున్న క్రమంలో కోల్పోవడం ఉత్తర తెలంగాణా సాంస్కృతికోద్యమానికి తీరని నష్టం. ఆ కామ్రేడ్ లేనిలోటును పూడ్చడానికి మునుముందుకు సాగుదాం.

### కా॥ రాధ

స్వగ్రామం వరంగల్ జిల్లా, చిట్యాల మండలం పెద్దపల్లి. నిరుపేద కుటుంబంలో పుట్టిన కా॥ రాధ చిన్ననాటి నుండి విప్లవ రాజకీయాల మధ్య పెరిగింది. తన అక్క రాధ 1998లో వరంగల్ జిల్లా ములుగు మండలం కొత్తూరు వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరురాలైనప్పటి నుండి మరింత పట్టుదల పెంచుకుని దళాన్ని కలుస్తూ రహస్యంగా గ్రామంలో పని చేసింది. గ్రామంలో మాజీలు పార్టీ పేరుతో చేస్తున్న అరాచకాలను అసహ్యించుకుని, వ్యతిరేకించింది.

కా॥ రాధ 2002 మేలో పూర్తికాలం కార్యకర్తగా దళంలో చేరి నర్సంపేట, చిట్యాల దళాల్లో, ఎస్.జిఎస్‌లో పని చేసింది. చిట్యాల దళంలో ఎల్.ఓ.ఎస్ కమిటి సభ్యురాలిగా పని చేసింది. 2004లో కా॥ శ్యాంతో జీవితాన్ని పంచుకుంది. 2005లో కా॥ శ్యాంతోపాటు జిల్లా జె.ఎన్.ఎంకు మారి అమరుడయ్యే వరకు అందులో పని చేసింది.

దళంలో పితృస్వామ్యానికి వ్యతిరేకంగా కా॥ రాధ నిరంతరం పోరాడేది. మహిళా సమస్యలు, పితృస్వామ్యాలపై మహిళలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని దృఢంగా అభిప్రాయపడేది. 2005లో జరిగిన ప్రత్యేక సమావేశంలో మహిళల పట్ల పురుషుల వైఖరి గురించి తన అభిప్రాయాలను సూటిగా పార్టీ ముందు పెట్టింది.

అనారోగ్య సమస్యతో బాధపడుతున్నా ఎప్పుడూ చురుకుగా వుండేది. కళాకారిణిగా తోటి సభ్యులను ఉత్సాహపరిచేది. వైద్యం కోసం వెళ్ళి వచ్చి విశ్రాంతి తీసుకుంటున్న క్రమంలోనే ముకునూరు వద్ద దళంపై జరిగిన శత్రు దాడిలో కా॥ రాధ అమరురాలైంది. తక్కువ కాలంలోనే ఎదిగివచ్చి, పితృస్వామ్యంపై గట్టిగా పోరాడుతూ, కళాకారిణిగా నైపుణ్యం సంపాదిస్తున్న క్రమంలోనే కా॥ రాధను కోల్పోవడం జిల్లా సాంస్కృతికోద్యమానికి తీరని లోటు. ఆ లోటును పూరించడానికి కా॥ రాధ ఆదర్శాలను పుణికిపుచ్చుకుని, ఆమె ఆశయ సాధనలో దృఢంగా ముందుకు నడుద్దాం.

### కా॥ భీమ

కా॥ భీమ ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో దంతెవాడ జిల్లా పామేడ్ రేంజ్, పువ్వాడ గ్రామానికి చెందినవాడు. డి.ఎ.కె.ఎం.కె రేంజ్ కమిటీ సభ్యునిగా, తర్వాత మిలీషియా కమాండర్‌గా పని చేస్తూ, 2003లో పూర్తికాలం కార్యకర్తగా దక్షిణ బస్తర్‌లోని పామేడ్ దళంలో చేరాడు. పార్టీ అవసరాల రీత్యా ఉత్తర తెలంగాణకు వెళ్ళి వెంకటాపూర్ ఎ.సి పరిధిలో వాజేడు, చర్ల ఎల్.ఓ.ఎస్‌లలో కూడా పని చేశాడు. తక్కువ కాలంలోనే ఏరియాలోని అడవి మీద, ప్రజలలో పట్టు సంపాదించాడు. ప్రజలతో విస్తృతమైన పరిచయాలు పెంచుకున్నాడు. ఏరియాలో మిలిషియాకు ట్రైనింగ్ క్యాంపులు నిర్వహించటంలో కా॥ భీమ ముఖ్యపాత్ర వహించాడు.

మిలీషియాను కదిలించి అనేక ప్రతిఘటన చర్యలు నిర్వహించాడు. కుర్నపల్లి సర్పంచ్, సిపిఎం నాయకుడు ఇర్ప వీరయ్య, రమణక్కపేట ఇన్‌ఫార్మర్ బట్టుప్రసాద్ లాంటి విప్లవద్రోహులను శిక్షించాడు. చాలా తక్కువ కాలంలోనే పార్టీలో చదువు నేర్చుకుని, పార్టీ సాహిత్యం చదువుతూ రాజకీయ పరిజ్ఞానాన్ని పెంచుకున్నాడు. ప్రజల్ని కదిలించే చొరవ, క్రమశిక్షణ, పట్టుదల, అందరిలో కలిసిపోయే తత్వంతో త్వరలోనే ఎల్.ఓ.ఎస్ డిప్యూటీగా ఎదిగాడు.

ప్రతిఘటనా కార్యక్రమంలో భాగంగా వెళ్ళిన క్రమంలో శత్రుదాడికి గురై కా॥ భీమ ముకునూర్ ఎన్‌కౌంటర్లో అమరుడయ్యాడు.

### కా॥ సోమిడి (పార్వతి)

ఖమ్మం జిల్లా, చర్ల మండలం, చెన్నాపూర్ స్వగ్రామం. ఆదివాసీ కుటుంబంలో పుట్టి, కడుపేదరికంలో చిన్నతనం నుండే కష్టపడి పనిచేసి కుటుంబానికి ఆసరాగా వుండేది. మన పార్టీ రాజకీయాలతో ప్రభావితమై సంఘంలో చేరింది. గ్రామంలో మహిళలపై జరిగే పితృస్వామ్య అణచివేతకు, ఆదివాసీ రీతి రివాజులకు వ్యతిరేకంగా మహిళలను కూడగడుతూ

సంఘంలో ఉత్సాహంగా పని చేసేది. పార్టీ ఏర్పాటు చేసే రాజకీయ తరగతులు, మీటింగులు ఎక్కడ జరిగినా హాజరయ్యేది. ఈ క్రమంలో పెరిగిన శత్రు నిర్బంధం వల్ల దళంలో చేరింది. తనకు అప్పగించిన పనులను పట్టుదలతో పూర్తి చేసేది. దళంలో చేరిన కొద్ది రోజుల్లోనే చదువు నేర్చుకుంది.

రెండు రాష్ట్రాల సమన్వయంతో ఛత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల పై కేంద్రీకరించి ఉద్యమాన్ని దెబ్బతీసే లక్ష్యంతో శత్రువు చేపట్టిన దాడిలో భాగంగా ఏప్రిల్ 2న దళంపై జరిగిన ఎన్‌కౌంటర్‌లో కా॥ సోమిడి అమరురాలైంది. దళంలో కొత్తయినా శత్రు దాడిని ధైర్యంగా ఎదుర్కొని సాహసంగా పోరాడుతూ నేలకొరిగింది.

### కా॥ విజయ

ఖమ్మం జిల్లా ఊసూర్ మండలం, రాంపూర్ స్వగ్రామం. ఆదివాసీ కుటుంబంలో జన్మించిన విజయ కడుపేదరికాన్ని అనుభవిస్తూ, చిన్నప్పటి నుండి కష్టపడి పని చేసేది. పెద్దలు చేసిన ఇష్టంలేని పెండ్లిని వ్యతిరేకించి 2005లో దళంలో చేరింది. అతి తక్కువ కాలంలోనే దళ జీవితానికి అలవాటుపడి, పట్టుదలతో చదువు నేర్చుకుంది. దళం అప్పగించిన పనులు చేయడంలో ముందుండేది. అందరితో కలివిడిగా వుంటూ, తనకు తెలియని అనేక విషయాలను శ్రద్ధగా తెలుసుకొనేది. శత్రుదాడిని ఎదుర్కొనేందుకు వెళ్తున్న దళం విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో ఏప్రిల్ 2న ముకునూర్ గ్రామం దగ్గర జరిగిన ఎన్‌కౌంటర్లో కా॥ విజయ అమరురాలైంది. తమకంటే అనేకరెట్లు అధిక సంఖ్యలో వచ్చిన శత్రువును ఢీకొని తూటాకు తూటాతోనే సమాధానమిచ్చి ధైర్యంగా పోరాడుతూ నేలకొరిగింది కా॥ విజయ.

### కా॥ సావిత్రి(కుమారి)

స్వగ్రామం ఖమ్మం జిల్లా గుండాల మండలం దామెరతోగు గ్రామం. చిన్నతనం నుండి కా॥ సావిత్రికి పాటలు, నృత్యాల పట్ల వున్న ఆసక్తిని గమనించి జె.ఎన్.ఎంలో తర్ఫీదు పొందమని పార్టీ చెప్పిన నిర్ణయాన్ని చిరునవ్వుతో అంగీకరించింది. హైదరాబాద్‌కు వెళ్ళి జె.ఎన్.ఎంలో తర్ఫీదుపొంది సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, రాష్ట్రమంతా తిరిగి అనేక జె.ఎన్.ఎం ప్రదర్శనల్లో పాల్గొంది. తర్వాత పెరిగిన నిర్బంధ పరిస్థితుల్లో పార్టీ పిలుపుమేరకు రహస్య జీవితాన్ని స్వీకరించి మణుగూరు దళంలో సభ్యురాలైంది. కష్టభరితమైన గెరిల్లా జీవితంలో తను నేర్చుకున్న కళతో తోటి సభ్యులను ఉల్లాసపరిచేది. తక్కువ కాలంలోనే చదువు నేర్చుకుని స్వయంకృషితో అభివృద్ధి చెందింది. ఆదివాసీ మహిళ అయిన కా॥ సావిత్రి, ఆదివాసీ సమాజంలోని సాంప్రదాయ పెళ్ళిళ్ళు, గ్రామాల్లో కుల పెద్దల ఆదిపత్యాన్ని తీవ్రంగా వ్యతిరేకించేది. పురుషులతో సమానత్వం కోసం మహిళలు పోరాడాలనే చైతన్యవంతమైన ఆలోచనలుగలది కా॥ సావిత్రి.

ప్రతిఘటనలో భాగంగా ఏర్పాటు చేసిన ఆంబుష్‌లో ఆకస్మికంగా జరిగిన శత్రుదాడిలో కా॥ సావిత్రి అమరురాలైంది.

## నల్లదండు ముఠాలచే హత్యకు గురైన కామ్రేడ్స్ లింగస్వామి, జాలలింగయ్య, చెన్నయ్యలకు విప్లవ జోహార్లు!

ఆగస్టు 15న మక్తల్ ఎం.ఎల్.ఎ నర్సిరెడ్డి యాక్షన్ జరుగగానే బెంబేలెత్తిన ప్రభుత్వం పిచ్చికుక్కలా వ్యవహరించింది. వెంటనే ప్రతీకార చర్యగా ప్రజా సంఘాల కార్యకర్తలనూ, పార్టీ సానుభూతిపరులనూ చంపదల్చుకుంది. అయితే చట్టబద్ధంగా చంపలేదు కనుక నర్సాకోబ్రాలనూ, నల్లమల త్రాచులనూ సృష్టించింది. వీటి పేరుతో రాష్ట్రంలో బీభత్స హత్యాంకాండకు పాల్పడ్డది. అంతేకాదు మావోయిస్టుల పేరుతోనూ కొందరిని హత్య చేసింది.

ప్రభుత్వం తన పథకంలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా మావోయిస్టు పార్టీ కమిటీ పేరుతో ఒక కరపత్రం తీసింది. అందులో హిట్‌లిస్ట్‌గా కొందరు ఉద్యమ సానుభూతిపరుల పేర్లనూ, కొందరు పోలీస్ ఇన్ఫార్మర్ల పేర్లను చేర్చింది. ఇప్పటికీ ఆ సానుభూతిపరుల్లో నల్గురిని హత్య చేసింది. సంఘటనా స్థలంలో మావోయిస్టులే చంపినట్టు ఉత్తరం రాసి పెట్టింది కూడా.

### కా॥ లింగస్వామి

పోలీసులు కుట్రపూరితంగా హత్య చేసిన వారిలో కా॥ లింగస్వామి(42) ఒకరు. చెంచు తెగకు చెందిన ఇతనిది మహబూబ్‌నగర్ జిల్లాలోని అప్పాయిపల్లి గ్రామం. పిల్లా పాపలను కల్గివున్న ఇతడు నిరంతరం ప్రజల పక్షపాతిగా బతికాడు. 1986లో తన భూమిని గ్రామ పెత్తందార్లు ఆక్రమిస్తే సంఘ నాయకత్వంలో తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. ఆ క్రమంలో సంఘ నాయకుడిగా ఎదిగాడు. ఫారెస్టు భూముల్ని పేద ప్రజలు ఆక్రమించుకున్న పోరాటంలో ప్రజల పక్షాన ముందు వరుసలో నిలిచాడు. సలేశ్వరం లింగమయ్య జాతరపై గ్రామ పెత్తందారుల అధికారాన్ని తొలగించి ఆ జాతరను చెంచుల జాతరగా మార్చడంతో కీలకపాత్ర పోషించాడు. కల్లు, సారా రేట్ల తగ్గింపు పోరాటాలలో ముందు

వుండి నాయకత్వం వహించాడు. అలా నల్లమల అటవీ ప్రాంతంలో నాగరికతకు దూరంగా వున్న చెంచు ప్రజలకు పెద్ద దిక్కుగా నిలిచాడు. ఆ తర్వాత నిర్బంధం తీవ్రం కావడంతో ఇనాక్టివ్ అయ్యాడు. 1988 నుండి కాంగ్రెస్‌లో పనిచేస్తూ గతంలో ఒకసారి సర్పంచ్‌గా కూడా పని చేశాడు. కొంతకాలం చెంచు గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా పని చేశాడు. ప్రస్తుతం ఏ పదవి లేకుండా కాంగ్రెస్ పార్టీలో వుంటున్నాడు. అయినప్పటికీ మావోయిస్టు పార్టీ పట్ల సానుభూతిని కల్గి వుంటున్నందుకు ఇతన్ని 2005 ఆగస్టులో ప్రభుత్వం చంపేసింది. కాంగ్రెస్ కార్యకర్త కనుక మావోయిస్టులు చంపేశారని ప్రజల్ని తేలిగ్గా నమ్మించవచ్చుని కూడా ప్రభుత్వపు కుట్రపూరిత ఆలోచన. తన కుట్రలను నమ్మించడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తన కిందిస్థాయి కార్యకర్తలను కూడా బలిపెట్టడానికి సిద్ధమైతూ దాని ఫాసిస్టు స్వభావాన్ని చాటుకుంటోంది.

### కా॥ జాల లింగయ్య

అమ్రాబాద్ మండలం సర్లపల్లి గ్రామానికి చెందిన జాల లింగయ్య పార్టీ సానుభూతిపరుడు. కొద్దికాలం కింద ఇతనికి పోలీసులు విషం ఇచ్చి దళానికి పెట్టమని చెప్పారు. అయితే ఇతను పోలీసుల ఆజ్ఞలను ధిక్కరించి పార్టీ పట్ల తన అభిమానాన్ని చాటుకున్నాడు. ఆ కక్షతో పోలీసులు ఇతన్ని హత్య చేయడానికి పథకం పన్నారు. పనిమీద అచ్చంపేటకు వెళ్లిన ఇతడిని 2005 ఆగస్టులో మన్ననూర్ వద్ద పట్టుకొని పార్టీ రహస్యాలు చెప్పమని చేతుల నరాలు కోసి చంపి వేశారు. ఇతడిని చంపిన ముఠాలో నల్లదండు శేషయ్య, ముత్యం తదితరులున్నారు. ఆ తర్వాత కార్లో తెచ్చి సర్లపల్లి పక్కన పడేసి పోయారు.

### కా॥ చెన్నయ్య

అమ్రాబాద్ మండలంలోని తుర్కపల్లిలో 2004 ఎన్నికల సందర్భంగా సంఘ నాయకుడు మహేష్‌ను పోలీసులు పట్టుకొని కాల్చి చంపారు. ఇతడిని ఇన్ఫార్మర్లు పట్టించారనే విషయాన్ని తుర్కపెల్లి చెన్నయ్య బయటపెట్టాడు. ఆ కక్షతో పోలీసులూ, నల్లదండు ముఠా కల్సి, దోమలపెంటలో కూలి చేసుకొని బతుకుతున్న ఇతడిని హత్యచేసి మావోయిస్టులు చంపినట్లు దొంగ ప్రకటన ఇచ్చారు.

గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేసి నల్లదండు ముఠాలను అరికట్టడమే ఈ అమరులకు మనమిచ్చే నివాళి. ❍

*(.....38వ పేజీ తరువాయి)*

చివరిగా, ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలందరికీ ప్రసంగించడానికి ఒక రోజంతా కేటాయించటం గమనించాల్సినది. నాల్గవరోజు, ఈ క్రింది నినాదాలు ప్రతిధ్వనించగా పద్ధతి ప్రకారం, పార్టీ కార్యదర్శి మహాసభను ముగించటం జరిగింది.

- కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ భూటాన్(మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు) - వర్థిల్లాలి!

-భూస్వామ్య నిరంకుశ రాజరికాన్ని కూలదోయాలి!

- ప్రపంచ సామ్రాజ్యవాదం నశించాలి!

- భారత విస్తరణవాదం నశించాలి!

- భూటాన్ విప్లవాన్ని నూతన దశకు చేర్చాలి!

- మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వర్థిల్లాలి!

- నూతన ప్రజాస్వామిక విప్లవం వర్థిల్లాలి!

వికల్ప

కార్యదర్శి

కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ భూటాన్(మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు)

కేంద్రకమిటీ

*(.....19వ పేజీ తరువాయి)*

సాధించిన ఈ స్థితికి అమెరికా చాలా అసంతృప్తి చెందింది. కాని ఏమీ చేయలేని పరిస్థితి.

ఆఫ్ఘనిస్తాన్‌తో కూడా ఇరాన్‌కు పొడవైన సరిహద్దు వుంది. ఆఫ్ఘన్ పశ్చిమ ప్రాంతాల్లోని యుద్ధ ప్రభువులకు ఇరాన్‌తో సన్నిహిత సంబంధాలున్నాయి. తాలిబాన్ ప్రభావం పెరుగుతుండటం వల్ల కీలుబొమ్మ కర్జాయ్ ప్రభుత్వం బతికి బట్టకట్టడానికి ఆ యుద్ధ ప్రభువుల మద్దతు కూడా ప్రాముఖ్యత గలదే. పశ్చిమ ఆఫ్ఘనిస్తాన్‌లో ఇటీవల అమెరికా పెద్ద సైనిక స్థావరాన్ని ఏర్పాటు చేసింది. ఇదే ప్రాంతంలో భారత సైన్యం (బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్) కూడా రోడ్డు వేస్తున్నది.

ఇరాన్‌కున్న భౌగోళిక-రాజకీయ ప్రాముఖ్యతకు తోడు తనకున్న అపారమైన చమురు, సహజవాయు సంపదతో ఇతర దేశాలతో (ముఖ్యంగా చైనాతో) గట్టి సంబందాలను ఏర్పరచుకుంటున్నది. ఇప్పటికే చైనాకు సంబంధించిన 14 శాతం విద్యుత్ అవసరాలను తీర్చింది. ఇంకా చైనాతో అనేక ఒప్పందాలపై సంతకాలు చేసింది. ఆ విధంగా భవిష్యత్‌లో ఇరాన్, చైనాకు వ్యూహాత్మక మిత్రుడుగా తయారవుతుంది. ఇది ప్రపంచ రాజకీయాల్లో చైనా ప్రభావాన్ని పెంచుతుంది. పశ్చిమ దేశాల ఆధిపత్యాన్ని తగ్గించటంలో ఇది ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది.

దీనికి తోడు రష్యా సామ్రాజ్యవాదులు పశ్చిమ దేశాలతో రెండు దశాబ్దాలకు పైగా తమకున్న వ్యతిరేకతల నుంచి ఇరాక్‌ను ప్రోత్సహించినట్లే, ఇరాన్‌ను కూడా ప్రోత్సహిస్తున్నారు. ప్రపంచ రాజకీయాల్లో ఇటీవలి కాలంలో రష్యా నూతనంగా సంతరించుకున్న స్థితితో ఇరాన్‌లో అది ప్రముఖ పాత్ర పోషించటం ప్రారంభించింది. 2005 డిసెంబర్‌లో ఒక బిలియన్ డాలర్ల విలువైన అత్యంత ఆధునాతన 30 టి.ఓ.ఆర్-ఎం1 రకపు ఉన్నత వాయుసేన క్షిపణి వ్యవస్థను టెహరాన్‌కు విక్రయించేందుకు అంగీకరించి ఇరాన్‌లో తన ప్రాభవాన్ని పెంచటం మొదలుపెట్టింది. ఇది ఈ మధ్య కాలంలో ఇరాన్ చేసిన పెద్ద రక్షణ లావాదేవీ. అంతేగాక సుదూర లక్ష్యాలను ఛేదించే వాయు రక్షణ వ్యవస్త, టి-90ఎస్ రకం ట్యాంక్‌లను అమ్మటానికి కూడా చర్చలు జరుగుతున్నాయి. ఇరాన్‌లో బుషెర్ నగరంలో రష్యా నిర్మించిన అణు రియాక్టర్ ఈ సంవత్సరం పని ప్రారంభించనుంది. ఇవన్నీ కలిసి అమెరికా, ఇజ్రాయిల్‌లు ఇరాన్ పై కన్నెర్ర చేయడానికి కారణాలయ్యాయి. అయితే ఇక్కడ రష్యా కూడా రెండు నాల్కల ధోరణి అవలంభిస్తున్నది. ఇరాన్ శుద్ధి కార్యక్రమాన్ని ఆపమని డిమాండ్ చేస్తూ, ఆ కార్యక్రమాన్ని తమ భూభాగంలో చేసుకోమని చెవుతున్నది. దీనికి పశ్చిమ దేశాలు కూడా మద్దతు పలుకుతున్నాయి.

న్యూయార్క్ మర్కంటైల్ ఎక్స్చేంజి(ఎన్.వై.ఎం.ఇ.ఎక్స్), లండన్‌కు చెందిన పెట్రోలియం ఎక్స్చేంజి(ఐ.పి.ఇ) అనే రెండు ప్రధాన చమురు వ్యాపార సంస్థలు అమెరికా బహుళజాతి కంపెనీల ఆధిపత్యంలో పని చేస్తూ, డాలర్ ఆధిపత్యం వహిస్తున్న చమురు వ్యాపారంలో గట్టిపట్టును కొనసాగిస్తున్నాయి. ఇందువల్ల చమురు వ్యాపారంలో డాలర్ ప్రపంచ కరెన్సీ(ద్రవ్యం) అయి కూర్చుంది. ఈ రెండు ప్రధాన సంస్థలకు పోటీగా యూరో ఆధిపత్యం వహించే అంతర్జాతీయ చమురు వ్యాపార వ్యవస్థను వినియోగంలోకి తీసుకొచ్చే చమురు సంస్థను టెహరాన్‌లో నిర్మాణం చేయాలనే స్పష్టమైన పథకం ఇరాన్‌కు వుంది. 2003 వసంతకాలం నుండి యూరోప్ ఆసియా దేశాలకు చేసే ఎగుమతులకు యూరోలలో చెల్లింపులను కోరుతున్నది. అమెరికా తయారు చేసిన సద్దాం నేరాల జాబితాలో ఇరాక్ చమురు ఎగుమతులకు డాలర్ల బదులు యూరోలలో చెల్లింపులను కోరడం కూడా ఒక పెద్ద నేరమేనని మర్చిపోరాదు.

ఆ విధంగా నేటి ప్రపంచంలో ఇరాన్ చాలా ముఖ్యమైన వ్యూహాత్మక ప్రాముఖ్యతను కలిగి వుంది. ముఖ్యంగా ఇరాక్ విషయంలో అమెరికా గౌరవం నానాటికీ దిగజారుతున్న పరిస్థితిలో ఇరాన్‌పై మిలటరీ దాడికి దిగటం అమెరికాకు అంత తేలికైన విషయం కాదు. అయితే ఇరాన్ ఉత్తర ప్రాంతంలోని కుర్దు, అజరీ మైనారిటీ జాతులను ఎగదోయటం ద్వారా అనిశ్చిత పరిస్థితుల్ని కల్పించే విధానాలకు పాల్పడుతూనే వుంటుంది. అలాగే సద్దాం ప్రోత్సాహంతో ఏర్పాటైన ఇరాన్ వ్యతిరేక ముజాహిదీన్-ఎ-ఖల్క్ అనే ఒక ఇస్లామిక్ గ్రూప్ ఇప్పుడు అమెరికా రక్షణ , అజమాయిషీలో వుంది. ఇటువంటి ఇతర గ్రూపులను కూడా ఎగదోసి ఇరాన్ పాలనను కూలదోయడానికి అమెరికా ప్రయత్నిస్తుంది. తూర్పు వైపున ఇరాన్, పాకిస్తాన్‌ల మధ్య విడిపోయి జీవిస్తున్న బలూచ్ ప్రజలున్నారు. అమెరికాకు ఈ ప్రాంతంలో మిలటరీ స్థావరాలున్నాయని, ఈ ప్రాంతంలో అది తీవ్రమైన సైనిక కోవర్టు ఆపరేషన్‌లకు పాల్పడుతున్నదని తెలుస్తున్నది. అంతేగాక, ఒకవైపున గల్ఫ్‌లో తనకు అనుకూల దేశాలైన సౌదీ అరేబియా, తదితర దేశాల నుండి ఇరాన్ పై సైనికంగా చుట్టివేత జరుపుతూ, మరొక వైపున ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ మరికొన్ని కాస్పియన్ సముద్రతీర దేశాల్లో సైనిక స్థావరాల్ని

ఏర్పాటు చేసుకుంది. ఇదంతా అమెరికా సైనిక శక్తికి అదనంగా చేపట్టిన కార్యక్రమం. అలాగే ఇజ్రాయిల్ చేపడుతున్న ఇరాన్ వ్యతిరేక కార్యక్రమాలు కూడా. చివరిగా, ఇరాన్‌లో అధికారాన్ని కూలద్రోయడానికి ప్రయత్నిస్తున్న రహస్య గ్రూపులతో గట్టి సంబంధాలు గల విదేశాల్లోని సంపన్న రాచరిక ఇరానీయుల వర్గాన్ని పెద్ద మొత్తంలోనే కూడగడుతున్నది. రాజుషా కొడుకును తిరిగి గద్దె నెక్కించటానికి విదేశాల్లోని ఇరాన్ వ్యతిరేకులందర్నీ ఇరాన్‌లో ప్రజాస్వామ్య పునరుద్దరణ కోసమని సి.ఐ.ఎ ( అమెరికా గూఢచార సంస్థ) కూడగడుతున్నది. ఆ విధంగా ఇరాన్‌లో అమెరికా పోటీ తీవ్రస్థాయిలోనే వుంది. అమెరికా మరింత అప్రమత్తంగానే అడుగు వేస్తుంది గానీ, దాని ఆదిపత్యవాద, సామ్రాజ్యవాద అత్యాశ దాన్ని దూకుడు చర్యలకే పురమాయిస్తుంది.

## ఐ.ఎ.ఇ.ఎలో ఇరాన్ వ్యతిరేక ఓటుతో అమెరికా ముందు మోకరిల్లిన భారత్

*"అణ్వాస్త్ర వ్యాప్తి నిరోధక సంస్థ(ఎన్.పి.టి)కి సంబంధించిన రక్షణ ఒప్పందాలను అమలు పరచటంలో ఇరాన్ వైపునుండి అనేక వైఫల్యాలు, అతిక్రమణలు జరిగాయి. భద్రతా వ్యవస్థ పరిధిలో ఇరాన్ శాంతియుత ప్రయోజనాలకు విశ్వాసం లోపించింది. అంతర్జాతీయ శాంతి, భద్రతల పరిరక్షణ కోసం ఐ.ఎ.ఇ.ఎ వినియోగాలలోని ఆర్టికల్ 12సి ప్రకారం ఒప్పందాలను అమలు చేయకపోవటం అనేది చర్య తీసుకోవడానికి అధికారం కల్పిస్తుంది''* అని ఐ.ఎ.ఇ.ఎ తీర్మానం సెప్టెంబర్ 24న ప్రకటించింది. యురేనియం శుద్ధికి సంబంధించిన, భారజల మధ్యతరహా రియాక్టర్ల నిర్మాణానికి సంబంధించిన కార్యక్రమాలన్నింటిని పూర్తిగా ఆపివేయవలసిందని ఆ తీర్మానం ఇరాన్‌ను కోరింది. అంతేగాక, ఇరాన్ తగిన పరిశోధనా రియాక్టర్‌ను గుర్తించి, సాధించుకోవటంలో సహాయపడటానికి ఒక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసే ప్యాకేజి ఇరాన్ సార్వభౌమాధికారానికి భంగం కలిగే విధంగా ఇ.యు.మూడు దేశాలు ప్రతిపాదించాయి.

అలీనోద్యమ సభ్యదేశాలు దక్షిణాఫ్రికా, మెక్సికో, శ్రీలంక, అల్జీరియా, బ్రెజిల్ ఓటింగ్‌లో పాల్గొనలేదు. రష్యా, చైనాలు కూడా ఓటింగ్‌లో పాల్గొనలేదు. ఒక్క వెనిజులా మాత్రం తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేసింది. ఈ అంశంపై అలీనోద్యమ ఏకాభిప్రాయం అనే విలువకు విఘాతం కలిగించి, అమెరికా, ఇ.యు-3 దేశాలు కొద్దిపాటి మెజారిటీ సాధించడానికి సహాయపడుతూ భారత్ ఓటు కీలకంగా మారింది. ఇరాన్ అణ్వాయుధాలు సంపాదించే ప్రయత్నాలు చేస్తున్నదనే ఆరోపణలతో భద్రతామండలికి అప్పగించాలనేదే తీర్మానం అసలు సారాంశం.

ఇంతవరకు అలీనోద్యమంలోని 116 దేశాల మద్దతు ఇరాన్‌కు లభించింది. అమెరికాకు అనుకూలంగా వ్యవహరిస్తూ, భారత్ ఇరాన్‌కు వ్యతిరేకంగా ఓటు వేయడంతో, ఐ.ఎ.ఇ.ఎ పరిధిలోనే ఇరాన్ అంశాన్ని చర్చించాలనే మునుపటి ప్రభుత్వ వైఖరి పూర్తిగా మారిపోయింది. నాటో కూటమి కాని దేశంగా ప్రత్యేక హోదా కలిగిన పాకిస్తాన్ కూడా ఓటింగ్‌లో పాల్గొనలేదు. ఆ స్థాయిలో భారత పాలకులు అమెరికా, ఇ.యు దేశాల ముందు మోకరిల్లుతున్నారు. సానుకూలంగా ఓటు వేసిన 22 దేశాల్లో భారత్ ఒకటి. సానుకూలంగా ఓటు వేసిన దేశాల్లో ఈక్విడార్, ఘనా, పెరూ, సింగపూర్ వున్నాయి.

జూలై 19న జరిగిన భారత్ - అమెరికా అణు ఒప్పందం నేపథ్యంలోనే ఇరాన్‌కు వ్యతిరేకంగా భారత్ ఓటు వేసిందనేది స్పష్టం. అమెరికా ఆదేశాలను భారత్ పాటిస్తున్నప్పటి నుంచి, అమెరికా అధికారుల ప్రకటనల ద్వారా ఇది స్పష్టంగా అర్థమవుతూనే వుంది. *ఇరాన్ విషయంలో భారత్ అనుసరించాలనుకుంటున్నదే దాని లక్ష్యమూ, విధానమూ. కాగా, భారత్‌కు సంబంధించి బ్రహ్మాండమైన స్థాయిలో గొప్ప మార్పులు తీసుకురాగల చర్యలు చేపట్టడానికి మేము ఒప్పందానికి వచ్చాము. ఇక కొన్ని అభివృద్ధి కార్యక్రమాలకోసం భారత్, ఇరాన్‌తో ఏర్పాట్లు చేసుకుంటుందని నేను అనుకోవటం లేదు. అమెరికా మద్దతుకు సంబంధించిన అన్ని ప్రయోజనాలను స్వీకరించడానికి భారత మిత్రులు ఇష్టపడుతున్నట్లైతే, భారత్ కూడా అమెరికా ప్రయోజనాలకు తగిన మద్దతునిస్తుందని ఆశిస్తాము...... ఇరాన్ అణ్వాయుధాల అంశాన్ని ఐక్యరాజ్యసమితి భద్రతామండలికి అప్పగించాలనే అమెరికా వైఖరిని భారత్ సమర్థించదు అని భారత విదేశాంగ మంత్రి ఇటీవల చేసిన వాఖ్యల గురించి నేను ప్రత్యేకంగా పేర్కొంటున్నాను..... అణ్వాయుధ వ్యాప్తి నిరోధక సంధిని ఇరాన్ 18 సంవత్సరాలు ఉల్లఘించడాన్ని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలికి అప్పగించడంలో మా కృషిని సమర్థిస్తున్న అంశంతో కలిపి, ఇరాన్ నుంచి అణ్వాయుధాల భయాన్ని ఎదుర్కోవడంలో అమెరికా ప్రయత్నాలు ఎంత ముఖ్యమైనదో న్యూఢిల్లీ తప్పక అర్థం చేసుకోవాలి. ఈ విషయంలో అమెరికాకు పూర్తి మద్దతివ్వటంతో ఏమాత్రం లోపం జరిగినా అది న్యూఢిల్లీతో అమెరికాకున్న అణు, రక్షణ పరస్పర సహకార విస్తృతికి చేటు చేస్తుంది* అని అమెరికా విదేశాంగ విధాన ప్రధాన రూపకర్త అయిన లాంటోస్ అన్నాడు.

దీని తర్వాత విదేశాంగ మంత్రిని ఇరికిస్తూ వోకర్ నివేదిక విడుదలైంది. ఆ విధంగా నట్వర్ సింగ్, అతని కొడుకుతోపాటు రాజకీయ నాయకులందరూ అవినీతిలో గొంతులోతు కూరుకు పోయారు. నట్వర్‌సింగ్‌ను మంత్రివర్గం నుంచి సాగనంపటానికి అమెరికా అనుకూల వర్గాలు ఈ నివేదికను ఉపయోగించుకున్నాయి. ఈ నివేదిక అమెరికా కుట్ర అనేది అన్ని దేశాలకు తెలిసే నివేదికలో పేర్కొన్న 135 కంపెనీలపై కూడా నివేదికకు అనుకూలంగా ఎటువంటి చర్యలు చేపట్టకుండా వదిలేశారు. వాస్తవానికి అవినీతిలోని లబ్దిదారుల్లో ప్రధానమైనది రియలన్స్ సంస్థ. కాని అంబానీల మీద ఎటువంటి చర్య తీసుకోలేదు. అమెరికా మాటను తన నోట వల్లించే చిలక, విదేశీ వ్యవహారాల కార్యదర్శి శ్యాంచరణ్ కూడా *("అణ్వాయుధాల తయారీకి భారత్ వ్యతిరేకం; ఈ విషయంపై భారత్ వైఖరిలో ఎలాంటి అస్పష్టత లేదు")* అని వెంటనే న్యూఢిల్లీలో ప్రకటించాడు.

భారత్, ఇరాన్, పాకిస్తాన్‌ల మధ్య చమురు పైపు లైనుకు తోడు, 2009 నుంచి సంవత్సరానికి 5 మిలియన్ టన్నుల ద్రవీకృత సహజవాయువు (ఎల్.ఎన్.జి)ని సరఫరాచేసే ఒప్పందం మీద భారత్, ఇరాన్‌లు సంతకాలు చేశాయి. ఇది 21 బిలియన్ డాలర్ల విలువకలిగిన 25 సం॥ల ఒప్పందం. ఇరాన్‌కు వ్యతిరేకంగా భారత్ ఓటు వేసిన తర్వాత, ఒప్పందానికి వ్యతిరేకంగా ఇరాన్ ప్రతిస్పందించి, ఒప్పందాన్ని రద్దు చేసుకుంటానని బెదిరించింది. ఇరాన్‌తో ఇటువంటి ఒప్పందాలను అమెరికా గట్టిగా వ్యతిరేకిస్తుండగా, రష్యా, చైనాలు ఇరాన్‌తో ఒప్పందాలను బాగా ప్రోత్సహిస్తున్నాయి. సాధ్యమైనంత ఎక్కువ సంపాదించుకోవాలని గట్టిగా ప్రయత్నించే బడా వ్యాపార వర్గాలు కూడా భారత్‌లో వున్నాయి. నవంబర్ చివర్లో జరిగిన తదుపరి ఐ.ఎ.ఇ.ఎ సమావేశంలో భారత్ ఓటును ఉపసంహరించుకునేటట్లు చేయడంకోసం సి.పి.ఎం, ఎస్.పి తదితర పార్టీలు సంయుక్తంగా క్యాంపెయిన్ చేపట్టాయి. ప్రధానమంత్రి కార్యాలయం చుట్టూ వున్న చిన్న ముఠా అమెరికా - ఇ.యు-3 దేశాల కూటమి ప్రతిపాదనకు అనుకూలంగా భారత్ ఓటు వేసే నిర్ణయాన్ని చేశారని కూడా తెలుస్తున్నది. ఇందులో అమెరికాలోని భారత రాయబారి రోనెన్‌సేన్, శ్యాంచరణ్‌లు కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రభుత్వంతో గట్టి పట్టున్న ఉన్నతాధికార వర్గంలో చాలామంది ఇరాన్‌తో భారత్ ఒప్పందం విచ్ఛిన్నం కావడానికి అనుకూలంగా లేరు.

చివరిగా, నవంబర్ చివర్లో జరగనున్న ఐ.ఎ.ఇ.ఎ బోర్డు సమావేశంలో అమెరికా ఇ.యు దేశాల కూటమి ఎటువంటి ఓటుకోసం ప్రోత్సహించలేదు. ఇ.యు-3 దేశాలు ఇరాన్‌తో మరొకసారి చర్చలు ప్రారంభించాయి. కాని చివరి వరకు ఇరుపక్షాలు తమపట్టును వీడలేదు. ఇరాన్ ఎన్నికల్లో తీవ్ర ఇస్లామిక్ భావాలు గల మహమ్మూద్ అహ్మద్ నెజాద్ విజయంతో అమెరికా-ఇ.యు దేశాల ఒత్తిడికి లొంగే ఆలోచన ఇరాన్‌కు లేదు.

సామ్రాజ్యవాద పథకాల్లో ఇరాన్ నూతన, ప్రధాన కేంద్రం. పైన పేర్కొన్నట్లు ఇరాన్‌కున్న విస్తృతమైన చమురు, సహజవాయు నిల్వలకు తోడు, భౌగోళిక-రాజకీయ ప్రభావానికి సంబంధించిన అనేక అంశాలు కూడా దీనితో కలిసి వున్నాయి. భారత పాలకవర్గాలు, వ్యాపార వర్గాల మీద రెండు శక్తులు బలంగా పని చేస్తున్నాయి. అమెరికా వైపు అందరూ మొగ్గుతుండగా, భారత దళారీ వర్గంలోని ఒక సెక్షన్ ఇరాన్‌తో చమురు, సహజవాయు ఒప్పందానికి అనుకూలంగా వున్నారు.

ఒక దేశం ఏమి ఉత్పత్తి చేయాలి, ఏమి చేయకూడదు అని ఆజ్ఞాపించే హక్కు ఏ దేశానికి లేదు. ఒకపక్క అమెరికా లెక్కకుమించిన అణ్వాయుధాలను కలిగి వుంటూనే, ఇతరులు వాటిని తయారు చేయరాదంటూ గగ్గోలు పెట్టడం దాని నీచత్వానికి నిదర్శనం. ఏదేశమైనా తమ ఆత్మరక్షణకు అణ్వాయుధాలు తయారు చేసుకునే హక్కును కలిగి వుండగా బహిరంగానే బెదిరిస్తున్న అమెరికా దాడి నుంచి తన్నుతాను రక్షించుకోవడానికి ఎన్.పి.టి పరిధిలోనే యురేనియం శుద్ధి చేసుకోవడానికి ఇరాన్‌కు అవకాశం కల్పించటం లేదు. భారత్ పాలకులు అమెరికాకు పూర్తిగా దాసోహమవటమే గాక, తాము అణ్వాయుధాలు తయారుచేస్తూనే, ఎన్.పి.టి(అణ్వాయుధ వ్యాప్తి నిరోధక సంధి) పై సంతకం చేయడాన్ని తిరస్కరించటంలో కూడా నయవంచనకు పాల్పడుతున్నారు. ఇరాన్ పట్ల భారత్ యొక్క ఈ సామ్రాజ్యవాద అనుకూల వైఖరిని, రెండు నాల్కల ధోరణిని అనుసరిస్తున్న భారత్ ఏజెంట్లను అన్ని దేశాలు తిప్పికొట్టవలసిన అవసరం వుంది. అది ఈ ఏజెంట్లకు తగిన గుణపాఠం కావాలి. సామ్రాజ్యవాద దాడికి వ్యతిరేకంగా తమ సార్వభౌమాధికార హక్కును కాపాడుకోవడానికి పోరాడుతున్న ఇరాన్ ప్రజలపక్షాన భారత్ ప్రజలు తప్పక నిలబడతారు.

# ఆంధ్రప్రదేశ్‌లో పెచ్చరిల్లుతోన్న రాజ్యహింస

## నిప్పులు చెరిగే నిర్బంధంతో తలపడుతున్న ఆంధ్రప్రదేశ్ ఉద్యమం

చర్చల అనంతరం ప్రభుత్వం కుట్రపూరితంగా పాశవిక దాడిని తలపెట్టింది. వెసులుబాటు కాలంలో బలోపేతం చేసుకున్న కమ్యూనికేషన్ వ్యవస్థ, ఇంటలిజెన్సీ, కోవర్టుల ద్వారా విప్లవోద్యమంపై విరుచుకు పడింది. 2005 జూలై, ఆగస్టులలో కోవర్టుల ద్వారా ఉద్యమానికి తీవ్రమైన నష్టాల్ని చేసింది. నల్లగొండ జిల్లాలో కామ్రేడ్స్ రాజు, రవి, నల్లమల డివిజన్‌లో కామ్రేడ్స్ విజయ్, ఆజాద్, మోహన్ తదితర విలువైన కామ్రేడ్స్‌ను ఈ కాలంలోనే విప్లవోద్యమం కోల్పోయింది. 2005 ఆగస్టులో ఎం.ఎల్.ఎ. నర్సిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డిలను ఖతం చేసిన తర్వాత కాంగ్రెస్ పార్టీకి గుండె మీద డైరెక్ట్‌గా బైనెట్ దించినట్టు అయింది. దానితో పార్టీపై, ప్రజా సంఘాలపై నిషేధం విధించి పోలీసు ప్రభుత్వం పోలీసు బలగాలను విచ్చలవిడి అధికారాలను ఇచ్చింది. దానితో చదువు చెప్పుకొని బతికే ఉపాధ్యాయుల నుండి అడవిలో అమాయకంగా కాయ, గడ్డ ఏరుకుని తినే చెంచుల వరకూ పోలీసులు అతి క్రూరంగా దాదాపు 20 మందిని చంపేశారు(పాలమూరు, ప్రకాశం జిల్లాలలో).

2005 నవంబర్, డిసెంబర్‌లలో ప్రభుత్వం దాడిని మరింత తీవ్రం చేసింది. కేంద్రం కనుసన్నలలో సి.ఆర్.పి.ఎఫ్, గ్రేహౌండ్స్ బలగాలనూ వీటికి తోడు ప్రభుత్వమే ఏర్పాటు చేసిన నయీమ్‌ముఠా, నల్లమల టైగర్స్, నల్లత్రాచులు, నర్సాకోబ్రాస్ వంటి రకరకాల ముఠాలను క్రూరుడైన డి.జి.పి స్వరణ్‌జిత్‌సేన్ ఎప్పటికపుడు సమన్వయం చేస్తున్నాడు. మరీ ముఖ్యంగా నవంబర్ నుండి మూడు నెలల యాక్షన్ ప్లాన్‌తో బహుముఖ దాడిని మరింత ఉధృతం చేశారు. ప్రతి మండల సెంటర్ నుండి పెద్ద పట్టణం వరకూ, ప్రతి ఉద్యమ గ్రామం నుండీ సరిహద్దు గ్రామం వరకూ అకస్మాత్తుగా ఊహించని విధంగా తనిఖీ కేంద్రాలను పెట్టారు. తనిఖీ కోసం మాజీలను నియమించి అరెస్టులను కొనసాగించారు. అటవీ ప్రాంతంలో ఒక ఎల్‌ఓఎస్ ఏరియాలో 30, 40 మందితో ఒకేసారి 10, 15 బ్యాచులు కూంబింగ్ చేస్తున్నాయి. వీరు రోజుకు ఒకే పూట వంట చేసుకొని, తిని, మరోపూటకు ప్యాక్ చేసుకొని కిట్లలో పెట్టుకొని తిరుగుతున్నారు. అన్ని రకాల ఆయుధ సామాగ్రితో అడవిలోకి వచ్చే ఈ బ్యాచులు ఒకసారి వస్తే మూడురోజుల నుండి వారం రోజుల వరకూ కూంబింగ్ చేస్తున్నాయి. ఈ కూంబింగుల్లో ఆఫీసర్లు నేరుగా పాల్గొంటున్నారు. వాకీ, సెల్‌లతో సమన్వయం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో (2006 ఏప్రిల్‌కు ముందు) అతి తక్కువ కాలంలోనే నల్లమలలో 17 సార్లు పోలీసు బలగాలకూ పి.ఎల్.జి.ఎ బలగాలకూ మధ్య ఎన్‌కౌంటర్లు జరిగాయి. అంటే కూంబింగ్‌ల ఉధృతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

గతంలో తెలంగాణా ప్రాంతానికి పరిమితమైన ప్రభుత్వ అణచివేత విధానాల్ని దక్షిణ కోస్తా, రాయలసీమలకు విస్తరించాయి. గుంటూరు జిల్లాలో ఇంటలిజెన్సీ నెట్‌వర్క్‌ను పటిష్ట పర్చుకొని, ప్రజలపై, పార్టీపై తీవ్రమైన దాడికి ఒడిగడుతున్నారు. ఈ జిల్లాలో పోలీసుల సమాచార వ్యవస్థ, వారి ప్రతిస్పందన ఎంత వేగంగా ఉంటున్నదంటే కామ్రేడ్ రఘు, వాసులు ఒక యాక్షన్‌కు పోయి వస్తుంటే, సమాచారం అందుకొని మార్గ మధ్యంలోనే వారిని అడ్డగించి చంపివేశారు. కా॥ లత ఒక ఎన్‌కౌంటర్‌లో విడిపోయి షెల్టర్‌లో వుంటే ద్రోహుల ద్వారా పట్టుకొని హత్య చేశారు. మరో రెండు, మూడు బూటకపు ఎన్‌కౌంటర్లు ఇలాగే జరిగాయి. మొత్తం ఈ జిల్లాలో పార్టీ కార్యకర్తలనూ, సానుభూతిపరులనూ కల్పి దాదాపు 15 మందిని హత్య చేశారు. అరెస్టులు, చిత్రహింసలు, గ్రామాలపై దాడులకు దౌర్జన్యాలకూ అంతే లేదు.

నల్లమల డివిజన్‌లో దారుణమైన హత్యాంకాండకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా చిన్న ఆరుట్ల గ్రామానికి చెందిన చెంచు నాగన్నను వృద్ధుడని కూడా చూడకుండా క్రూరంగా పట్టుకొని అతని ఇంట్లోనే కాల్చి చంపారు. పైగా మావోయిస్టులే చంపినట్టుగా దొంగ ఉత్తరాన్ని పెట్టారు. తన పిల్లలు పార్టీలో పని చేస్తున్నందుకు కా॥ ఈశ్వరమ్మను పట్టుకొని దాదాపు 50 ఏళ్ళ ఆమె వయసును కూడా లెక్కచేయకుండా కాల్చి చంపారు. ఇదే డివిజన్‌లో పనిచేస్తున్న కామ్రేడ్స్ శ్రీధర్, సుధాకర్‌లను కూడా ఒక టౌన్‌లో పట్టుకొని తీవ్ర చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారు. ఈ విధంగానే అనారోగ్య కారణాల వల్ల వెళ్లిన కామ్రేడ్స్ విక్రం, ఉమలను పట్టుకొని కాల్చి చంపారు. పోలీసుల కూంబింగుల్లో ఉమ అనే మరో కామ్రేడ్ అమరురాలయింది. అనంతపురం నుంచి నల్లమల డివిజన్‌కు బదిలీ అయి వస్తోన్న ముగ్గురు కామ్రేడ్స్‌ను త్రిపురాంతకం బస్టాండులో పట్టుకొని క్రూరంగా హింసించి నల్లమల డివిజన్‌లో కాల్చి చంపారు.

మావోయిస్టులపైనే కాదు నల్లమల మొత్తంగా చెంచు

## 'కో(బ్రా'ల పేరుతో కళాకారుడి ఇల్లు కూల్చివేత

ప్రజాకళా మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడి పేరు జంగాల కోటేశ్వర్‌రావు. ఈయనది ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం గుడిపూడివారి పాలెం. గత సం॥నరగా అతను హైదరాబాద్‌లో వుంటున్నాడు, కొడుకు వైద్యం నిమిత్తం. అయితే మే5న మావోయిస్టులు సోమిదేవిపల్లి రైల్వేస్టేషన్‌ను పేల్చివేసిన రాత్రే కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గుడిపూడివారిపాలెంలో వున్న అతని ఇంటి మీద దాడి చేసి ముసలి తల్లిదండ్రులు ఇంట్లో వుండగానే ఇంటిని కూల్చి వేశారు. మే 6వ తేదీన ఉదయం వచ్చిన పోలీసులు ఆ ప్రాంతమంతా తిరిగి 'సిపిఐ నల్లమల పడగ - చీమకుర్తి మండల కమిటీ' అని రాసి వున్న ఓ చీటిని పట్టుకొని వచ్చి ఆ ఇంటిని కోబ్రాలు కూల్చివేశారని తేల్చేశారు. అయితే అప్పటిదాకా ఆ ప్రాంతంలో సంచరించిన వారెవ్వరికీ కనబడని చీటీ పోలీసులకే కనబడ్డం విశేషం. పోలీసులకూ కోబ్రాలకూ ఉన్న సంబంధం ఈ సంఘటన ద్వారా అర్థమౌతుంది. అంతేగాక కోటేశ్వర్‌రావు గత సం॥నరగా అజ్ఞాతవాసంలో ఉన్నాడని పోలీసులు పత్రికలకు చెప్పారు. కళాకారుడిగా గత సం॥నరగా అనేక బహిరంగ కార్యకలాపాల్లో పాలుపంచుకుంటున్న కోటేశ్వర్‌రావును అజ్ఞాత కార్యకర్తగా ముద్ర వేయడమంటే ప్రజా సంఘాలపై ప్రభుత్వ దాడి ఎంతగా ఉన్నదో అర్థమవుతుంది.

ఆదివాసీలపై కూడా దాడులను విపరీతంగా పెంచారు. తాటి ఈదయ్య, శివయ్య లాంటి చెంచు వారిని ఇన్ఫార్లుగా మార్చుకొని గూడాలను వల్లకాడుగా మారుస్తున్నారు. దద్దనాల గ్రామంలోని హాస్టల్‌పై, ప్రజలపై దాడిచేసి వారిని పట్టుకొని నెలరోజులు స్టేషన్‌లో వుంచుకొని చిత్రహింసలపాలు చేశారు. అల్లిపురం గ్రామంపై దాడి చేయడం వల్ల చెంచులు గ్రామాన్ని వదిలిపెట్టి పోయారు. బూరుగుండాల, గర్నిపెంట, పన్నల బైలు, గుట్టల చేను, పాలుట్ల గ్రామాలు మొత్తం పోలీసు దాడుల వల్ల ఖాళీ అయ్యాయి. కాయ, గడ్డలు తిని బతికే చెంచులు పోలీసు దాడుల వల్ల చెట్టుకొకరు, గుట్టకొకరు అయినారు.

కడప, అనంతపూర్‌లో ఈ ఆరు నెలల కాలంలో 20 మందికి పైగా కామ్రేడ్స్ పోలీసు దాడుల్లో అమరులైనారు. దళ సభ్యుడు మల్లేష్ పనుల మీద బయటకు పోయినప్పుడు పోలీసులు అరెస్టు చేసి కోవర్టుగా మార్చుకున్నారు. ఈ కోవర్టు ఇచ్చిన సమాచారం వల్ల జరిగిన ఎన్‌కౌంటర్లలో దాదాపు 12 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. కామ్రేడ్స్ ఆర్కె, శ్యాం, రవిలు ఈ ద్రోహివల్లనే ప్రాణాలు కోల్పోయారు. జిల్లా కమిటీ సభ్యుడు శ్రీను కూడా ఈ కోవర్టు మూలంగానే అరెస్టు ఆయ్యాడు. ఇదే జిల్లాలో మరో కోవర్టు ద్వారా దళం సమాచారాన్ని తెలుసుకున్న 400 మంది పోలీసు బలగాలు చుట్టుముట్టి విచక్షణా రహితంగా కాల్పులు జరిపి ఆరుగురు మహిళా కామ్రేడ్స్‌తో సహా 9 మందిని హత్య చేశారు. జిల్లాలో శత్రువు ఎప్పుడూ లేని విధంగా నిరంతరం కూంబింగ్‌లు చేస్తున్నాడు. పల్లెలపై నిరంతరం దాడులవల్ల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది.

మహబూబ్‌నగర్ జిల్లాలో నల్లమల అడవిలోని ఈర్లపెంట గోవింద్‌ను అచ్చంపేటలో పట్టుకొని చంపేశారు. జాల లింగయ్యను, చెంచు లింగస్వామిని చంపారు. పైగా మావోయిస్టు పార్టీ చంపిందని ప్రకటనలు చేశారు. పానగల్ ఏరియా కార్యదర్శి కా॥ సత్యం, సానుభూతిపరుడు అమర్‌నాథ్‌రెడ్డిలను కూడా పట్టుకొని క్రూరంగా హింసించి చంపారు. ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా పి.ఎల్.జి.ఎ కొండనాగుల గ్రామంలో బల్మూరు హెడ్ కానిస్టేబుల్‌ను చంపగానే పోలీసులు బండరాయిపాకలలో ఒక అబ్బాయిని, లింగోటంలో మరొకరిని కాల్చి చంపారు. గ్రామాలపై పోలీసుల దాడులు విపరీతంగా పెరిగాయి. ఈర్లపెంట, మేడిమలుకల, గుండాల పెంటలను ఖాళీ చేసి మీకు దిక్కున్నచోట చెప్పుకొమ్మని పోలీసులు జులుం చేశారు. క్రిష్ణానదిలో చేపలు పట్టుకొని బతికే జాలర్లను దళాల ఆచూకీ చెప్పమని ఇన్ఫార్మర్లుగా మార్చుకునే ప్రయత్నాలు తీవ్రతరం చేశారు. వాళ్లనక్కడ ఉండవద్దని మానసికంగా, శారీరకంగా చిత్రహింసలపాలు చేస్తున్నారు. నదిలో తిరిగే బోట్లను పోలీసులు దౌర్జన్యంగా ఉపయోగించుకుంటూ పార్టీని నిర్మూలించాలని చూస్తున్నారు. తాజాగా దళం మీద మూకుమ్మడి దాడి చేసి ఆరుగురు మహిళలతో సహా మొత్తం 8 మంది కామ్రేడ్స్‌ను బలిగొన్నారు.

నల్గొండ జిల్లాలోని క్రిష్ణపట్టి ఏరియాలో జనం బతకటానికి వీలులేనని పద్ధతిలో పోలీసు రాజ్యం నడుస్తోంది. గ్రామాలకు సరుకులు తెచ్చుకునే స్థితి లేదు. కిరాణా దుకాణాలను కూడా నడుపనిస్తలేరు. వేసవి దాడుల పరంపరలో ప్రజలపై తీవ్రమైన దాడులు కొనసాగాయి. నీళ్లను తోడి చేపలను పట్టాలన్నట్టుగా ప్రజలపై దాడులనూ, చిత్రహింసలను అమలు చేస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం.

ఇక జూన్ మొదటి వారంలో శత్రువు విప్లవోద్యమానికి మరో భారీ నష్టాన్ని కల్గించాడు. వాడి నెట్‌వర్క్ ద్వారా అపాయింట్‌మెంటుకు పోయిన కామ్రేడ్స్‌ను అరెస్టు చేసి వారి దగ్గర దొరికిన సమాచారంతో, పకడ్బందీ వ్యూహంతో దాడి చేయగా రాష్ట్ర కమిటీకి చెందిన సెక్రటేరియట్ సభ్యుడు కా॥ రవికుమార్(శ్రీధర్) అమరుడయ్యాడు. అలాగే గుంటూరు జిల్లా ప్లటూన్ కమాండర్ కా॥ సురేష్‌ను కూడా పోలీసులు క్రూరంగా హత్య చేశారు.

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రపంచబ్యాంకు విధానాలను మరింత నిస్సిగ్గుగా, నిర్దాక్షిణ్యంగా అమలు చేస్తూ ప్రజల అసహనానికి గురవుతోంది. అదే సమయంలో ప్రశ్నించి ఎదురు తిరిగే ప్రజలకు అండదండలు అందించే పార్టీని నిర్మూలించడానికి నిరంతర ఎదురుదాడి కొనసాగిస్తున్నది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో సరికొత్త పథకాలతో అణచివేతను కొనసాగిస్తోంది. అయితే నిప్పులు చెరిగే నిర్బంధంలో సహితం నిటారుగా నిలబడిన చరిత్ర రాష్ట్ర ఉద్యమానికి మొదటినుంచీ వుంది. ఆ చరిత్ర ఇప్పుడూ కొనసాగుతోంది. ఇటీవల హంతక పోలీసు బలగాలు చేసిన మూకుమ్మడి దాడులన్నింటిని పి.ఎల్.జి.ఎ వీరోచితంగా ప్రతిఘటించింది. ఏప్రిల్‌కు ముందు నల్లమల ప్రాంతంలో పోలీసులు జరిపిన 17 క్రూర దాడుల్లో ఒక దాడిలో మాత్రమే పార్టీకి ప్రాణ నష్టం కల్గింది. ఈ దాడిలో గుంటూరు జిల్లాకు చెందిన కామ్రేడ్స్ విజయ, సునీల్‌లు అమరులయ్యారు. మిగితా అన్ని దాడులను 10, 15 బ్యాచీలు ఒక్కసారిగా చుట్టుముట్టినప్పటికీ పి.ఎల్.జి.ఎ అత్యంత సాహసోపేతంగా ప్రతిఘటిస్తూ పార్టీ నాయకత్వాన్ని కాపాడుకుంది. నిరంతర కూంబింగ్‌ల మధ్య, దాడుల మధ్య క్యాడర్ ఎంతో నిబ్బరాన్నీ, చొరవనూ ప్రదర్శిస్తున్నారు. ఈ పరిణామం పార్టీ శ్రేణుల్లో ఇనుమడింప జేస్తోంది. మహబూబ్‌నగర్ జిల్లాలో మరబోట్ల మీద వస్తున్న పోలీసు బ్యాచీలపై పి.ఎల్.జి.ఎ బలగాలు శ్రీశైలం రిజర్వాయర్ వద్ద చేసిన వీరోచిత దాడిలో ఒక ఆఫీసర్ నీటిలో పడి చచ్చాడు. ఐదు, ఆరు మందికి గాయాలయ్యాయి.

క్యాడర్లో పెరిగిన ఈ చొరవ, సాహసం సాధారణ అంశంగా మారాలి. శత్రువు అణచివేతను ఎదుర్కొంటూ గెరిల్లా జోన్‌గా మనగలుగుతున్న ఈ ప్రాంతంలో గెరిల్లా యుద్ధాన్ని ముందుకు తీసుకుపోవాలంటే ప్రజలను అంటిపెట్టుకొని వుండాలి. వారి సమస్యలను తీసుకొని పోరాటాల్లోకి సమీకరించాలి. ప్రపంచబ్యాంకు అమెరికా జోక్యాన్ని ఎండగడుతూనే ప్రజలను సంఘటితపర్చాలి. ఉదారవాదంతో టెక్నికల్ తప్పులు చేయకుండా, శత్రువుకు తేలికగా విజయాలు చేకూరనీయకుండా పార్టీ పద్ధతులను, క్రమశిక్షణను అమలు చేయాలి. సాహసంగా చిన్న చిన్న దాడుల్లో విజయం సాధిస్తూ, చొరవను సంపాదిస్తూ ప్రజాయుద్ధాన్ని పురోగమింపచేయాలి. శత్రువుకు సంబంధించిన బలహీనతలపై దెబ్బతీస్తూ పట్టు సంపాదించడం పార్టీ శ్రేణుల నిరంతర ఆచరణగా వుండాలి. పార్టీని, పి.ఎల్.జి.ఎ బలగాలను కాపాడుకుంటూ చురుగ్గా పురోగమించాలి. శత్రువు గుండెల్లో ప్రకంపనలు సృష్టించాలి. ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలి. అప్పుడే అమరుల కలలు నెరవేరుతాయని దృష్టిలో పెట్టుకోవాలి.

---

*(.....37వ పేజీ తరువాయి)*

పెట్టారు. గంగాలు ఆ భూమిని దొంగచాటుగా పట్టా చేయించుకొని టేకు చెట్లను అమ్మజూపాడు. అయితే అప్పుడు ఆ గ్రామాల ప్రజలంతా కల్సి దాన్ని అడ్డుకున్నారు. అలాగే గ్రామాల్లో రోడ్లు వేయించి కూలీలకు డబ్బులు సరిగా ఇవ్వక అవినీతికి పాల్పడ్డాడు. తానే రోడ్లు వేయించాననీ, ప్రభుత్వం మంచిదని అసత్యాలు ప్రచారం చేశాడు. వడ్డె (భూత వైద్యం) పని చేసి ప్రజలను భయభ్రాంతులను చేసేవాడు. సంఘ కార్యకలాపాలను విచ్ఛిన్నం చేయడానికీ, సంఘ సభ్యులను చంపడానికీ ప్రయత్నం చేశాడు. అంతేగాక పోలీసు ఇన్‌ఫార్మర్‌గా వుండి సంఘ, దళ సమాచారాన్ని తెలియజేసేవాడు. రాత్రి పోలీసులతో కల్సి తిరగడం, గ్రామాలపై దాడులు చేయించడం కూడా చేసేవాడు. దీనితో 2005 నవంబర్‌లో ఇతని ఇంటిపై ప్రజలు దాడి చేశారు. అయినా మారకుండా ఇతను తన కార్యకలాపాలను కొనసాగించసాగాడు. దీనితో 2006 ఏప్రిల్ 25వ తేదీన పార్టీ ఆధ్వర్యంలో 500 మంది ప్రజలు ఇతడి ఇంటిపై దాడి చేసి 30 బస్తాల ధాన్యం, మేకలు, పశువులు, కోళ్ళు, వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఇల్లును కూలగొట్టి పెంకుల్ని సహితం ప్రజలు పంచుకున్నారు. అతడి వడ్లమిల్లును స్వాధీనం చేసుకొని అతన్ని బాగా కొట్టి ఊరునుంచి తరిమేశారు.

# ప్రతిఘటనా పోరాట వార్తలు

## ఆంధ్రప్రదేశ్

## మెదక్ జిల్లా

### ఇసుక అక్రమ తరలింపుకు వ్యతిరేకంగా...

పెట్టుబడుదారుల ప్రయోజనాల కోసం గ్రామాల్లోని ఇసుకను విచ్చలవిడిగా తరలించడం అనేది నేడు ఆంధ్రప్రదేశ్‌లో ఒక విషమ సమస్యగా ముందుకొస్తోంది. దీనివల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతింటోంది. భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. బావులు ఎండిపోయి, రైతులు వ్యవసాయం చేయలేని పరిస్థితి ఏర్పడింది. అంతేకాదు తాగునీరు కూడా దొరక్క ప్రజలు ఇక్కట్ల పాలవుతున్నారు. ఇటువంటి దారుణ ఫలితాల వల్ల ఇసుక తరలింపుకు వ్యతిరేకంగా అనేక ప్రాంతాల్లో ప్రజలు ఆందోళనకు దిగుతున్నారు.

అందులో భాగంగా మెదక్ జిల్లా కొండపాక మండలం సింగారం గ్రామంలో ఇసుక వెలికితీయడం బందు పెట్టాలని ప్రజలు పార్టీ నాయకత్వంతో ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనలో భాగంగా గ్రామంలో అనేకసార్లు పోస్టర్లు వేశారు. గోడల మీద రాశారు. పత్రికా ప్రకటనలు ఇచ్చారు. ఎన్నోసార్లు ప్రజలంతా వెళ్లి ఎం.ఆర్.ఓకు తమ గోడును చెప్పుకున్నారు. ఇసుక అక్రమ తరలింపు మీద చర్య తీసుకోవాలని పోలీసు అధికారులను కూడా కోరారు. అయినప్పటికీ ప్రజల ఈ శాంతియుత పోరాటాన్ని ఎవరూ పట్టించుకోలేదు. దానితో ఇసుకను తరలించే ట్రాక్టర్లను తగులబెట్టాలని ప్రజలు పార్టీని డిమాండ్ చేశారు. ప్రజల డిమాండ్ సమంజసమైనదని భావించిన పార్టీ 2005, డిసెంబర్ 6వ తేదీన గ్రామ భూస్వాములకూ, పెత్తందారులకు చెందిన నాలుగు ట్రాక్టర్లనూ, ఒక లారీని తగులపెట్టింది. ఈ చర్యను ముగ్గురితో కూడిన యాక్షన్ టీం చేసింది.

వీటిని తగులబెట్టడంతో ఆ గ్రామంలోనే కాక చుట్టుపక్కల గ్రామాల్లోనూ ఇసుక వెలికి తీయడం బందు అయింది. దీనితో ప్రజల్లో మంచి ప్రభావం పడింది.

### ఇన్ఫార్మర్, కాంగ్రెస్ గూండా, రేపిస్ట్ కాల్చివేత

మెదక్ జిల్లా కొండపాక మండలం సిర్సనగండ్ల గ్రామానికి చెందిన రాముల భూమయ్య కాంగ్రెస్ కార్యకర్త. ఇతను పోలీసులకు ఇన్ఫార్మర్‌గా పనిచేస్తూ గ్రామంలోని పలు సంఘనాయకులను పోలీసులకు పట్టించాడు. అంతేగాక ఒక ముఠాను ఏర్పాటు చేసి పార్టీ పేరు చెప్పి డబ్బులు వసూలు చేస్తూ, దొంగతనాలు చేస్తూ, మహిళలపై అత్యాచారాలు చేస్తూ ప్రజా వ్యతిరేకిగా మారాడు. ఈ దుర్మార్గ పద్ధతులను మార్చుకోవాలని పార్టీ పోస్టర్లు వేయడం ద్వారా హెచ్చరించింది. అయినా లెక్క చెయ్యకుండా ఇతను తన పద్ధతులను కొనసాగించడం వల్ల ప్రజల అభీష్టం మేరకు చంపాలని పార్టీ నిర్ణయించింది. ఆ నిర్ణయాన్ని అమలు చేయడంలో భాగంగా పి.ఎల్.జి.ఎ 2006, జనవరి 4వ తేదీన ఇతడిని కాల్చిచంపింది.

ఈ చర్య ప్రజల్లో ముఖ్యంగా మహిళల్లో మంచి ప్రభావాన్ని వేసింది.

### శత్రువు అహంపై పి.ఎల్.జి.ఎ కొట్టిన దెబ్బ

మెదక్ జిల్లాలో మావోయిస్టు పార్టీ అంతరించిపోయిందనీ, అందరూ వేరే జిల్లాలకు వెళ్లిపోయారనీ, జిల్లా బాధ్యుడు లొంగిపోయాడనీ, ఉన్న ఒకరిద్దరిని త్వరలోనే పట్టుకోగలమని శత్రువు ప్రజల్లో ప్రచారం చేశాడు.

ఈ ప్రచారం అబద్ధమని తేల్చుతూ పి.ఎల్.జి.ఎ అవతరణ సందర్భంగా గిరాయిపల్లి ఏరియాలో పోస్టర్లు, బ్యానర్లు ప్రత్యక్షమయ్యేప్పటికి పోలీసుల అహం దెబ్బతిన్నది. ఎస్.ఐతో సహా ఒక పోలీస్ బ్యాచ్ వచ్చి బ్యార్లు తీసుకపోయారు. వీటిని వేసిన వారిని పట్టుకొని తీరుతామని ఎస్.ఐ ఆ ప్రాంతమంతా ప్రచారం చేశాడు. మిలిటెంట్లను, సానుభూతిపరులను అరెస్టు చేసి, చిత్రహింసలు పెట్టి, అక్రమ కేసులను మోపాడు. కూంబింగులను విస్తృతం చేశాడు. దీనితో ఈ ఎస్.ఐని లక్ష్యంగా చేసుకొని ముగ్గురితో కూడిన యాక్షన్ టీం, కా॥ మల్లేశం స్థూపం వద్ద మందుపాతరలు అమర్చి జెండాలు పాతడం జరిగింది. జెండాలు పాతిన విషయం తెలియగానే 2005, డిసెంబర్ 20వ తేదీన ఉదయం 11 గంటలకు పోలీసులు జెండాల దగ్గరకు వచ్చారు. ఎస్.ఐతో పాటు ఒక కానిస్టేబుల్ వీరావేశంతో జెండాలను పీకబోయారు. అదే అదనుగా భావించి అక్కడే మాటువేసిన యాక్షన్ టీం మందుపాతరను పేల్చడంతో ఎస్.ఐ, కానిస్టేబుల్ ఇరువురూ తీవ్రంగా గాయపడ్డారు.

ఈ సంఘటన పోలీసుల్లో తీవ్ర భయాందోళనలను కల్గించడమే కాక జిల్లాలో మావోయిస్టులు లేరని వారు చేసిన అబద్ధపు ప్రచారాన్ని బట్టబయలు చేసింది.

### ఎయిర్‌టెల్ టవర్ కాల్చివేత

మెదక్ జిల్లా కొండపాక మండలం దుద్దెడ గ్రామంలో ఎయిర్‌టెల్ టవర్‌ను ఏర్పాటు చేశారు. ఇలా గ్రామాల్లో సహితం టవర్స్‌ను ఏర్పాటు చేయడంలో దళారీ పెట్టుబడుదారుల లాభాపేక్షతో పాటు ఉద్యమ అణచివేత లక్ష్యం కూడా ఉంటున్నది. గ్రామాల్లో ఇన్ఫార్మర్లను తయారు చేసుకొని వారికి సెల్ ఫోన్లను ఇస్తున్నారు పోలీసులు. ఇన్ఫార్మర్లు ఎక్కడికో వెళ్లకుండా తమ ఇంట్లోనే కూర్చుని పోలీసులకు సమాచారం ఇచ్చే సౌలభ్యాన్నీ ఉద్యమ ప్రాంతాల్లోని మారుమూల గ్రామాల్లో సహితం వెలుస్తున్న టవర్లు కల్గిస్తున్నాయి.

అందుకని పీడిత ప్రజలకు పెద్దగా ప్రయోజనాన్నివ్వని, ఉద్యమ అణచివేతకు మార్గం సుగమం చేస్తోన్న దుద్దెడ గ్రామంలోని ఎయిర్‌టెల్ టవర్‌ను పి.ఎల్.జి.ఎ కాల్చివేసింది.

### అటవీ సంపదను కాపాడుకోవడం కోసం

సామ్రాజ్యవాదుల, బహుళజాతి సంస్థల ప్రయోజనాల కోసం అడవిని విచ్చలవిడిగా నరుకుతూ ప్లాంటేషన్లు వేయడం అనేది ప్రభుత్వం ఒక పాలసీగానే అమలు చేస్తున్నది. 'వన సంరక్షణ సమితి' పేరుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అత్యంత హాస్యాస్పదం. ఇట్లా అడవిని నాశనం చేయడం వల్ల పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోంది. అంతేకాక అడవి మీద ఆధారపడి బతుకుతున్న మనుషులతో పాటు సకల జీవజాలం ఉనికికీ ప్రమాదం ఏర్పడుతోంది. అయినప్పటికీ సామ్రాజ్యవాదుల ప్రయోజనాల్ని నెరవేర్చే లక్ష్యమే ప్రధానమై పోయిన పాలకవర్గాలు, అడవి విధ్వంసాన్ని కొనసాగిస్తూనే ఉన్నాయి.

అందులో భాగంగా మెదక్ జిల్లా నర్సాపూర్ ఏరియాలో ప్లాంటేషన్ ఏర్పాటు చేయడం కోసం పొక్లైనర్‌తో అడవి ధ్వంసం చేసే కార్యక్రమం మొదలు పెట్టారు. దీన్ని వెంటనే ఆపాలని పార్టీ వాల్ పోస్టర్లు, వాల్ రైటింగ్, పత్రికా ప్రకటనల ద్వారా ప్రచారం చేసింది. ఈ కార్యక్రమాన్ని దగ్గరుండి జరిపిస్తున్న ఆయా గ్రామాలకు సంబంధించిన వన సంరక్షణ సమితి ఛైర్మన్లను హెచ్చరించింది. అయినప్పటికీ అడవి విధ్వంసం యధావిధిగా కొనసాగుతుండటంతో 2005, డిసెంబర్ 18వ తేదీన చిన్న శంకరంపేట మండలం, పొక్లైనర్‌ను పి.ఎల్.జి.ఎ ధ్వంసం చేసింది. ఈ సంఘటన తర్వాత అడవి నరకడం కొంత మేరకు తగ్గింది.

ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగానే చిన్న శంకరం పేట మండలం సూరారం గ్రామం చుట్టూ అడవిని ధ్వంసం చేయడం మొదలుపెట్టారు. ఈ గ్రామానికి చెందిన వన సంరక్షణ సమితి ఛైర్మన్ దుర్గపతి (ఇతను ఎస్.సికి చెందిన వాడు) ఆధ్వర్యంలో ఇక్కడి పని నడుస్తూండింది. అడవిని నరకడం వల్ల ఎటువంటి నష్టం జరుగుతుందో ఇతనికి చాలాసార్లు పార్టీ వివరించింది. అడవి నరకొద్దని నచ్చజెప్పింది. అయినప్పటికీ అతను వినకుండా అడవి విధ్వంసం కొనసాగించాడు. అంతేగాక, పార్టీకి డబ్బులు ఇచ్చి పార్టీ అనుమతితోనే అడవి నరుకుతున్నానని తప్పుడు ప్రచారం చేశాడు. ఇంకా ఇతను గ్రామంలోని మాజీ మిలిటెంట్లను మధ్యం ప్రలోభానికి గురిచేసి తనకు లోబర్చుకున్నాడు. ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకున్న పార్టీ ఇతనికి బుద్ధి చెప్పాలనుకుంది.

2006, జనవరి 5వ తేదీన ఐదుగురు కామ్రేడ్స్ ఆ గ్రామానికి వెళ్లి దుర్గపతిని గ్రామచావడికి లాకొచ్చి చితకబాదారు. ఆ తర్వాతయినా తన పద్ధతులు మార్చుకోవాలని హెచ్చరించారు.

ఈ సంఘటన జరిగిన తర్వాత ఇందులోని వాస్తవాలను గుర్తించకుండా, దీన్ని దళితుల మీద మావోయిస్టులు దాడిగా అభివర్ణిస్తూ ఎం.ఆర్.పి.ఎస్ ఖండించింది. ఈ దళితుడు ఎవరి ప్రయోజనాలకు కొమ్ముకాస్తున్నాడనేది ఆ సంస్థ పట్టించుకోలేదు.

అయితే వారి ఖండనా ప్రకటనకు సమాధానంగా స్థానిక పార్టీ వివరణయైన పత్రికా ప్రకటనను ఇచ్చింది.

### కాంగ్రెస్ పార్టీ జెండా గద్దె ధ్వంసం

2005, డిసెంబర్ 20వ తేదీన కా॥ మల్లేశం స్థూపం వద్ద పోలీసులు అమరవీరుడి స్థూపాన్ని ధ్వంసం చేశారు. దీనికి ప్రతిగా అక్కడి పార్టీ, అధికార పార్టీకి చెందిన జండా గద్దెలనూ ధ్వంసం చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా గెరిల్లాలు చిన్న శంకరంపేట మండలం సూరారం గ్రామంలో కాంగ్రెస్ జెండా దిమ్మెను ధ్వంసం చేశారు.

### పి.ఎల్.జి.ఎ చేతిలో ప్రజా పీడకుడు హతం

మెదక్ జిల్లా చిన్న శంకరపేట మండలం కాజాపూర్ గ్రామానికి చెందిన తీగుళ్ల బాబు మాజీ మిలిటెంట్. ఇతను గతంలో మూడు సంవత్సరాలు పార్టీకి మిలిటెంటుగా పని చేశాడు. అలా పని చేస్తున్న సందర్భంలో పార్టీకి తెల్వకుండా కల్లు డిపో వారి వద్దా, చక్కెర ఫ్యాక్టరీ వారి వద్దా పార్టీ పేరు చెప్పి ఒక లక్ష రూపాయలు వసూలు చేశాడు. ఆ విషయం పార్టీకి తెల్సి విచారించడంతో ఈ విషయాన్ని ఒప్పుకున్నాడు. దీనితో పార్టీ అతనికి దేహశుద్ధి చేసింది. ఆ తర్వాత

అతనితో సంబంధాలు తెంచుకుంది.

ఆ తర్వాత అతను టి.ఆర్.ఎస్ పార్టీలో చేరి గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యాడు. ఆ తర్వాత గ్రామ పెత్తందారుగా మారాడు. ఆ గ్రామం చుట్టూ వున్న అడవి అతని సొంతం అన్నట్లు ప్రవర్తిస్తూ ప్రజలు మేకలు, గొడ్లు అడవికి మేతకోసం పోతే దండుగలు వసూలు చేసేవాడు. అడవిలో దొరికే సంపదను సహితం తానే సొంతం చేసుకునేవాడు. ఇట్లా ప్రజల పట్ల పీడకుడుగా మారాడు. అంతేగాక స్థానిక పోలీసులతో సంబంధాలు పెట్టుకుంటూ పార్టీ సమాచారం అందించేవాడు. ఇలా విప్లవ ద్రోహిగా, ప్రజాకంతకుడిగా మారిన దుర్గపతిని చంపాలని పార్టీ నిర్ణయించింది. ఆమేరకు 2005, డిసెంబర్ 28వ తేదీన 5గురితో కూడిన టీం వెళ్లి ఇతనిపై కాల్పులు జరిపింది. గాయపడి పడిపోయిన ఇతన్ని చనిపోయాడని భావించి వచ్చేసింది. కానీ తీవ్ర గామాలపాలైన ఇతడు తర్వాత హాస్పటల్‌లో చనిపోయాడు.

## మహబూబ్‌నగర్ జిల్లా

### శత్రు కుట్రలను భగ్నం చేస్తోన్న మావోయిస్టులు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఒకవైపు చర్చల నాటకం ఆడుతూనే మరోవైపు మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాంతాల్లో ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను తయారు చేసుకుంది. గ్రామాల్లో కిందిస్థాయి వర్గంలో ఇక సెక్షన్ ప్రజలను తనకు అనుకూలంగా మార్చుకొని అందులో కొందరిని ఇన్‌ఫార్మర్లుగా తయారు చేసింది. మరికొందరిని కోవర్టులుగా తయారు చేసి దళాల్లోకి పంపి నాయకత్వాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నది. అంతేగాక పోలీసులు కళాబృందాలను ఏర్పాటుచేసి నాటకాలతో ఉద్యమంపై దుష్ప్రచారం చేయిస్తున్నారు.

పోలీసుల ఇన్ఫార్మర్, కోవర్టుల కుట్రలను పార్టీ పసిగట్టి తగిన చర్యలను తీసుకున్న తీరు ఇలా వుంది.

జిల్లాలోని లింగాల మండలం దారారం గ్రామానికి చెందిన ఆరుగురు యువకులను పోలీసులు లోబర్చుకొని మైత్రి సంఘం పెట్టి, నామమాత్రపు ఉపాధిని కల్పిస్తూ ఇన్ఫార్మర్లుగా ఉపయోగించుకుంటున్నారు. వీరు దళాల ఆచూకీని పట్టుకోవడానికి మేకల కాపరులుగా , కట్టె వ్యాపారులుగా, పొయ్యిల కట్టెలు సరుకునే వారిలాగా అడవిలో తిరుగుతూ దళాల సమాచారాన్ని పోలీసులకు అందించసాగారు. దీనిని గ్రహించిన పార్టీ నవంబర్ 5వ తేదీన వీరిలోని 5గురిని పట్టుకొచ్చి దేహశుద్ధి చేసింది. వీరు వెంటనే మైత్రి సంఘానికి రాజీనామా చేశారు. సాధారణ జీవితం గడుపుతామని విలేఖరుల ముందు మాట్లాడారు.

పెద్దకొత్తపల్లి మండలం, యాపట్ల గ్రామానికి చెందిన సుందర్‌గౌడ్ అనే వ్యక్తి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా వుంటూ అతన్ని పార్టీ రెండుసార్లు హెచ్చరించింది. అయినా మారకపోవడంతో విచారించడం కోసం దళ సభ్యులు వూరు బయటకు తీసుకువస్తుండగా అతను పారిపోయే ప్రయత్నం చేశాడు. పారిపోతున్న అతనిపై దళ సభ్యులు అనివార్యంగా కాల్పులు జరుపడంతో అతను చనిపోయాడు.

అచ్చంపేట మండలం ఐనోలు గ్రామానికి చెందిన బద్దెల పర్వతాలు హోంగార్డుగా పని చేస్తూ, పోలీసులకు ఇన్ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇతన్ని పట్టుకొని విచారిస్తే అతని దుర్మార్గాలు బయటపడ్డాయి. దానితో అతన్ని చంపాలని పార్టీ నిర్ణయించింది. ఆ మేరకు అతన్ని చంపడం కోసం వెళ్లిన యాక్షన్ టీం అతనిపై కాల్పులు జరిపింది. అయితే ఆ కాల్పులకు గాయపడి అతను పడిపోవడంతో చనిపోయాడని భావించి టీం సభ్యులు వచ్చేశారు. ఆ తర్వాత అతను హాస్పిటల్‌లో చనిపోయాడు.

కొల్లాపూర్ మండలం ఎన్మనబెట్ల గ్రామానికి చెందిన రఫీక్ అనే పార్టీ సంబంధాలలో వుంటున్న 23 ఏళ్ల యువకుడిని పోలీసులు పట్టుకున్నారు. అయితే పట్టుకున్నట్టు బయటకు పొక్కకుండా జాగ్రత్త పడి కోవర్టుగా మార్చుకొని వదిలేశారు. ఆ తర్వాత అతడు యధావిధిగా పార్టీతో సంబంధాలు కొనసాగించసాగాడు. అయితే ఒకసారి అతను ఇచ్చిన సమాచారంపై అనుమానం వచ్చి పార్టీ అతన్ని పరిశీలనలో పెట్టింది. ఆ పరిశీలన కాలంలో అతను నాలుగుసార్లు ద్రోహానికి పాల్పడ్డాడు. సి.ఐ సంతోష్‌కుమార్‌తో ప్రత్యక్ష సంబంధాలను కల్గివుంటూ అతనికి అపాయింట్‌మెంట్ పెట్టిన ప్రతిసారి పోలీసులకు సమాచారం ఇచ్చి వచ్చేవాడు. కాబట్టి అతనికి అపాయింట్ పెట్టిన స్థలంకు పోలీసు బలగాలు తరలి వచ్చేవి. అయితే జాగ్రత్తగా వుండడం వల్ల అన్నిసార్లూ ప్రమాదం తప్పింది.

ఇతన్ని పట్టుకొని ఇంటరాగేట్ చేయగా జిల్లా నాయకత్వాన్ని దెబ్బతీయడం కోసం ఇతన్ని నియమించిన విషయమూ స్పెషల్ ఇంటలిజెన్సీ విభాగంలో ఇతనికి ఉద్యోగం ఇచ్చిన విషయమూ బయటపడ్డాయి. దీనితో పి.ఎల్.జి.ఎ ఇతన్ని ఖతం చేసింది.

అమ్రాబాద్ జిల్లాలో మారడుగు గ్రామంలో కొందరు సానుభూతిపరులను పోలీసులు పట్టుకొని రోజూ పోలీసు స్టేషన్‌కు పిలిపించుకుంటూ వారిని లోబర్చుకునే ప్రయత్నం చేశారు. కానీ

వారు లొంగలేదు. అయితే దళం సరిగ్గా పరిశీలించక వారు ఇన్‌ఫార్మర్లుగా మారారని భావించి వారిని కొట్టింది. అయితే ఆ తర్వాత వారు ఇన్‌ఫార్మర్లుగా మారలేదనే నిజాన్ని పార్టీ గ్రహించింది. ఇట్లా దళం వారిని కొట్టిన సంఘటనను ఆసరాగా చేసుకొని పోలీసులు వారిపై సానుభూతిని చూపిస్తూ చేరదీసి ద్రోహులుగా మార్చడానికి మళ్ళీ ప్రయత్నించారు. అయితే తీవ్ర రాజ్యహింసను భరిస్తూ కూడా పార్టీనీ ప్రాణాల కంటే మిన్నగా కాపాడుకుంటున్న లక్షలాది ప్రజలకు వారసులుగా వీరు ఈసారి కూడా లొంగడానికి సిద్ధపడక పోలీసుల నీచత్వాన్ని ఛీకొట్టారు.

ఇలా జిల్లాలో పోలీసుల కుట్రల ఫలితంగా ఇన్ఫార్మర్లుగా, కోవర్టులుగా మారిన వారిపై ఉద్యమ ప్రయోజనాలకు లోబడి చర్యలను తీసుకోవాల్సి వస్తున్నది. రోజు రోజుకు వికృత రూపం దాలుస్తున్న రాజ్యహింసను ఎదుర్కోవడంలో భాగంగానే విప్లవోద్యమం ఇటువంటి ప్రతిహింసకు పాల్పడవల్సి వస్తోంది. కాబట్టి నక్సలైట్లు అమాయకుల్ని చంపుతున్నారు. పేద ప్రజల్ని చంపుతున్నారు అని గగ్గోలు పెడుతున్న ప్రభుత్వాలే ఈ చర్యలకు బాధ్యతపడాలి.

### కాంగ్రెస్ ప్లీనరీని వ్యతిరేకిస్తూ....

దేశీయ కాంగ్రెస్ ప్లీనరీని హైదరాబాద్‌లో తలపెట్టిన సందర్భంగా దాన్ని వ్యతిరేకిస్తూ మహబూబ్‌నగర్ జిల్లాలోని అమ్రాబాద్ మండలం ఇప్పలపల్లి, ఉడుమిళ్ళ, మారడుగు మొదలైన 14 గ్రామాల్లో దళం వాల్‌పోస్టర్లు వేసి ప్రచారం నిర్వహించింది. 2006, జనవరి 21 నాడు ఇదే విషయంపై చిట్లంకుంట గ్రామంలో బహిరంగ సభ నిర్వహించి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతుండగా అటుగా ఒక వాహనం వచ్చింది. దాంట్లో వున్నది ప్రజలని భావించి ఆపగా అందులో పోలీసులు వున్నారు. నక్సలైట్లను ముందే గమనించిన పోలీసులు కాల్పులు జరిపారు. ఆ కాల్పులను ప్రతిఘటిస్తూ దళం క్షేమంగా రిట్రీట్ అయింది.

### సోమిదేవిపల్లి రైల్వేస్టేషన్ పేల్చివేత, బ్రాందీ షాపు దగ్ధం

ఏప్రిల్ చివరి నుండి మొదలుకొని కడప, నల్గొండ, నల్లమల డివిజన్లలో జరిగిన ఎన్‌కౌంటర్లకు నిరసనగా మే 4వ తేదీన నల్లమల డివిజన్‌కు చెందిన మావోయిస్టులు ప్రకాశం జిల్లా రాచర్ల మండలం సోమిదేవిపల్లి రైల్వేస్టేషన్‌ను పేల్చివేశారు. ముగ్గురు మావోయిస్టులు ఈ ప్రతిఘటన చర్యలో పాల్గొన్నారు. ఈ చర్యవల్ల గుంటూరు-బెంగుళూరు రైల్వే మార్గంలో పోలీస్ నిఘాను ఛేదించి మావోయిస్టులు ఈ చర్యను చేయడంతో పోలీసు వర్గాలు ఉలిక్కిపడ్డాయి. అలాగే ఇదే జిల్లా గిద్దలూరు మండలం ముండ్లపాడు గ్రామంలో బ్రాందీ షాపును కూడా మావోయిస్టులు తగులబెట్టారు.

### మే 6న రాష్ట్ర బంద్

కడప జిల్లాలో అత్యంత హేయంగా కోవర్టు చర్యకు పాల్పడి 6గురు మహిళలతో సహా తొమ్మిది మంది మావోయిస్టులను హత్య చేసీ, నల్గొండ జిల్లాలో నల్గురు కామ్రేడ్స్‌ను వెంటాడి కాల్చిన చంపిన, ప్రకాశం జిల్లాలో ఒక మావోయిస్టు జంటను పట్టుకొని బూటకపు ఎన్‌కౌంటర్లో కాల్చిచంపిన హంతక చర్యలకు వరుసగా పాల్పడ్డారు ఆంధ్రప్రదేశ్ పోలీసులు. ఈ హత్యలకు నిరసనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ మే 6న రాష్ట్రబంద్‌కు పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా విస్తృతంగా పోలీస్ బందోబస్తును నిర్వహించినప్పటికీ పల్లెలకు బస్సులను బంద్ చేసి ప్రభుత్వం తన అశక్తతను చాటుకుంది. ప్రకాశం, ఖమ్మం జిల్లాలో ఈ బంద్ మంచి ప్రభావాన్ని వేసింది.

## ఉత్తర తెలంగాణ రిపోర్టులు

### ఖమ్మం జిల్లా

### ప్రచారం

వెంకటాపూర్ ఏరియాలోని చర్ల, వెంకటాపూర్, వాజేడు మండలాల్లో సి.పి.ఐ, సి.పి.ఎం పార్టీల రివిజనిస్టు రాజకీయాలను వ్యతిరేకిస్తూ పోస్టర్లు, వాయిస్, కరపత్రాలు, ప్రకటనలు, గ్రామాల్లో మీటింగుల ద్వారా ప్రచారం చేయడం జరిగింది. చర్ల మండలం 30 గ్రామాల్లో, వెంకటాపూర్ మండలంలో 15 గ్రామాల్లో, వాజేడు మండలంలో 10 గ్రామాల్లో పోస్టర్లు వేయటం జరిగింది. దండకారణ్యంలో సల్వాజుడూం పేర ప్రజలపై జరుగుతున్న ఫాసిస్టు దాడుల గురించి చర్ల మండలంలోని పూజారికాంకేర్, భీమవరం, రాంపూర్, పెద్దఊట్ల, చిన్నఊట్ల గ్రామాల్లో మీటింగ్‌లు జరిగాయి. ఈ మీటింగులకు 200-300 మంది ప్రజలు వచ్చారు. మార్చి 8 సందర్భంగా ఏరియాలో మహిళలపై కమ్మ, కాపు, రాజులు చేస్తున్న దుర్మార్గాలను వ్యతిరేకిస్తూ, మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరిస్తూ పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రచారం జరిగింది. శత్రు నిర్బంధం, డిసెంబర్ 2 పి.ఎల్.జి.ఎ ఆవిర్భావ దినోత్సవం గురించి 30 గ్రామాల్లో పోస్టర్లు, వాయిస్ ద్వారా ప్రచారం జరిగింది. 7 గ్రామాల్లో మీటింగ్‌లు జరిగాయి.

**పినపాక మండలం :** సల్వాజుడూం దారుణాల గురించి మండలంలోని అన్ని గ్రామాల్లో పోస్టర్ల ద్వారా ప్రచారం జరిగింది. మండలంలో ఆదివాసీల పేరన వున్న భూముల్లో అటవీశాఖ ప్లాంటేషన్ వేయడానికి సిద్ధమవుతుండగా వెంకటాపురం, రఘునాధపాలెం గ్రామాల ప్రజలు తమ భూములను తామే సాగుచేస్తామని అటవీశాఖ అధికారులకు వ్యతిరేకంగా ఉద్యమించి భూమిని తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు.

తునికాకు కాంట్రాక్టర్ల నుండి నక్సలైట్లకు నిధులు అందుతున్నాయని, ఆదివాసీలకు బ్రతుకుదెరవులో భాగమైన తునికాకు తెంపే కార్యక్రమాన్ని గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం బంద్ పెట్టింది. కానీ, కాంట్రాక్టర్ల, రాజకీయ నాయకుల లాభాలకోసమైనా వాళ్ళ ఒత్తిడి వల్ల ఆకు తెంపక తప్పని పరిస్థితి కాబట్టి, శ్రమకు తగ్గ ఫలితం దక్కాలని డిమాండు చేస్తూ, ఆకు రేటు పెంచాలని, 50 ఆకుల కట్టకు రూ॥ 1.20పై ఇవ్వాలని బూర్గంపాడు ఏరియాలోని పినపాక, మణుగూరు మండలాల్లో పోస్టర్లు వేసి ప్రచారం చేయటం జరిగింది.

## సంక్షేమ కార్యక్రమాలు

### పి.ఎల్.జి.ఏ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు

వర్షాకాలంలో ఆదివాసీ ప్రజలు మలేరియా, టైఫాయిడ్, డయేరియా తదితర జబ్బులతో అనేక మంది చనిపోతున్నా ప్రభుత్వం గాని, ఆదివాసీల కోసం పని చేస్తున్నామని చెప్పుకునే సి.పి.ఎం పార్టీగాని ఏమాత్రం పట్టించుకోవటం లేదు. ఈ సమస్యపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా ప్రజలను పోరాటం చేయిస్తూ, పి.ఎల్.జి.ఎ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు నిర్వహించటం జరిగింది.

చర్ల మండలంలోని 15 మారుమూల అటవీ ప్రాంత గ్రామాలకు, ఐదు గ్రామాలకు ఒకటిచొప్పున మెడికల్ క్యాంపులు పెట్టి ప్రజలకు మందులు పంపిణీ చేయటం ద్వారా చాలా వరకు జబ్బులబారిన పడకుండ రక్షించటం జరిగింది. ప్రతి సంవత్సరం ఇటువంటి క్యాంపులు నిర్వహించాలని, ఏ ప్రభుత్వాలు కూడా తమను పట్టించుకోవని, పార్టీ నాయకత్వంలో మనల్ని మనమే కాపాడుకోవాలని ప్రజలు గ్రహించారు. ఈ క్యాంపుల పట్ల ప్రజల్లో మంచి స్పందన వచ్చింది. గుట్ట మీది గ్రామాల ప్రజల ఆర్థికస్థితి దృష్టిలో వుంచుకుని ఆరు గ్రామాల ప్రజలకు ఇంటింటికి బట్టలు, 20 కిలోల బియ్యం, విత్తనాలు పంపిణీ చేయటం జరిగింది.

### వరద బాధితులకు సహాయం

ఖమ్మం జిల్లా శబరి ఏరియాలో 2005 సెప్టెంబర్‌లో గోదావరి వరద ముంపుకు గురై కొండరెడ్లు సర్వం కోల్పోయి నిర్వాసితులయ్యారు. వారికి తినడానికి తిండి కూడ లేని పరిస్థితిలో ఏరియా కమిటీ ఐదు గ్రామాల ప్రజలకు స్థానిక రైతుల నుండి 160 బస్తాల బియ్యం ఆర్థిక సహాయంగా ఇప్పించటం జరిగింది. ఇది ఓర్వలేని ప్రజాపంథా పార్టీ ప్రజల బియ్యం తీసుకోకుండా అడ్డుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేసింది. దీన్ని లెక్కచేయని వరద బాధిత ప్రజలు మావోయిస్టు పార్టీ ఇస్తున్న బియ్యాన్ని తీసుకుంటామని వాలంటరీగా ముందుకు వచ్చి పంపిణీ చేసుకున్నారు. కష్టకాలంలో పార్టీ తమను ఆదుకుందని, ఇంతకాలంగా ఇక్కడ వున్న ప్రజాపంథా పార్టీ తమకెలాంటి న్యాయం చేయలేదని ప్రజలు అభిప్రాయపడ్డారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలుపుదల చేసే శక్తి మావోయిస్టు పార్టీకే ఉందని, దీనిపై పార్టీ నాయకత్వంలో ప్రజల్ని కదిలించాలనీ ప్రజలలో చర్చ జరుగుతున్నది.

### శత్రువును చికాకుపరిచే చర్యలు

వెంకటాపూర్ ఏరియాలో శత్రు దాడులకు అడ్డుకట్ట వేయడానికి పి.ఎల్.జి.ఎ బలగాలు, మిలీషియా శత్రువును చికాకుపరిచే చర్యలు జరిపారు.

వెంకటాపూర్ మండలం మురుమూరు ప్రాజెక్టు వద్ద జనవరి 13వ తేదీన గుట్టపైకి వస్తున్న పోలీసు బ్యాచ్ పైన చేసిన ఆంబుష్‌తో గందరగోళపడిన శత్రువు గుట్ట పైకి రాకుండ వెనుదిరిగి పోయాడు.

నిర్బంధానికి వ్యతిరేకంగా మిలీషియా చర్ల మండలం దగ్గర్లోని రోడ్డుపై మైన్ పేల్చింది. అలాగే ఉద్యమ అణచివేతలో భాగంగా వేస్తున్న రోడ్డు నిర్మాణ పనులు బంద్ చేయాలని పొక్లైనర్ తగులబెట్టడం జరిగింది.

**విప్లవకారుల మరణం హిమాలయాలకంటే ఉన్నతమైనది!**
**వారి అమరత్వాన్ని కొనియాడుదాం! వారి బాటలోనే నడుద్దాం!!**

## ఏ.ఓ.బి

### పోరాటాలు

### కేంద్రకమిటీ సభ్యుల అరెస్టుకు నిరసనగా ర్యాలీ

మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ నాయకులు కామ్రేడ్స్ బరుణ్, విజయ్, తపస్‌లను విడుదల చేయాలనీ, వారి మీద మోపిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మల్కాన్‌గిరి జిల్లా కలిమెల ఏరియాలో 2006, జనవరి 15వ తేదీన ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో 150 మంది విప్లవ ప్రజానీకం పాల్గొన్నారు. బ్యానర్లను చేతబూని , ప్రభుత్వ వ్యతిరేక నినాదాలను చేస్తూ వీరంతా తమ నిరసనను ప్రకటించారు.

### దేశవ్యాప్త బంద్‌లో భాగంగా మల్కాన్‌గిరి జిల్లా బంద్

దేశవ్యాప్తంగా మావోయిస్టు ఉద్యమంపై ప్రభుత్వం ఫాసిస్టు హింసాకాండకు పాల్పడుతున్నది. ముఖ్యంగా సల్వాజుడూం పేరుతో దండకారణ్యంలో ఫాసిస్టు హత్యాకాండకు పాల్పడుతున్నది. ఆంధ్రప్రదేశ్‌లో నల్లదండు ముఠాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా విప్లవకారులనూ, సానుభూతిపరులనూ, ప్రజాస్వామికవాదులనూ హత్య చేస్తోంది. అలాగే జార్ఖండ్‌లోనూ సేంద్ర పేరుతో అణచివేతను కొనసాగిస్తోంది. ఈ పిలుపులో భాగంగా మల్కాన్‌గిరి డివిజన్‌లో విప్లవ ప్రజానీకం గ్రామ గ్రామాన పోస్టర్లు వేసి, కరపత్రాలు పంచి ప్రచారం చేశారు. 26వ తేదీన మిలీషియా దళాలు మల్కాన్‌గిరి - మోటు రోడ్డుపై అనేక చోట్ల చెట్లు నరకివేసి, బ్యానర్లు కట్టి వచ్చారు. దీనితో వాహనాల రాకపోకలకు అవరోధం ఏర్పడి బంద్ విజయవంతం అయింది. కలిమెల టౌన్‌లో దుకాణాలు బంద్ చేశారు.

### గిట్టుబాటు ధరలకోసం రైతుల ర్యాలీ

కలిమెల ఏరియాలోని ప్రజలు తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కావాలంటూ 2005, డిసెంబర్ 20వ తేదీన కలిమెలలో ర్యాలీ తీసారు. వరిధాన్యం నువ్వులు, పెసర్లు, వెదురు రేట్లు పెంచాలంటూ నినాదాలు చేస్తూ, బ్యానర్లతో వూరేగింపు చేసి బ్లాక్ ఛైర్మన్‌కు మెమోరాండం సమర్పించారు. ఈ ఆందోళనలో 300 మంది స్త్రీ, పురుషులు పాల్గొన్నారు.

### ప్రజా వ్యతిరేకులకు భౌతిక శిక్షలు

మల్కాన్‌గిరి జిల్లా కలిమెల బ్లాక్‌లోని 120 నంబర్ బెంగాలి క్యాంపులో వుంటున్న జగదీష్ అనే చౌకీదారు పోలీసు ఇన్‌ఫార్మర్‌గా పనిచేస్తూ అనేక మంది సానుభూతిపరులను అరెస్టు చేయించాడు. అంతేగాక అక్రమ కలప రవాణాకు పాల్పడుతున్నాడు. మొదట ఓసారి హెచ్చరించినా వినకపోయేప్పటికి దళమూ, మిలీషియా సభ్యులు కల్సి వెళ్లి అతన్ని కొట్టి వూరు నుండి వెళ్లిపోవాలని హెచ్చరించారు.

ఇదే బ్లాక్‌లో తెల్లరాయి గ్రామంలో వుంటున్న ఉపేన్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. అధికార బిజెపికి చెందిన ఇతడు బ్లాక్‌లోని ప్రతీ కాంట్రాక్టరునూ పొందే ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ పనుల్లో విపరీతమైన అవినీతికి పాల్పడుతున్నాడు. కూలీలకు తక్కువ డబ్బులు ఇస్తున్నాడు. ప్రభుత్వం కుట్రపూరితంగా అభివృద్ధి పేరుతో ఇక్కడ రోడ్లు వేయతలపెట్టింది. రోడ్లను వేయసాగాడు. దీనితో మిలీషియాతో కల్సి దళం వెళ్లి అతడిని కొట్టి అక్కడ పని చేస్తున్న రోడ్డు రోలర్‌ను పేల్చివేయడం జరిగింది.

ఇదే బ్లాక్‌లోని బెజ్జంకివాడ గ్రామంలో వుంటున్న రాం మాష్టారు పోలీసు ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తున్నాడు. 2006, మార్చి 10వ తేదీన బెజ్జంకి వాడ సంతకు వెళ్లిన మిలీషియా సభ్యులు గంగాల్, ఇర్మాల్, సింగాల్‌లను అరెస్టు చేయించడంలో ముఖ్యపాత్ర వహించాడు. దానితో ప్రజలందరి ముందు అతన్ని దేహశుద్ధి చేయడం జరిగింది.

ఇదే బ్లాక్‌లోని బొడిగట్ట గ్రామస్తుడైన గట్ట ఇర్మాల్ వడ్డె (భూత వైద్యుడు) పని చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. గ్రామంలో ఎవరైనా జబ్బుపడి చనిపోతే తానే మంత్రం చేసి చంపానని ప్రచారం చేసుకున్నాడు. భూత వైద్యం పేరుతో ప్రజల దగ్గర కోళ్లు, బియ్యం, సారా, డబ్బులు దండుకుంటున్నాడు. వ్యతిరేకించిన సంఘ సభ్యులను బెదిరిస్తున్నాడు. దళ సభ్యుల తల్లిదండ్రులను కూడా బెదిరిస్తూ, దళ సభ్యులు బయటకు వచ్చేలా వత్తిడి చేస్తున్నాడు. ఇతను పాల్పడుతున్న ప్రజావ్యతిరేక కార్యకలాపాలను మార్చుకోవాలని హెచ్చరిస్తూ ఇతన్ని మిలీషియా, దళ సభ్యులూ కల్సి కొట్టారు.

### భూస్వామి ఇంటిపై దాడి

కలిమెల బ్లాక్‌లోని గ్రామానికి చెందిన గంగాలు ఒక భూస్వామి. ఇతను పంచాయితీ మెంబరుగానూ, వడ్డెగానూ పని చేస్తూ అన్ని అధికారాలను తన చేతుల్లో పెట్టుకుని ప్రజలను వేధించేవాడు. 25 సం॥రాల క్రితం మరిగట్ట, బాడిగట్ట, కొర్రుబు గ్రామప్రజలు కల్సి సమిష్టిగా 10 ఎకరాల భూమిలో టేకు ప్లాంటేషన్

*(.....తరువాయి 31వ పేజీలో)*

# పత్రికా ప్రకటన

భూటాన్ కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు) మొదటి జాతీయ మహాసభ ఒక మారుమూల గ్రామంలో, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన తన ప్రతినిధుల మధ్య నాలుగు రోజులపాటు జరిగింది. 2006 జనవరి 31 నుండి ఫిబ్రవరి 3వ తేదీ వరకు మహాసభ జరిగింది. స్వేచ్ఛా కాంక్షిత భూటాన్ ప్రజల కోసం జరుగుతున్న పోరాట మార్గంలో ఇది మైలురాయిగా నిలుస్తుంది. పార్టీ చరిత్రలో ఇది చారిత్రాత్మక దినం. పార్టీ ఆవిర్భావం నుంచి మా సి.పి.బి(ఎం.ఎల్.ఎం) అభివృద్ధి క్రమంలో అనేక ఎత్తుపల్లాలను అధిగమించింది. అనేక నష్టాలను అలాగే విజయాలను చవిచూసింది. అంతర్జాతీయ గీతాన్నాలపించి, అమరవీరులకు ఒక నిమిషంపాటు శ్రద్ధాంజలి ఘటించడంతో మహాసభ ప్రారంభమైంది. సి.పి.బి(ఎం.ఎల్.ఎం) సాహసయోధుల్లో ఒకరు తన కర్తవ్య నిర్వహణలో శత్రు(పోలీసు) చేత జిక్కి పార్టీ చరిత్రలో మొట్టమొదటగా అమరుడైన కా॥ చంద్రబిందును ఎత్తిపడుతూ జరిగిన అమరవీరులకు శ్రద్ధాంజలి కార్యక్రమం కార్యకర్తలకు నూతనోత్తేజాన్నిచ్చింది. ఫలితంగా, మొదటి మహాసభ ఈ క్రింది చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. ఈ ప్రకటన ద్వారా మహాసభ నిర్ణయాలను ప్రజలకు తెలియజేస్తున్నాము.

పార్టీ పేరు నేపాలీ భాషలో అలాగే వుంటుంది. కాని, ఇంగ్లీషులో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ భూటాన్(మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు)గా, సంక్షిప్తంగా సి.పి.బి(ఎం.ఎల్.ఎం)గాను వుంటుంది. మహాసభకు ముందు పార్టీ పేరు భూటాన్ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు)గా, సంక్షిప్తంగా బి.సి.పి(ఎం.ఎల్.ఎం)గా వుండటాన్ని గుర్తుంచుకోవాలి. తన కార్యక్రమాలు, పార్టీ పంథానుసరించి పార్టీ పేరును నిర్ణయించడానికి సుదీర్ఘమైన చర్చలు, ఇతరులతో కలయికల తర్వాత మహాసభ చివరికి ఈ పేరును నిర్ణయించింది.

ప్రధాన డాక్యుమెంటు అయిన కార్యక్రమం-విధానంతో పాటు నాలుగు పార్టీ డాక్యుమెంట్లను మహాసభ ఆమోదించింది. పార్టీ కేంద్ర ఆర్గనైజింగ్ కమిటీ ఐదవ ప్లీనంలో పార్టీ ప్రణాళికను కూడా ఆమోదించడం జరిగిందని తెలియజేస్తున్నాము.

రెండు పంథాల మధ్య పోరాటాన్ని "పార్టీ-జీవితం"గా చైతన్యవంతమైన రూపంలో పార్టీ అన్వయించింది. గత అనుభవాల నుండి తీసిన పాఠాలతో ఎక్కువ మందితో కూడిన పెద్ద కమిటీలను ఆచరణానుకూలమైన అధునాతన కమిటీలుగా విడగొట్టి, విప్లవకర "ఏకీకృత శక్తి"గా రూపొందించటంలో ఈసారి మహాసభ విజయవంతమైంది. ఆవిధంగా పార్టీ కార్యకర్తలందర్నీ పార్టీ విధానాలను అమలు చేయటంలో, పార్టీని సైనిక ప్రాధాన్యతగల, సైనిక పార్టీ ప్రాధాన్యతగలదిగా రూపొందించటంలో మరింత ఆచరణాత్మకంగా, మరింత బాధ్యతాయుతంగా తయారు చేయడానికి మహాసభ గొప్ప కృషి జరిపింది.

మారిన దేశీయ, అంతర్జాతీయ పరిస్థితుల వల్ల గతంలో రూపొందిన పార్టీ కార్యక్రమం - విధానం ఆచరణాత్మకం కాదని పార్టీ పూర్తిగా విశ్లేషించింది. దేశ పరిస్థితిని స్వీయాత్మకంగా, వస్తుగతంగా అధ్యయనం చేసి, తదుపరి దశ నుండి పోరాటాన్ని ప్రారంభించడానికి విప్లవ పరిస్థితి అమోఘంగా వుండటం వల్ల ఆ విధంగా, దేశీయ, అంతర్జాతీయ రాజకీయ పరిస్థితిని దృష్టిలో వుంచుకుని, మహాసభ నూతన కార్యక్రమం, విధానాలను రూపొందించింది. దేశ ప్రజల, జాతి, పీడిత వర్గాల ప్రయోజనాలకొరకు ప్రాణాలర్పించడానికి సంకోచించబోమని పార్టీ ప్రతినిధులందరూ ముక్త కంఠంతో శపథం చేశారు. దోపిడీ, పీడనలకు గురౌతున్న ప్రజలకోసం జరిగే పోరాటంలో తమ కర్తవ్య నిర్వహణకై నిరంకుశ భూస్వామ్య రాజుకు, అతని తైనాతీలకు వ్యతిరేకంగా పోరాడటానికి తమ రక్తాన్ని చిందిస్తామని ప్రతినిధులందరూ మరోసారి శపథం చేశారు.

*(తరువాయి 25వ పేజీలో.....)*

*(.....40వ పేజీ తరువాయి)*

ఆందోళనకు, ప్రత్యేకించి వైద్య విద్యార్థుల ఆందోళనకు రహస్యంగా తోడ్పాటు నందిస్తున్నాయి. రెసిడెంట్ డాక్టర్లను రిజర్వేషన్లకు వ్యతిరేకంగా సమ్మె చేయడానికి అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎ.ఐ.ఐ.ఎం.ఎస్) డైరెక్టర్ ప్రత్యక్షంగానే ప్రోత్సహిస్తున్నాడు.

భారతదేశంలో కుల వ్యవస్థ ఒక వాస్తవం. కులాధారిత పీడన ఇంకా వాస్తవం. కొనసాగుతున్న సామాజిక పీడన, పెరుగుతున్న అసమానతల నేపథ్యంలో ఉద్యోగాలు, విద్యలో రిజర్వేషన్ల డిమాండ్ న్యాయమైనది, ప్రజాస్వామికమైనది. అయిష్టంగా అతి తక్కువ ఉద్యోగాలు కల్పించటం, నిర్లక్ష్యం లేకుంటే, రిజర్వేషన్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్.సి, ఎస్.టి ఉద్యోగుల సంఖ్య ఎంత శాతం వుండేదో కన్పించేది. అందువల్ల ఈ వాస్తవమైన, రిజర్వేషన్ల ప్రజాస్వామిక డిమాండ్‌కు అన్ని సెక్షన్ల ప్రజలు తప్పనిసరిగా మద్దతు నివ్వవలసి వుంది.

ఉన్నత విద్యా సంస్థల్లో సీటు పొందటానికి అగ్రకుల ధనిక సెక్షన్‌కు డబ్బు, రాజకీయ ప్రాబల్యం వున్నాయి. వాస్తవానికి ప్రతిభది ద్వితీయ పాత్రనే. ఈ ఉన్నత విద్యా సంస్థల్లో , పైస్థాయి ఉద్యోగాల్లో పాతుకుపోయిన అగ్రకుల బ్రాహ్మణుల ఆధిపత్యం వల్ల పీడిత కులాలకు చెందిన తెలివైన విద్యార్థులకు ఇందులో సీట్లు దక్కని సంఘటనలు మిక్కిలిగా వున్నాయి. ఈ ఉన్నత బోధనా సంస్థల్లో రిజర్వేషన్లు ఇంత వరకు అమలు కాలేదు. అవి లేకుండానే ఈ సంస్థలు ఎప్పటికీ దళారీ బడా వ్యాపార వర్గాల సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కొరకు సేవలందించాలనుకుంటున్నాయి.

బూర్జువా పార్లమెంటరీ పార్టీలు రిజర్వేషన్ విధానానికి వ్యతిరేకంగా బహిరంగంగా ముందుకు రావు. కాని, ఆ పార్టీలన్నీ రిజర్వేషన్ వ్యతిరేకోద్యమాన్ని ప్రోత్సహించేవే. రిజర్వేషన్ వ్యతిరేక సెంటిమెంట్లు, మైనారిటీ వ్యతిరేక సెంటిమెంట్లను రెచ్చగొట్టి ప్రజల్ని విభజించి పాలించాలని పాలకవర్గాలు ఎల్లప్పుడూ వాంఛిస్తుంటాయి.

అయితే, భారతదేశంలోని పీడిత కులాల మౌలిక సమస్యలను రిజర్వేషన్లు ఒక్కటే పరిష్కరించలేవనేది దృష్టిలో వుంచుకోవాలి. పేద, పీడిత ప్రజలకు, పీడిత కులాల మెజారిటీ ప్రజలకు అనుకూలంగా భూమి, సంపద, ఇతర ఆస్తుల పున:పంపిణీ వల్ల ఈ సమస్య పరిష్కారమౌతుంది. అంతకంటే ముఖ్యంగా కార్మికవర్గ నాయకత్వంలో అన్నికులాల పీడిత ప్రజలతో కలిసి వారు రాజకీయాధికారాన్ని సాధించగలగాలి. వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లను వ్యతిరేకించవద్దని, పాలకవర్గాల విభజించి పాలించే ఎత్తుగడలకు ఎర కావద్దని విద్యార్థి లోకానికి సి.పి.ఐ(మావోయిస్టు) కేంద్ర కమిటీ విజ్ఞప్తి చేస్తున్నది. మన దేశంలోని సామాజిక, ఆర్థిక అసమానతలను, పీడితుల పరిస్థితులకు సంబంధించిన కఠిన వాస్తవాన్ని గ్రహించవలసిందనీ, "ప్రతిభ"కు సంబంధించిన తప్పుడు వాదనలకు మోసపోవద్దని కూడా వారికి విజ్ఞప్తి చేస్తున్నాము.

రిజర్వేషన్ వ్యతిరేక సెంటిమెంట్లు రెచ్చగొడుతూ ప్రజల్ని విభజించే పాలకవర్గాల విధానాలను ఎండగట్టాలని ప్రజాస్వామిక వాదులకు, ప్రగతిశీల శక్తులకు కూడ విజ్ఞప్తి చేస్తున్నాం.

- ఉన్నత విద్యా సంస్థలు అతికొద్ది మంది అగ్రకుల ధనిక వర్గపు గుత్తాధిపత్యాన్ని ఎల్లప్పటికీ కొనసాగించలేవు.

- రిజర్వేషన్ ఒక సంస్కరణ మాత్రమే. పీడిత ప్రజల మౌలిక సమస్యల పరిష్కారానికి భూమి, సంపద, ఇతర ఆస్తుల పున:పంపిణీ, రాజకీయాధికారంలో పీడిత కులాలకు న్యాయమైన వాటా దక్కాలి.

- ప్రతిభ ఒక కల్పన. డబ్బు, రాజకీయ అండదండలకే ఉన్నత విద్యా సంస్థల తలుపులు తెరుచుకుంటాయి.

- సంపదనంతా పున:పంపిణీ చేసినపుడే రిజర్వేషన్లను తీసివేయాలి.

**ఆజాద్**

పత్రికా ప్రతినిధి

*కేంద్రకమిటీ(ప్రొవిజనల్)*

22 మే 2006

*సి.పి.ఐ(మావోయిస్టు)*

సి.సి ప్రకటన

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## రిజర్వేషన్లు భారత దేశపు పీడిత కులాల హక్కు! అగ్రకులాలు, హిందూ మతోన్మాద శక్తులు సెంటిమెంట్లు రెచ్చగొడుతూ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చేస్తున్న కుట్రల పట్ల జాగరూకులు కండి!

ఉన్నత విద్యా సంస్థల్లో వెనుకబడిన కులాల విద్యార్థులకు 27శాతం రిజర్వేషన్లు కల్పించాలని చేసిన ప్రకటనతో అగ్రకులాల విద్యార్థులు మరోసారి రిజర్వేషన్ వ్యతిరేక పోరాటానికి దిగారు. అగ్రకుల బ్రాహ్మణవాదులు, హిందూత్వ శక్తులు ఈ రిజర్వేషన్ వ్యతిరేక మంటను వారం రోజులుగా రాజేసి, ఆజ్యం పోస్తూంటే, తెరవెనుక జరిగిన అంగీకారంతో ప్రభుత్వం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నది. వివిధ రాజకీయ పార్టీలు తమ ప్రత్యర్థుల మీద ఎత్తుకు పైఎత్తులు వేయడానికి ఈ నిరసనల్ని ఉపయోగించుకుంటున్నాయి. ఢిల్లీ, ముంబాయి నగరాల్లో ఆందోళన జరుపుతున్న విద్యార్థులపై పోలీసులు దుర్మార్గంగా లాఠీ ఛార్జీ చేయడంతో, విద్యార్థుల ఆగ్రహావేశాలు తీవ్రమై, పెద్ద సంఖ్యలోనే ఈ ఆందోళనలో చేరారు.

విద్యార్థులపై పోలీసుల దాష్టీకాన్ని సి.పి.ఐ(మావోయిస్టు) కేంద్రకమిటీ ఖండిస్తున్నది. అలాగే రిజర్వేషన్ సమస్యను ఉపయోగించుకుని విద్యార్థులను విభజించాలని ప్రయత్నించే అగ్రకుల, బి.జె.పి-ఆర్.ఎస్.ఎస్-వి.హెచ్.పి నాయకత్వంలోని హిందూ మతోన్మాదుల, కాంగ్రెస్ తదితర పార్టీల దుష్ట పథకాలు, కుట్రల పట్ల విద్యార్థులు, ప్రజలు జాగరూకత వహించాలని హెచ్చరిక చేస్తున్నది. శతాబ్దాలుగా సమాజంలో తమ న్యాయమైన వాటాను దక్కించుకోలేకపోతున్న భారత సమాజంలోని ఆర్థికంగా, సామాజికంగా పీడనకు గురౌతున్న కులాలకు గల రిజర్వేషన్లను కేంద్రకమిటీ దృఢంగా సమర్థిస్తున్నది.

ఎస్.సి, ఎస్.టి, ఓ.బి.సిలకు రిజర్వేషన్లు కొనసాగిస్తే వృత్తి నైపుణ్యాతా ప్రమాణాలు, వాసి పడిపోతాయని, ప్రతిభగల విద్యార్థులకు అవకాశాలు దొరకవని రిజర్వేషన్ వ్యతిరేక పండితులు తమ వర్గస్వభావపు వాదనలు ఎక్కుపెడుతున్నారు. మనువు కాలం నుంచి అసహ్యకరమైన కుల వ్యవస్థ, కులాధారిత పీడన భారత ప్రజల్ని విభజిస్తున్న కఠిన వాస్తవాన్ని మరుగుపరచడానికి ప్రయత్నిస్తూ, పైగా రిజర్వేషన్ విధానం సమాజాన్ని విభజిస్తున్నదనే వాదన చేస్తున్నారు. పీడితులకు ఆర్థికంగా మద్దతు కల్పించాలని ఈ "ఉదారశీల" రిజర్వేషన్ వ్యతిరేకులు మొసలికన్నీరు కార్చుతూ సానుభూతి వాఖ్యాలు వల్లిస్తున్నారు గానీ, ఉన్నత విద్యా సంస్థల్లో స్థానం ఇవ్వడానికి మాత్రం ససేమిరా ఒప్పుకోరు. ఈ ఉన్నత విద్యా సంస్థల్లో అగ్రకులాల, బ్రాహ్మణుల, విదేశాల్లో నివసించే ధనిక వర్గాల గుత్తాధిపత్యమే కొనసాగుతున్నది. పారిశ్రామిక, వ్యాపార ప్రముఖులు మల్టీ మిలియనీర్లు అయిన టాటాలు, బిర్లాలు, అంబానీలు, నారాయణమూర్తి లాంటి దళారీ నిరంకుశ బూర్జువాలు కూడా వెనుకబడిన కులాల పీడిత సెక్షన్ల ప్రజలకు రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న పక్షంతో గొంతుకలిపి రిజర్వేషన్ల వల్ల భారతదేశం సాధిస్తున్న ప్రస్తుత "ప్రగతి" మందగిస్తుందని మాట్లాడుతున్నారు. ప్రతిభ అంటూ గొంతుచించుకుని చేసే "ప్రజాస్వామికవాదన", ప్రపంచబ్యాంకు - ఐ.ఎం.ఎఫ్ - డబ్ల్యు.టి.ఓ తదితర సామ్రాజ్యవాద శక్తులు ప్రతిపాదిస్తున్న అన్ని దేశాల మధ్య సమానత్వం అనే నాటకం లాంటిది.

కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేంద్రంలో కాంగ్రెస్(ఐ) నాయకత్వంలోని ప్రభుత్వం రెండు నెలల ముందు రిజర్వేషన్ విధాన ప్రకటన చేసింది. రెండు నెలలు గడిచినా, విధానాన్ని వెంటనే అమలు చేయడానికి మంత్రివర్గం ఇంతవరకు నిర్ణయం తీసుకోలేదు. ఇప్పుడు ఓ.బి.సిలకిచ్చే రిజర్వేషన్లకు పరిహారంగా ఉన్నత విద్యాసంస్థల్లో సీట్ల సంఖ్యను పెంచుతామని అగ్రకులాల సెక్షన్‌లను సంతృప్తి పరచడానికి ప్రయత్నిస్తున్నది. ఏ బూర్జువా పార్లమెంటరీ పార్టీ కూడ రిజర్వేషన్లను అధికారికంగా వ్యతిరేకిస్తూ ఈ రోజు వరకు ముందుకు రాలేదు. కాని, అనేక పార్టీలు రిజర్వేషన్ వ్యతిరేక

*(తరువాయి 39వ పేజీలో.....)*